PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 94 | విజయవాడ, శనివారం 5 నవంబర్ 2022 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Saturday 5 November 2022 | Rs

**ఇండియన్స్ ఇంటికి వెళ్లండి..**

- ట్విట్టర్ ఉద్యోగులను తొలగించిన మస్క్

లోపలి పేజీలో..




**సెమీస్ బెర్త్ ఖాయం చేసుకున్న కివీస్**

- ఇంగ్లండ్-శ్రీలంక మ్యాచ్‌పై అందరి దృష్టి
- టీ20 వరల్డ్ కప్

లోపలి పేజీలో..

## హోదా, విభజన హామీలు, విశాఖ ఉక్కుపై

# మోడీ ప్రకటన చేయాలి

### వైసిపి, టిడిపిలు పెదవి విప్పాలి

### డివైఎఫ్ఐ ధర్నాలో బివి రాఘవులు, డి.రాజా

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

విశాఖ ఉక్కు ను ప్రభుత్వ రంగంలో కొనసాగించడంతో పాటు, ప్రత్యేకహోదా, విభజన హామీలపై రాష్ట్ర పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్పష్టమైన ప్రకటన చేయాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి రాఘవులు డిమాండ్ చేశారు. రాష్ట్రానికి బిజెపి చేసిన మోసాన్ని నిరసిస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జంతర్‌మంతర్ వద్ద శుక్రవారం ధర్నా జరిగింది. ఈ ధర్నాకు సిపిఎం, సిపిఐలు సంఘీభావం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు చేస్తున్న ఉద్యమం కొనసాగుతుందని ప్రకటించారు. ఈ సందర్భంగా బి.వి రాఘవులు మాట్లాడుతూ విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలు రాష్ట్ర ప్రజల హక్కులని అన్నారు. మోడీ ప్రభుత్వం వీటిని అమలు చేయలేదని, ప్రత్యేకహోదాను ప్రకటించలేదని చెప్పారు. రాష్ట్ర ప్రజలు వ్యతిరేకిస్తున్నప్పటికీ విశాఖ ఉక్కును ప్రైవేటీకరించడానికే సిద్ధమౌతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12వ తేది విశాఖలో జరగనున్న నరేంద్రమోడీ పర్యటనలో రాష్ట్రాభివృద్ధి, ప్రత్యేకహోదా సాధన, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం వామపక్షాలు ఆందోళన చేస్తాయని చెప్పారు. రాష్ట్ర ప్రజలను మోసం చేసిన బిజెపిని ఒంటరి పాటు చేయాల్సిందేనని అన్నారు. మోడీ వైజాగ్ పర్యటన సందర్భంగానైనా వైసిపి, టిడిపిలు పెదవి విప్పుతాయా? అని ఆయన ప్రశ్నించారు. 'రాష్ట్ర ప్రజల కోసం మేం నిరసన తెలుపుతాం. వైసిపి, టిడిపిలు కలుస్తాయో లేదో తేల్చుకోవాలి' అని అన్నారు. "కేంద్రంలోని బిజెపి రాష్ట్రానికి ద్రోహం చేసింది. ఆ ద్రోహానికి అప్పుడు అధికారంలో ఉన్న టిడిపి, ఇప్పుడు అధికారంలో ఉన్న వైసిపి వంత పలుకుతున్నాయి. బిజెపికి రాజకీయంగా మద్దతు ఇస్తున్నాయి. ఆ రకంగా ఈ ద్రోహంలో వైసిపి, టిడిపిలు కూడా పాలుపంచుకుంటున్నాయి.' అని అన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించినా, పోలవరానికి నిధులు ఇవ్వకపోయినా, కడపకు ఉక్కును మంజూరు చేయకపోయినా, వైజాగ్ రైల్వే జోన్‌ను ముక్కలు చేసినా అధికారంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నోరు మెదపకపోతే, రాష్ట్రాన్ని పాలించడం దేనికని ప్రశ్నించారు. మూడు రాజధానులతో ఒరగబెట్టేదేముందని, ఉన్న రాజధానికే నిధులు లేవని అన్నారు. రాజధానిని చంద్రబాబు ఆనాడే పూర్తి చేసిఉంటే, ఈ సమస్య వచ్చేది కాదని అన్నారు. అప్పుడు చంద్రబాబు ఆ పొరపాటు చేశారని, ఇప్పుడు మూడు రాజధానుల పేరుతో ఏపికి రాజధానే లేకుండా జగన్మోహన్ రెడ్డి చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి బిజెపి చేసే ద్రోహంలో పాలుపంచుకుంటారా? లేకపోతే రాజకీయంగా బిజెపిని నిలదీసి హక్కులను సాధనకు ముందుకువస్తారో తేల్చుకోవాలని వైసిపి, టిడిపిల నుద్దేశించి ఆయన అన్నారు.

**హోదా ఉద్యమం కొనసాగుతుంది్ణ డి.రాజా**

ప్రత్యేక హెూదా కోసం వామపక్షాల ఉద్యమం కొనసాగుతుందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు. విభజన బిల్లు పార్లమెంట్‌లో చర్చకు వచ్చినప్పుడు ఏపికి ప్రత్యేక హెూదా ఇస్తామని అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ హామీ ఇస్తే, ప్రతిపక్ష బిజెపి నేతలు వెంకయ్య నాయుడు, అరుణ్ జైట్లీ కూడా మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఏపి ప్రజలను మోసం చేసిందన్నారు. విభజన హామీలు అమలు చేయాలని ప్రజలు ఉద్యమిస్తే, సిఎం జగన్మోహన్ రెడ్డి మూడు రాజధానులపేరుతో ప్రజల దృష్టి మళ్లిస్తున్నారని విమర్శించారు. డివైఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాము, జి.రామన్న మాట్లాడుతూ తిరుమల వెంకన్న సాక్షిగా, పార్లమెంట్ సాక్షిగా ఏపికి ప్రధాని మోడీ హామీలు ఇచ్చారని, అయితే అటు దేవుని మీదగానీ, పార్లమెంట్ మీదగానీ బిజెపికి గౌరవం లేదని విమర్శించారు. ఏపిలోని నిరుద్యోగుల ఆత్మహత్యలు పెరిగాయని, వెనుకబడిన జిల్లాలకు నిధులు ఇవ్వలేదని విమర్శించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఆర్.అరుణ్ కుమార్, ఐద్వా కోశాధికారి ఎస్.పుణ్యవతి, ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ఈ కార్యక్రమానికి సంఘీభావం తెలిపారు.డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.నాగేశ్వరరావు, రమణ, సహాయ కార్యదర్శి వి.శివకుమార్, ఎన్‌టిఆర్, ప్రకాశం జిల్లా అధ్యక్షులు పి. కృష్ణ, పిచ్చయ్య, తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కార్తీక్, రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఎంపిటిసి అరుణ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.




జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో పాల్గొని నినాదాలు చేస్తున్న బివి రాఘవులు, మద్దతు తెలుపుతున్న డి రాజా



దాడిలో గాయపడిన సెక్యూరిటీ అధికారి మధు (వృత్తంలో)

# చంద్రబాబుపై దాడికి యత్నం

- చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌కు గాయం

**ప్రజాశక్తి-నందిగామ, కంచికచర్ల, జగ్గయ్యపేట :**

మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడిపై దాడికి యత్నం జరిగింది. ఎన్‌టిఆర్ జిల్లా నందిగామలో శుక్రవారం రాత్రి ఆయన 'బాదుడే బాదుడు' నిరసన రోడ్‌షో నిర్వహించారు. టాపులేని జీపుపై నిలబడి ప్రసంగిస్తూ, ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకెళ్తున్న సమయంలో అనూహ్యంగా ఈ సంఘటన చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తి చంద్రబాబుపై రాయి విసిరారు. చంద్రబాబు పక్కనే ఉన్న చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మధుబాబుకి ఆ రాయి తగలగంతో ఆయన గడ్డం చిట్లింది. రక్తస్రావం అయింది. వెంటనే వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. ఈ సంఘటనతో బాబు పర్యటనలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. టిడిపి కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మరోవైపు ఎన్‌ఎస్‌జి కమాండోలు అప్రమత్తమైనారు. చంద్రబాబు చుట్టూ నిలబడ్డారు. భద్రతను కట్టుదిటం చేశారు. చంద్రబాబు వాహనం ముందు, వెనుక రోప్ పార్టీలను ఏర్పాటు చేశారు. అదనపు భద్రతా దళాలను కూడా రంగంలోకి దించారు. రోడ్‌షోను త్వరగా ముగించాలని పోలీసులు ఒత్తిడి చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ తీవ్ర ఆగ్రహం వక్తం చేశారు. అసమర్థులు దొంగల మాదిరి రాయి విసిరారని ఆయన అన్నారు. తన పర్యటనలో పోలీసు భద్రత సరిగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వైసిపి చేసే అరాచాకాలకు, విధ్వంసాలకు టిడిపి భయపడదని చెప్పారు. ధైర్యంగా ఎదుర్కోలేకే పిరికిపందల్లా దాడులకు దిగుతున్నారన్నారు. 'పులివెందుల రాజకీయాలు చేయవద్దు' అని ముఖ్యమంత్రి జగన్‌ను ఉద్దేశించి అన్నారు. జగన్ పాలనలో యువతకు భవిష్యత్ ఉండదని చెప్పారు. అంతకుముందు నందిగామ రైతుపేట సెంటర్లో గజమాలతో కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అలాగే కంచికచర్ల మండలం పరిటాల వద్ద మాజీ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య అధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు వెంట మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఉన్నారు.

**సిపిఎం, సిపిఐ ఖండన**

చంద్రబాబు వాహనంపై జరిగిన దాడి యత్నాని సిపిఎం, సిపిఐలు ఖండించాయి. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు విడుదల చేసిన ప్రకటనలో ప్రధాన ప్రతిపక్ష నాయకునికి భద్రత కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. దాడి చేసిన దుండగునిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మరోసారి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ విడుదల చేసిన ప్రకటనలో ప్రతిపక్షాలను అణచివేసే కుట్రతో జగన్మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని పేర్కొన్నారు. చంద్రబాబు కాన్వాయ్‌పై జరిగిన దాడి పోలీసుల వైఫల్యానికి నిదర్శనమని తెలిపారు. రాజకీయాల్లో ఇటువంటి దాడులు సరికాదని, దాడికి పాల్పడిన వారిని తక్షణం గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# వ్యవసాయంతో పాటు పారిశ్రామిక ప్రగతి

- ఇథనాల్ ప్లాంట్ శంకుస్థాపన సభలో సిఎం జగన్

**ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి**

వ్యవసాయంతో పాటు పారిశ్రామిక ప్రగతికి చర్యలు చేపట్టామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. టెక్ మహీంద్ర గ్రూప్‌నకు చెందిన అసాగో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.270 కోట్లతో తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డిలో ఏర్పాటు చేయనున్న ఇథనాల్ తయారీ ప్లాంట్‌కు శంకుస్థాపన, టెక్ మహీంద్ర సిఇఒ సిపి గుర్నానీతో కలిసి సిఎం భూమిపూజ చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో జగన్మోహన్‌రెడ్డి మాట్లాడారు. రెండు లక్షల లీటర్ల సామర్థ్యంతో ఏర్పాటయ్యే ఈ ప్లాంట్‌లో బ్రోకెన్ రైస్( బియ్యం నూకలు)తో ఇథనాల్ తయారీ చేస్తారని తెలిపారు. పాడైపోయిన, రంగుమారిన ఆహారధాన్యాలు, నూకలు, వ్యవసాయ ఉత్పత్తుల అవశేషాలు వినియోగించి ఇథనాల్‌ను తయారు చేయడంతో రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఇథనాల్‌తో పాటు పశువుల దాణా, చేపల మేతకు ఉపయోగపడే ప్రోటీన్ ఫీడ్‌ను బై ప్రోడక్ట్ కింద ఉత్పత్తి చేస్తారని తెలిపారు. ఈ ప్లాంట్‌ను జీరో లిక్విడ్ డిశ్చార్జ్ పద్ధతిలో కట్టడం వల్ల తక్కువ కాలుష్యం వెలువడుతుందన్నారు. 2025-26 నాటికి ప్రతి లీటరు పెట్రోల్‌లో 20 శాతం బయో ఇథనాల్ మిశ్రమం కలపడాన్ని తప్పనిసరి చేస్తూ ఇటీవలే కేంద్రం ఉత్తర్వులు జారీచేసిందని... ప్రస్తుతం లీటరు పెట్రోల్‌లో 8.41 శాతం ఇథనాల్ ఉంటుందని వివరించారు. కోటి లీటర్ల ఇథనాల్‌ను వినియోగించడం ద్వారా 20 వేల టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గుతున్నట్లు పలు పరిశీలనల్లో వెల్లడైందని వివరించారు. దీంతో అనేక సంస్థలు ఈ రంగంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయని తెలిపారు.అసాగో పరిశ్రమకు ఆరు నెలల కాలంలోనే అనుమతులు మంజూరు చేసి..ఈ రోజు భూమిపూజ చేస్తున్నామన్నారు. ప్రతి అంశంలోనూ తాము తోడుగా ఉంటామని అసాగో సిఇఒ గుర్నానీకి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి మరిన్ని పరిశ్రమలు వచ్చేలా తద్వారా తమ పిల్లలకు మరిన్ని ఉద్యోగాలు వచ్చేలా చేయడానికి అంబాసిడర్‌లా ఉండాలని గున్నానీని ఉద్దేశించి మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు విజ్ఞప్తి మేరకు ఏలేరు కుడి కాలువ నిర్మాణం కోసం రూ.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. భూ కేటాయింపుల నుంచి అన్ని అనుమతులు త్వరితగతిన మంజూరు చేయడం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిందని అసాగో ఇండస్ట్రీస్ సిఇఒ, మేనేజింగ్ డైరెక్టర్ ఆశీష్ గుర్నానీ తెలిపారు. ఈ పెట్టుబడుల ద్వారా హరిత పునరుత్పాదక ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, తానేటి వనిత, దాడిశెట్టి రాజా, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపిలు భరత్ రామ్, అనురాధ, వంగా గీతా, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తదితరులు పాల్గొన్నారు.



ఇథనాల్ పరిశ్రమకు టెక్ మహీంద్ర సిఇఒ గుర్నానీతో కలసి శంకుస్థాపన చేస్తున్న సిఎం జగన్



సిఇఓ మీనాకు మెమోరాండం ఇస్తున్న సిపిఎం, సిపిఐ రాష్ట్ర నాయకులు వి శ్రీనివాసరావు, జల్లి విల్సన్, వై వెంకటేశ్వరరావు

# దొంగ ఓట్లను అరికట్టండి

- ఎంఎల్‌సి ఎన్నికలపై సిఇఓకు సిపిఎం, సిపిఐ వినతి

లోపలి పేజీలో..



లిఖిత శ్రీ (ఫైల్)

## ప్రేమిస్తోందని కూతురిని చంపిన తండ్రి

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ** : ప్రేమ వ్యవహారం కారణంగా కన్న కూతురిని తండ్రి హత్య చేసిన ఘటన విశాఖపట్నం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం తీవ్ర సంచలనం సృష్టించింది. పోలీసుల వివరాల మేరకు.. రెల్లి వీధి ప్రాంతంలో ఇద్దరు కుమార్తెలతో వరప్రసాద్ నివసిస్తున్నాడు. ఇతను మహాప్రస్థానంలో అంబులెన్స్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల భార్య దూరం కావడం, మొదటి కూతురు ప్రేమ వ్యవహారంతో ఇంటి నుంచి వెళ్లిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. పదో తరగతి చదువుతన్న రెండో కూతురు లిఖిత శ్రీ (16) కూడా అరవింద్ అనే వ్యక్తిని ప్రేమిస్తుంది. కూతురిని మందలించినా మాట వినకపోవడంతో హత్య చేశాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# రూ.15 వేల పరిమితి రద్దు

- 2014 పథకంలోని నిబంధనలు చట్టబద్ధం
- ఇపిఎఫ్ పెన్షన్ స్కీమ్‌పై సుప్రీంకోర్టు తీర్పు

**న్యూఢిల్లీ :** ఇపిఎఫ్ పెన్షన్ స్కీమ్ కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. పెన్షన్ స్కీమ్‌లో చేరడానికి నెలవారీ జీతం రూ.15,000 పరిమితిని పక్కన పెట్టింది. ఉద్యోగుల పెన్షన్ సవరణ స్కీమ్-2014ను రద్దు చేసిన కేరళ, రాజస్థాన్, ఢిల్లీ హైకోర్టు తీర్పులను సవాల్ చేస్తూ ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఇపిఎఫ్ఒ), కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీళ్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యుయు లలిత్, జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ సుధాన్ష ధులియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం తీర్పును వెలువరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం కట్ ఆఫ్ డేట్‌ను పొడిగించడానికి కోర్టు తన అధికారాన్ని వినియోగించుకుంది. ఉద్యోగుల పెన్షన్ సవరణ పథకం-2014లోని నిబంధనలు చట్టబద్ధమైన వని, చెల్లుబాటు అయ్యేవని తీర్పులో పేర్కొంది. సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులు ఇపిఎస్ కింద ఎంపిక ప్రయోజనాన్ని పొందేందుకు అనుమతించింది.

స్పష్టత లేని కారణంగా ఈ పథకంలో చేరేందుకు అవకాశం కల్పించని ఉద్యోగులకు మరో ఆరు నెలల గడువు ఇస్తున్నట్టు ధర్మాసనం పేర్కొంది. 2014 స్కీమ్‌లోని రూ.15 వేల కంటే ఎక్కువ జీతంపై ఉద్యోగులు 1.16 శాతం చొప్పున మరింత సహకారం అందించాలనే షరతు చెల్లదని ధర్మాసనం పేర్కొంది. అయితే, ఈ అంశాన్ని ఆరు నెలల పాటు నిలిపివేసింది.

2016లో ఇచ్చిన ఆర్‌సి గుప్తా వర్సెస్ రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ తీర్పుతో ఏకీభవిస్తున్నట్లు కోర్టు పేర్కొంది. ఈ కేసులో సుప్రీం కోర్టు డివిజన్ బెంచ్ ఎంపికను అమలు చేయడానికి ఎటువంటి కటాఫ్ తేదీ ఉండదని పేర్కొంది. 2014 సెప్టెంబర్ 1కి ముందు పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ముందస్తు సవరణ పథకం కింద ఎంపికను ఉపయోగించకుండా ఇప్పటికే పథకం నుండి బయటకొచ్చిన వారు 2014 సవరణకు ముందున్న 11(3) పెన్షన్ పథకం కవర్ చేయబడతారు. ఇపిఎఫ్ఒ కనీస పెన్షన్ ప్రస్తుతం ఉన్న రూ.1000 నుంచి మరికొంత పెంచేందుకు కార్మికశాఖ పంపిన ప్రతిపాదనలను కేంద్ర ఆర్థిక శాఖ తిరస్కరించింది. ఇందుకు గల కారణాలు తెలపాలని ఆర్థికశాఖను పార్లమెంటరీ స్థాయీ సంఘం వివరణ కోరనున్నది.

## పరిశీలించాకే వాదనలు వింటాం

- రాష్ట్ర విభజన, అమరావతి కేసుల విచారణ 14కి వాయిదా

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

అమరావతిపై దాఖలైన పిటిషన్లు పరిశీలించాకే వాదనలు వింటామని, పరిశీలించకుండా విచారణ చేపట్టలేమని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. రాష్ట్ర విభజన, రాజధాని అమరావతికి చెందిన కేసుల విచారణను ఈ నెల 14కి వాయిదా వేసింది. రాష్ట్ర విభజనతోపాటు అమరావతి రాజధానిపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్రప్రభుత్వం, రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ రైతులు దాఖలు చేసిన పిటిషన్లను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ హృషికేశ్‌రాయ్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. "రాత్రి 11.30 గంటల సమయంలో పిటిషన్ కాపీలు మాకు వచ్చాయి. ఆ పిటిషన్లలోని అంశాలు, ఎవరు ఏ విషయాన్ని లేవనెత్తుతున్నారో తెలియదు. పిటిషన్ల పూర్వాపరాలు చూడాల్సి ఉంది. వాటిని పరిశీలించాకే వాదనలు వింటాం" అని జస్టిస్ కెఎం జోసెఫ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి ఈ పిటిషన్లపై అత్యవసరంగా విచారణ చేపట్టాలని కోరారు. రాజధానిపై హైకోర్టు ఇచ్చిన తీర్పులను సవాలు చేశామని తెలిపారు. హైకోర్టు ఏం ఆదేశాలు జారీ చేసిందని ధర్మాసనం ప్రశ్నించింది. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన వికేంద్రీకరణ చట్టం, సిఆర్‌డిఏ రద్దు చట్టాన్ని కొంతమంది హైకోర్టులో సవాల్ చేశారని తెలిపారు. ఆ పిటిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం తరపున సవాల్ చేశామన్నారు. రైతుల తరపున సీనియర్ న్యాయవాది ఫాలీ నారిమన్ జోక్యం చేసుకొని సమయం ఇస్తే కోర్టుకు సహాయంగా ఉండేందుకు వివరాలతో కూడిన అఫిడవిట్ సమర్పిస్తామని చెప్పారు. ఈ నెల 21న విచారణ చేపట్టాలని కోరారు. ఈ దశలో జోక్యం చేసుకున్న రాష్ట్రప్రభుత్వం తరపు న్యాయవాదులు ఈ నెల 7వ తేదీనే విచారణ చేపట్టాలని కోరారు.

### అమృత మహోత్సవాలంటే...

# ఆకలి భారతమేనా?

- అందరికీ విద్య, వైద్యం, ఆరోగ్యం, ఉపాధి కల్పించాలి
- సిఐటియు జాతీయ కార్యదర్శి, ఎఆర్ సింధు
- హైదరాబాద్‌లో మిడ్డేమీల్ వర్కర్స్ ఫెడరేషన్ అఖిల భారత మహాసభ ప్రారంభం




మహాసభలో మాట్లాడుతున్న సింధు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా ఆకలి, పౌష్టికాహార లోపంతో పిల్లలు బాధపడుతున్నారని సిఐటియు జాతీయ కార్యదర్శి ఎఆర్ సింధు ఆవేదన వ్యక్తం చేశారు. ఆజాదీ కా అమృత మహోత్సవాలను నిర్వహించడమంటే ఆకలి భారతాన్ని సృష్టించడమేనా?అని మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దేశంలో 50 శాతం మంది పిల్లలు, పేదలు ఆకలితో అలమటిస్తున్నారనీ, దుర్భర పరిస్థితుల్లో బతుకున్నారని విమర్శించారు. అందరికీ విద్యా, వైద్యం, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రెండురోజులపాటు జరగనున్న అఖిల భారత మిడ్డేమీల్ వర్కర్స్ ఫెడరేషన్ రెండో జాతీయ మహాసభ శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉత్సాహపూరితంగా ప్రారంభమైంది. సిఐటియు పతాకాన్ని ఫెడరేషన్ జాతీయ అధ్యక్షురాలు ఎస్ వరలక్ష్మి ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపం వద్ద నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి జె భగవాన్ అధ్యక్షతన ప్రారంభ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సింధు మాట్లాడుతూ..కార్పొరేట్ల కోసమే మోడీ పనిచేస్తున్నారనీ, అంబానీ, అదానీ ప్రయోజనాలే సర్కారు లక్ష్యమని అన్నారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎంపి) పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తున్నారని విమర్శించారు. నయా ఉదారవాద విధానాలను అమలు చేయడం దేశానికే ప్రమాదకరమన్నారు. కులం, మతం ఆధారంగా ప్రజల మధ్య విద్వేషాలు పెంచడం వల్ల సమస్యలు ముందుకు రావడం లేదన్నారు. ఎనిమిది గంటల పనివిధానం, సమ్మె చేసే హక్కు కార్మికులకు లేకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పిఎం పోషణ్‌గా మార్చారని గుర్తు చేశారు. అంటే పిఎం పేరు ఉండడంతో గౌరవం పెరగాలనీ, కార్మికులు హక్కుల కోసం పోరాడకుండా, బానిసలుగా పనిచేయడమే దాని ఉద్దేశమని విమర్శించారు. అక్షయపాత్ర, ఇస్కాన్ వంటి స్వచ్ఛంద సంస్థలకు మధ్యాహ్న భోజన పథకాన్ని కట్టబెడుతున్నారని అన్నారు. కనీస వేతనాలు, ఉద్యోగ

మిగతా 7లో

## సిఫార్సు బదిలీలు రద్దు చేయాలి

### నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

బదిలీల షెడ్యూలు కోసం ఉపాధ్యాయులు ఆరు నెలలుగా ఎదురు చూస్తున్నారని, రేషనలైజేషన్ జిఓపై ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని జిఓను సవరించి ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి బదిలీలు చేపట్టాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేసన్ కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. సిఫార్సుల మేరకే బదిలీలు జరుగుతున్నాయనే కథనాలు వస్తుండటంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సిఫార్సు బదిలీలు వెంటనే రద్దు చేయాలని, వెంటనే బదిలీల షెడ్యూలు ప్రకటించాలని కోరారు.

## అనంతపురం, నెల్లూరు డిఇఒలుగా ఆర్‌జెడిలు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

అనంతపురం, నెల్లూరు జిల్లాలకు డిఇఒలుగా కడప, గుంటూరు ఆర్‌జెడిలను పాఠశాల విద్యాశాఖ నియమించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్ శుక్రవారం విడుదల చేశారు. కడప ఆర్‌జెడి వెంకటకృష్ణ రెడ్డిని అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారిగా, గుంటూరు ఆర్‌జెడి విఎస్ సుబ్బారావును నెల్లూరు జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమించారు. వీరిద్దరూ కూడా ఇన్‌చార్జ్‌లుగానే కొనసాగుతారని పేర్కొన్నారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501**కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

## టిడిపి తెలంగాణ అధ్యక్షులుగా కాసాని జ్ఞానేశ్వర్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

టిడిపి తెలంగాణ అధ్యక్షులుగా కాసాని జ్ఞానేశ్వర్‌ను ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు నియమించారు. ప్రస్తుతం తెలంగాణ అధ్యక్షులుగా ఉన్న బక్కని నర్సింహులును పొలిట్ బ్యూరోలోకి తీసుకోవడంతో పాటు, జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు చంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

## మలివిడతలో 23 నుంచి డిసెంబర్ 9వ వరకూ అవకాశం

- మండలి ఎన్నికల ఓటరు నమోదుపై ఇసి

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో జరుగుతున్న శాసనమండలి ఎన్నికలకు ఓటరుగా నమోదయ్యేందుకు ఈ నెల 23 నుండి డిసెంబరు 9 వరకు మలివిడత దరఖాస్తులు స్వీకరించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఓటరు నమోదు కు తొలివిడత ఈ నెల 7న ముగియనున్నట్లు తెలిపారు. మలివిడతను ఈ నెల 23 నుండి ప్రారంభిస్తామని వివరించారు. అభ్యంతరాలను కూడా ఆ లోపే స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఫారం 18, 19ని సమర్పించడం ద్వారా దరఖాస్తుదారులకు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు పురోగతి, అసెంబ్లీ నియోజకవర్గాల ముసాయిదా జాబితా ప్రచురణకు సంసిద్ధత తదితర అంశాలను సమీక్షించేందుకు ఆయా జిల్లాల కలెక్టర్లు, అసెంబ్లీ, శాసనపరిషత్తు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలి ఎన్నికల్లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పట్టభద్రులు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరులో పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు ఎన్నికల జాబితా తయారీ ప్రక్రియ జరుగుతోందని వివరించారు.

## ఆరుద్రను ఆదుకుంటాం

### సిఎం కార్యదర్శి ధనుంజయరెడ్డి

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ఇటీవల సిఎం కార్యాలయం సమీపంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరుద్రను ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయరెడ్డి పరామర్శించారు. ఆస్పత్రి నుండి ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆరుద్రను తీసుకుని శుక్రవారం సాయంత్రం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ధనుంజయరెడ్డి ఆరుద్రతో మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగం కల్పిస్తామని, ఆమె కుమార్తె చికిత్సకు అయ్యే ఖర్చును పూర్తిగా భరిస్తామని తెలిపారు. అలాగే స్థలం అమ్మకుండా అడ్డుతగులుతున్న పోలీసు సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో ఆరుద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఇప్పటంలో ఇళ్లు కూల్చివేత

- ఆందోళనకారులను అరెస్టు చేసిన పోలీసులు
- హైకోర్టు స్టేతో నిలుపుదల



**ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ (గుంటూరు జిల్లా)**

గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఇప్పటం గ్రామంలో శుక్రవారం ఇళ్ల తొలగింపు ఉద్రిక్తతకు దారితీసింది. రోడ్డు విస్తరణ పేరుతో గ్రామంలోని ప్రధాన రహదారికి ఒకవైపున ఉన్న దాదాపు 30 ఇళ్లను మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కూల్చివేశారు. కనీసం బస్సు సౌకర్యం కూడా లేని ఈ గ్రామానికి 70 అడుగుల రోడ్డు విస్తరణ పేరుతో ఇళ్లను కూల్చివేయడం పట్ల బాధితులు ఆందోళనకు దిగారు. పేదల ఇళ్లను కూల్చవద్దంటూ టిడిపి, జనసేన నాయకులు అధిక సంఖ్యలో రోడ్డుపైకి చేరడంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. జెసిబిలను అడ్డుకోవడంతో తాడేపల్లి పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఇళ్ల కూల్చివేతను అడ్డుకున్న టిడిపి నేతలు అమరా సుబ్బారావు, కొల్లి శేషు, శంకర శెట్టి పిచ్చయ్య, రత్తయ్య, అరవపల్లి శ్రీనివాసరావు, వీరిశెట్టి శ్రీనివాసరావు, ఈపూరి బాబు, తురక ఏలియా, ఎస్కే నాగూర్ వలి, చిగురుపాటి సుబ్బారావు, పఠాన్ జానీ ఖాన్‌తోపాటు జనసేన నేతలు సామల నాగేశ్వరరావు, తిరుమల శెట్టి శ్రీధర్, తిరుమల శెట్టి నరసింహారావు, ఇండ్ల జగదీష్‌ను అరెస్టు చేసి దుగ్గిరాల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు. అరెస్టయిన నేతలను సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముపాళ్ల నాగేశ్వరరావు, టిడిపి వాణిజ్య విభాగం కార్యదర్శి గూడురు వెంకటేశ్వరరావు పరామర్శించారు.

**హైకోర్టు స్టే**

పేదల ఇళ్లు కూల్చివేతపై జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు శుక్రవారం హైకోర్టును ఆశ్రయించి, లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. కూల్చివేతలను నిలిపివేయాలని హైకోర్టు స్టే ఇవ్వడంతో మున్సిపల్ అధికారులు ఇళ్లు కూల్చే ప్రక్రియను నిలిపివేశారు.

**పేదల గూడు కూల్చడం అన్యాయం : సిపిఎం**

రోడ్డు విస్తరణ పేరుతో పేదల ఇళ్లను కూల్చడం అన్యాయమని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏ గ్రామంలో లేని విధంగా, ఒక్క ఇప్పటం గ్రామంలోనే 70 అడుగుల రోడ్డు విస్తరణ చేసేందుకు పూనుకోవడం దుర్మార్గమన్నారు.

**నేడు పవన్ రాక**

బాధితులు, స్టేషన్ నుంచి విడుదలైన నాయకులను పరామర్శించేందుకు జనసేన అధినేత శనివారం ఇప్పటం గ్రామానికి రానున్నారని జనసేన తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు తెలిపారు.

# దొంగ ఓట్లను అరికట్టండి

### ఎంఎల్‌సి ఎన్నికలపై సిఇఓకు సిపిఎం, సిపిఐ వినతి

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ఎంఎల్‌సి ఎన్నికల్లో ఇష్టారాజ్యంగా చేర్పిస్తున్న దొంగ ఓట్లను అరికట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఓ) ముకేష్ కుమార్ మీనాను సిపిఎం, సిపిఐలు కోరాయి. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ ఎంఎల్‌సి జెల్లి విల్సన్ తదితరులు రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ఆయనకు వినతిపత్రం అందచేశారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో చోటుచేసుకుంటున్న అక్రమాలను ఈ వినతిపత్రంలో వివరించారు. దొంగ నోట్ల విషయంలో సరైన సమయంలో నిర్ణయం తీసుకోకపోతే ఎన్నికల వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. అర్హతలేని వారిని ఓటర్లుగా చేర్పించాలని మంత్రులు కూడా చెబుతున్నారని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ప్రభుత్వం హైజాక్ చేస్తోందని తెలిపారు. ఎన్నికల కమిషన్ వెంటనే స్పందించాలని కోరారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఎన్నికల్లో అక్రమాలకు సహకరించలేదనే పేరుతో నెల్లూరు, అనంతపురం డిఇఓలను బదిలీ చేశారని చెప్పారు. ఇంతకంటే దుర్మార్గం మరొకటి లేదని అన్నారు.

ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని వారి బదిలీలను వెంటనే ఆపాలని డిమాండు చేశారు. ఏ మాత్రమూ అర్హతలేని, ఉపాధ్యాయులు కానివారినీ ఓటర్లుగా చేర్పిస్తున్నారని, కాదంటే మంత్రులే బెదిరింపులకు దిగుతున్నారని తెలిపారు. వాలంటీర్లనూ సర్వే పేరుతో ఇంటింటికీ తిరిగి అధికారపార్టీకి అనుకూలంగా ఉన్న వారిని ఓటర్లుగా చేర్పిస్తున్నారని చెప్పారు. వీటన్నిటిపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు కోరినట్లు తెలిపారు. ఎక్కడా టీచర్లుగా లేనివారిని, ప్రైవేటు స్కూళ్లలో పనిచేస్తున్న కొద్దిమందిని టీచర్లుగా చూపించి దీనికి అవసరమైన సంతకాలు చేయాలని డిఇఓలపై ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. ఇటువంటి వాటిని వెంటనే నిరోధించాలని కోరారు. లేనిపక్షంలో ఎన్నికల ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతుందని పేర్కొన్నారు. దీనిపై చర్యలు తీసుకోవడంతోపాటు నకిలీ ఓటర్లుగా చేర్చిన వాటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. దొంగ ఓట్లను చేర్పించే విధంగా ప్రోత్సహిస్తున్న మంత్రులపై చర్యలు తీసుకోవాలని, వారు ఇక ముందు బహిరంగ ప్రకటనలు చేయకుండా చూడాలని సిఇఓను కోరినట్లు తెలిపారు.

**కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లాం : సిఇఓ**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్ల చేర్పింపులకు సంబంధించి జరుగుతున్న పరిణామాలపై కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు లేఖ రాశామని, డిఇఓల బదిలీలకు సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకోవాలనే అంశంపైనా మరో లేఖ రాశామని సిఇఓ ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. సిఇసి నుండి వచ్చే అదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

## 'ఉక్కు' పరిరక్షణ కోసం తీర్మానం చేద్దాం

- జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ల డిమాండ్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)**

ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో విశాఖ ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మరోసారి తీర్మానం చేసి, ప్రజల మనోభావాలను ప్రధానికి తెలపాలంటూ పలువురు కార్పొరేటర్లు జివిఎంసి మేయర్ గొలగాని హరివెంకట కుమారిని డిమాండ్ చేశారు. జివిఎంసి కౌన్సిల్ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో స్టీల్‌ప్లాంట్ అంశంపై చర్చించారు. ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మేయర్ పోడియం వద్ద సిపిఎం, సిపిఐ, టిడిపి, జనసేన కార్పొరేటర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం ఫ్లోర్ లీడర్ బి.గంగారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోన్న తీరు, ప్రయివేటీకరణ వల్ల విశాఖకు జరిగే నష్టాన్ని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి కార్పొరేటర్లు మద్దతు తెలిపినప్పటికీ ఆ అంశంపై ఎటువంటి తీర్మానమూ చేయకుండానే సభ ముందుకు సాగింది. ప్లాంట్‌ను కాపాడుకుందామని విపక్షాల సభ్యులు నినదిస్తుండగా బిజెపి ఎమ్మెల్సీ మాధవ్ ప్రసంగించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ అంశం గత ప్రభుత్వాల హయాం నుంచీ ఉందన్నారు. సిపిఎం, సిపిఐ కార్పొరేటర్లు గంగారావు, స్టాలిన్, ఇతర కార్పొరేటర్లు ఆయన్ను చుట్టుముట్టి వాస్తవాలు మాట్లాడాలని పట్టుబట్టారు. దీంతో కాసేపు వాగ్వాదం నెలకొంది. అనంతరం ఇతర అంశాలపై సభ కొనసాగింది.

# డిఇఒల బదిలీలు తక్షణం ఉపసంహరించాలి

- ఓటర్ల నమోదులో అక్రమాల్ని అరికట్టాలి
- ఇసికి పిడిఎఫ్, యుటిఎఫ్ ఫిర్యాదు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

నెల్లూరు, అనంతపురం జిల్లాల విద్యాధికారుల (డిఇఒల) బదిలీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నాడు ఎన్నికల సంఘం ముఖ్య అధికారి ముఖేష్ కుమార్ మీనాను ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, షేక్ సాబ్జీ, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కెఎస్-ఎస్ ప్రసాద్ సచివాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. శాసనమండలి ఎన్నికల్లో ఉపాధ్యాయ ఓటర్ల ప్రక్రియ జోరుగా జరుగుతున్న కీలక సమయంలో ప్రయివేటు టీచర్ల సర్వీసు సర్టిఫికేట్లను ధృవీకరించాల్సిన డిఇఒలను బదిలీచెయ్యడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. నెల్లూరు డిఇఒపై అధికార పార్టీ అభ్యర్థి నెలరోజులుగా తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిబంధనల్ని తుంగలో తొక్కి వేలాదిగా అనర్హులను ఓటర్లుగా అంగీకరించాలని బెదిరిస్తున్నట్లు తెలిపారు. ఈ ఒత్తిళ్లకు లొంగకుండా..ఇసి నిబంధనావళిని పాటిస్తున్నారనే డిఇఒపై పాలక పార్టీ కన్నెర్ర చేసి ఆఘమేఘాలపై బదిలీ చేయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం డిఇఒ విషయంలోనూ ఇదే పరిస్థితి ఉందని వారు పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఓటర్ల నమోదు తుది ఘట్టానికి చేరుకున్న నేపథ్యంలో డిఇఒల బదిలీ మొత్తం ఎన్నికల ప్రక్రియను అస్తవ్యస్తం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. భారీ అక్రమాలకు తెరతీసే దుర్మార్గంలో భాగమని తెలిపారు. ఎన్నికల కమిషన్ అక్టోబర్ 20 నాటి ఉత్తర్వుల్లో ఓటర్ల జాబితా తయారీల్లో కీలకపాత్ర పోషిస్తున్న అధికారులను బదిలీ చేయరాదని ఆదేశించిన విషయాన్ని ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు గుర్తు చేశారు. వీరంతా ఎన్నికల సంఘం పరిధిలోకి వచ్చినట్టేనని, వీరి బదిలీకి జాతీయ ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసిందని వివరించారు. విద్యా శాఖ ఇసి ఉత్తర్వులను కూడా బేఖాతరు చేసి పాలక పార్టీకి వంతపాడటం విచిత్రంగా ఉందని పేర్కొన్నారు. కాబట్టి తక్షణం నెల్లూరు, అనంతపురం డిఇఒల బదిలీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఓటర్ల నమోదు ప్రక్రియను కచ్చితమైన నిబంధనల మేరకు కొనసాగించాలని విన్నవించారు.

**డిఇఒ బదిలీని రద్దు చేయాలి : ఎమ్మెల్సీ విఠపు**

ఎన్నికల కమిషన్ నియమావళికి విరుద్ధంగా నెల్లూరు జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌ను ప్రభుత్వం అక్రమంగా బదిలీ చేసిందని, ఈ బదిలీని వెంటనే రద్దు చేయాలని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. నెల్లూరులోని డాక్టర్ జెట్టిశేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికార పార్టీ అండతో కొన్ని కార్పొరేట్ యజమాన్యాలు బోగస్ ఓట్ల నమోదుకు ప్రయత్నిస్తున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా అధికారులచే కౌంటర్ సైన్ చేయించి ఓట్లను నమోదు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వారికి తలవొంచని అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేస్తుందని విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణలో భాగంగా ఎన్నికల కమిషన్ వెంటనే జోక్యం చేసుకొని అక్రమ బదిలీలను ఆపాలని, ఓటర్ల నమోదులో జరిగే అక్రమాలను అరికట్టాలన్నారు. ఈ అక్రమ బదిలీల ఉత్తర్వులను ప్రభుత్వం రద్దు చేయని పక్షంలో న్యాయపోరాటానికి సిద్ధపడతామన్నారు.

## హజ్ యాత్రికులకు మరిన్ని సౌకర్యాలు : గౌసల్ అజామ్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ఆంధ్రప్రదేశ్ నుండి హజ్ యాత్రకు వెళ్లేవారికి మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ ఛైర్మన్ బద్వేల్ షేక్ గౌసల్ అజామ్ పేర్కొన్నారు. వచ్చే సీజన్లో చేపట్టాల్సిన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక అధికారి అబ్దుల్ ఖాదిర్‌తో కలిసి శుక్రవారం ముంబయిలోని హజ్ కమిటీ భారతదేశ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. 2023కు ఎపి నుండి వెళ్లే వారికి విజయవాడ నుండి నేరుగా బయలుదేరే విధంగా ఎంబారిగేషన్ పాయింట్ను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మక్కా మదీనాల్లో అక్కడ బసచేసే భవనాన్ని ఎంపిక చేసుకునేందుకు ఒక అధికారిని ముందుగా అక్కడ వెళ్లి ఏర్పాట్లు చేయించేందుకు సౌదీ అనుమతి కోరాలని కోరారు. ఖాదీముల్ హజ్ వాలంటీర్ల ఎంపికలో హజ్ కమిటీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులకు అవకాశం ఇప్పించాలని సిఇఓ యాఖుబ్‌కు విన్నవించారు. ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు.

# వ్యాపారులకు లాభాల 'పంట'

- క్వింటాలు మిర్చి రూ. 42 వేలకు చేరిన వైనం
- అన్ సీజన్‌లో రికార్డు స్థాయిలో ధరలు

**ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి**

గుంటూరు మార్కెట్ యార్డులో కొన్నిరోజులుగా మిర్చి ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. గత సీజన్‌లో కొనుగోలు చేసిన మిర్చిని వ్యాపారులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేశారు. ఇతర రాష్ట్రాల్లో పంట దెబ్బతినడం, ఇతర దేశాలకు ఎగుమతి ఆర్డర్లు పెరగడంతో రికార్డు స్థాయిలో ధరలు పెరిగాయి. అన్ని వెరయిటీలు దాదాపుగా క్వింటాలు రూ.20 వేలకుపైగా పెరిగింది. 2043 బాడిగ రకం మిర్చి ధర గురువారం గరిష్టంగా రూ.42 వేలు పలికింది. 355 రకం క్వింటాలు రూ.36 వేలు, 341 రకం, సిజెంటా బాడిగ క్వింటాలు రూ.30 వేలు, దేవదారు డీలక్స్ రూ.29 వేలు ధర లభించింది. 273 రకం రూ.29 వేలు, నెంబర్-5 రకం రూ.28,500, 334 సూపర్ వెరైటీ రూ.26,500, నెంబర్-5 రకం రూ.29 వేలు, తేజ రకం రూ. 23,700, ఆర్మూర్ రూ.25,500 ధర పలికింది. ఈ ఏడాది సీజన్‌లో గరిష్టంగా రూ.15 వేల నుంచి రూ.18 వేలు దాటలేదు. ఇప్పుడు అన్ సీజన్‌లో రికార్డు స్థాయిలో ధరలు పెరిగాయి. గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా తామర తెగులు సోకి పంట దెబ్బతిని, దిగుబడి తగ్గిపోయి గత కొన్ని రోజులుగా గుంటూరు మిర్చికి ఇతర రాష్ట్రాల్లో గిరాకీ పెరిగింది. ఈ ఏడాది అధిక వర్షాలతో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక తదితర రాష్ట్రాల్లో మిర్చి పైరు దెబ్బతింది. దీంతో రాష్ట్రంలో నిల్వ ఉన్న మిర్చికి డిమాండ్ పెరిగింది. నవంబరు 15 కల్లా రావాల్సిన తెలంగాణ, రాయలసీమ సరుకు వచ్చే సరికి ఇంకా రెండు నెలలు సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ కోల్డ్ స్టోరేజ్‌లలో ఇంకా పది లక్షల టిక్కీలు నిల్వ ఉన్నాయి. దీంతో గత ఏడాది సాగు చేసిన మిర్చిని కోల్డ్ స్టోరేజ్‌లలో దాచుకున్న ఎక్కువ మంది వ్యాపారులు, కొద్ది మంది రైతులు లాభపడుతున్నారు.

## డిసెంబర్ 19,20 తేదీల్లో కళాకారులకు పోటీలు

### సృజనాత్మక, సంస్కృతి సమితి సిఇవో మల్లిఖార్జున

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి ఆధ్వర్యంలో కళాకారులకు డిసెంబర్ 19,20 తేదిల్లో రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు సమితి ముఖ్యకార్య నిర్వహణాధికారి(సిఇవో) ఆర్ మల్లిఖార్జునరావు వెల్లడించారు. సాంప్రదాయ నృత్యరీతులైన కూచిపూడి నృత్యం, ఆంధ్ర నాట్యం, భరతనాట్యం, గాత్ర, జానపద కళారూపాలు డప్పులు, గరగలు, తప్పెటగుళ్ళు, కోలాటం, చెక్క భజన, పులి వేషాలు, బుట్టబొమ్మలు, కాళికా వేషాలు, ఉరుములు, గిరిజన కళారూపాలైన ధింసా, కొమ్ముకోయ, సవర, లంబాడీ తదితర విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నామని శుక్రవారం ఒక ప్రటనలో తెలిపారు.గుంటూరు, రాజమండ్రి, విశాఖపట్నంలో జోనల్ స్థాయి పోటీలు జరగనున్నట్లు వివరించారు. ఆసక్తి గల కళాకారులు దరఖాస్తులను నవంబర్ 10వ తేదిలోపు రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి కార్యాలయంలో, విజయనగరం, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలులోని ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలు, పాఠశాలల్లో స్వయంగా సమర్పించాలని కోరారు. అదేవిధంగా వెబ్‌సైట్ culture.ap.gov.in లో దరఖాస్తును పూర్తిచేయవచ్చునని తెలిపారు.

## డిఇఒల బదిలీ సరికాదు : టిఎన్‌యుఎస్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

అనంతపురం, నెల్లూరు డిఇఒలను బదిలీ చేయడం సమంజసం కాదని టిఎన్‌యుఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అకస్మాత్తుగా బాధ్యతల నుంచి తప్పించి మరోచోట బాధ్యతలు అప్పగించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదులో అవకతవకలు జరుగుతున్నాయన్న కథనాలను బలపర్చేలా వీరి బదిలీ ఉందని తెలిపారు. అర్హత లేనివారికి ఓటు హక్కు కల్పించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఇసిని కోరారు.



దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

## 'ఉక్కు' ప్రయివేటీకరణ లేదని మోడీ ప్రకటించాలి

### పరిరక్షణ పోరాటకమిటీ డిమాండ్

**ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)**




ఈ నెల 11, 12 తేదీల్లో ప్రధాని మోడీ విశాఖ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా తలపెట్టిన నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని కార్మికులను, ప్రజలను విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కోరింది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 631వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో డబ్ల్యుఎండి, ఎస్ఎస్‌డి, ఎస్‌టిఇడి, అడ్మిన్, టిటిడి విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు మాట్లాడారు. ప్లాంటును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలనే ప్రధాన అంశం ప్రజల్లోకి వెళ్లేలా పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాలని కోరారు. విశాఖ పర్యటన సందర్భంగా మోడీ విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని, పరిశ్రమకు సొంత గనులు కేటాయిస్తామని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా తలపెట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా 5వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు దీక్షా శిబిరం వద్ద, అన్ని కార్మిక సంఘాల కార్యాలయాల వద్ద నల్ల జెండాలు ఎగురవేస్తామని తెలిపారు. 9న కూర్మన్నపాలెం జంక్షన్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ భారీ బైకు ర్యాలీ, 10, 11 తేదీల్లో విశాఖలోని కార్మికుల అందరి ఇళ్లపై నల్ల జెండాలు ఎగురవేస్తామని, 12న స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ఉద్యోగులు విధులు బహిష్కరిస్తారని తెలిపారు. దీక్షా శిబిరంలో నాయకులు డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, గంధం వెంకటరావు, జె రామకృష్ణ, సన్యాసిరావు, పరంధామయ్య, బొడ్డు పైడిరాజు, గుమ్మడి నరేంద్ర పాల్గొన్నారు.

## ఎన్నికల వేళ..

- కీలకాంశాలపై నజర్
- ఆర్థిక సంబంధ ఫైళ్లపై ప్రత్యేక దృష్టి

**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి**

వచ్చే ఏడాదే ఎన్నికలు వస్తాయన్న ప్రచారం ఊపందుకుంటున్న వేళ రాష్ట్ర ప్రభుత్వం కూడా అనేక కీలక అంశాలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆర్థికపరమైన అంశాలపై దృష్టి సారించాలని ఆర్థికశాఖకు కూడా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి లేఖ అందినట్లు తెలిసింది. తొమ్మిది అంశాలపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. వీటికి సంబంధించిన ఫైళ్లను వీలయినంత త్వరగా పరిష్కరించాలని స్పష్టం చేయడం గమనార్హం.

ప్రజలకు సంబంధించిన అంశాలపై ముఖ్యమంత్రి స్థాయిలోనే అనేక నిర్ణయాలు తీసుకున్నప్పటికీ, ఆ ఫైళ్లు ఆర్థికశాఖ వద్దనే చాలాకాలంగా పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. నిధులు చాలడం లేదంటూ ఆర్థికశాఖ వీటిని పక్కన పెట్టేస్తోంది. అయితే ఈ ఫైళ్లను పరిష్కరించడం ద్వారా జనానికి మేలు చేయవచ్చునన్న భావాన్ని వ్యక్తం చేస్తున్న ముఖ్యమంత్రి పేషీ తక్షణ చర్యలకు కసరత్తు ప్రారంభించింది. రిజిస్ట్రేషన్ శాఖల్లో అమలులో ఉన్న యూజర్ ఛార్జీలను రద్దు చేసేందుకగాను అవసరమైన ఫైలు ఆర్థికశాఖ వద్దనే పెండింగ్‌లో ఉంది. అలాగే అన్నమయ్య ప్రాజెక్టుకు సంబంధించిన ఇళ్ల నిర్మాణానికి ఐదు లక్షల వరకు ఒక్కో ఇంటికి నిధులు కేటాయింపు ఫైలు, కొత్త జిల్లాల్లో ఇంజనీరింగ్ అధికారులకు అధికారాలు కట్టబెట్టే ఫైలు, పలు ఇతర అంశాలకు సంబంధించి ముఖ్యమంత్రి ఆమోదించిన ఫైళ్లు కూడా ఆర్థికశాఖ వద్దనే పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే అనేక నియామకాలు, ఇతర అంశాలపై ఆర్థికశాఖ నుంచి ఆమోదం పొందాల్సిన (ఫైనాన్స్ కాంకరెన్స్) ఫైళ్లు కూడా అపరిష్కృతంగానే ఉన్నాయి. గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించాల్సిన పనుల్లో ఐదు లక్షల వరకు అనుమతి పనులపై తీసుకోవాల్సిన నిర్ణయం ఫైలు కూడా ఆర్థికశాఖ వద్దనే పెండింగ్‌లో ఉన్నట్లు తేలింది. అలాగే మరో కీలకమైన అర్బన్ ల్యాండ్ సీలింగ్‌కు సంబంధించిన ఫైలు కూడా ఎక్కడిదక్కడే అన్నట్లుగా ఉంది. ఇవి కాకుండా ఆర్థికేతర రంగానికి చెందినవి కూడా భారీగానే పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ఈ ఫైళ్లను అతి త్వరగా పరిష్కరించేలా చూడాలని ఆర్థికశాఖకు సిఎంఓ కోరినట్లు సమాచారం.

## చంద్రబాబు కాన్వాయ్‌పై దాడిని ఖండించిన టిడిపి నేతలు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కాన్వాయ్‌పై జరిగిన రాళ్లదాడిని ఆ పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ దాడి వైసిపి రౌడీ రాజకీయానికి పరాకాష్ట అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. చంద్రబాబు సభలకు వస్తున్న ప్రజాస్పందన చూసి ఎసిలో ఉండి కూడా జగన్‌కు చెమటలు పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడి పిరికిపంద చర్య అని పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని మండిపడ్డారు. జగన్ పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని హత్య చేస్తున్నారని విమర్శించారు. పార్టీ అధ్యక్షుడిపై దాడి జరుగుతుంటే పోలీసులు చోద్యం చూస్తున్నారా అని మండిపడ్డారు. ఈ ఘటనకు ముఖ్యమంత్రి, డిజిపి బాధ్యత వహించాలని తెలిపారు.దాడి రౌడీ పాలకు నిదర్శమని పొలిట్ బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నియంత పోకడలతో పాలన సాగిస్తున్న సిఎం జగన్ పతనం ప్రారంభమైందని విమర్శించారు.



గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

## అధికార లాంఛనాలతో చల్లా అంత్యక్రియలు

**ప్రజాశక్తి-అవుకు**

ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి అంత్యక్రియలను శుక్రవారం అధికార లాంఛనాలతో నిర్వహించారు. అంతిమయాత్రలో ఎమ్మెల్సీ చిన్నాన్నలు చల్లా సూర్యప్రకాశ్ రెడ్డి, అవుకు ఎంపిపి చల్లా రాజశేఖర్ రెడ్డి, చల్లా విజయ భాస్కర్ రెడ్డి, చల్లా అమర్నాథ్ రెడ్డి, చల్లా ప్రభాకర్ రెడ్డి, చల్లా విగ్నేశ్వర రెడ్డి, చల్లా రఘునాథరెడ్డి, దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జయ చంద్రారెడ్డి, మోట్లరామిరెడ్డి, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. అభిమాన నాయకుడిని కడసారి చూసేందుకు నియోజకవర్గంలోని అభిమానులు, కార్యకర్తలు, స్నేహితులు, అవుకు పట్టణ ప్రజలు దారి పొడవునా బారులు తీరారు. పార్థివ దేహాన్ని చల్లా ఫామ్ హౌస్‌లో డోన్ ఆర్‌డిఓ వెంకటరెడ్డి, ఆత్మకూరు ఆర్‌డిఓ, తహశీల్దార్ శ్రీనివాసులు, డోన్ డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి, బనగానపల్లి సిఐ సుబ్బరాయుడు పోలీసులతో గౌరవ వందనాన్ని స్వీకరించి గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

## దళిత మహిళపై దౌర్జన్యాన్ని ఖండించిన చంద్రబాబు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

కుప్పంలో జయమ్మ అనే దళిత మహిళ షాపుపై మున్సిపల్ అధికారులు దౌర్జన్యం చేయడం దారుణమని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సి కార్పొరేషన్ నుంచి గత ప్రభుత్వ హయాంలో సాయం పొందిన జయమ్మ టెంట్‌హౌస్ నిర్వహిస్తూ మున్సిపల్ కాంప్లెక్స్‌లో రెండు షాపులకు అద్దె కడుతున్నారని తెలిపారు. ఖాళీగా ఉన్న మరోషాపు వద్ద మెటీరియల్ పెట్టుకున్నారని పేర్కొన్నారు. అయితే దీనినే పెద్ద నేరంగా చూపించి అధికారులు ఆమె సామాగ్రి బయటపడేశారని పేర్కొన్నారు. చిన్న వ్యాపారం చేస్తూ బతుకెళ్లదీస్తున్న దళిత మహిళపై కక్ష చూపడం వైసిపి ప్రభుత్వ దురహంకార వైఖరికి నిదర్శమని చంద్రబాబు పేర్కొన్నారు. కనీసం నోటీసు ఇవ్వకుండా రాత్రికి రాత్రి ఖాళీ చేయించడం నీచమైన చర్య అని విమర్శించారు.

## భోగాపురం విమానాశ్రయానికి లైన్ క్లియర్

### భూసేకరణ రిట్లను కొట్టివేసిన హైకోర్టు

ప్రజాశక్తి, అమరావతి

భోగాపురం (గ్రీన్‌ఫీల్డ్) విమానాశ్రయ నిర్మాణానికి చెందిన భూసేకరణ రిట్లను కొట్టేస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది. విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, కంచేరు గ్రామస్తులు 32 మంది వేసిన రిట్లను డిస్మిస్ చేస్తూ చీఫ్ జస్టిస్ పీకే మిశ్రా,జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు డివిజన్ బెంచ్ 74 పేజీల తీర్పు చెప్పింది. 2700 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్ వెలువడింది. 2200 ఎకరాల్లో ఎయిర్‌పోర్టు డవలప్ చేస్తారు.ఇతర అవసరాలకు 500 ఎకరాలను వాడతారు. 2064 ఎకరాలు ప్రభుత్వ స్వాధీనం చేసుకుని పరిహారంగా రూ.678 కోట్లను చెల్లించింది. చట్ట ప్రకారం భూసేకరణ ఉంది కాబట్టి రిట్లను డిస్మిస్ చేస్తున్నాం.. అని తీర్పులో పేర్కొంది.







# బడికి డిజిటల్ ట్రబుల్

34 శాతం స్కూళ్లలోనే ఇంటర్నెట్

50 శాతం కంటే తక్కువ పాఠశాలల్లో ఫంక్షనల్ కంప్యూటర్లు

ఢిల్లీ స్కూళ్లు బెస్ట్ : యూడీఐఎస్ఈ సమాచారం

మోడీ పాలనలో విద్యావ్యవస్థ అనేక కష్టాలను ఎదుర్కొంటున్నది. ముఖ్యంగా, డిజిటలైజేషన్ గురించి ఎక్కువగా మాట్లాడే బీజేపీ సర్కారు.. దేశంలోని విద్యార్థులకు మాత్రం ఆ వసతులను కల్పించలేకపోతున్నది. దేశవ్యాప్తంగా ఇప్పటికీ అనేక స్కూళ్లలోని విద్యార్థులు ఇంటర్నెట్, కంప్యూటర్లు వంటి సదుపాయాలను పొందలేకపోతున్నారు. కేంద్రం గణాంకాలే ఈ విషయాలను వెల్లడిస్తున్నాయి.



**న్యూఢిల్లీ :** భారత్‌లోని బడులు డిజిటల్ విషయంలో వెనకబడి ఉన్నాయి. ఇప్పటికీ దేశంలోని అనేక పాఠశాలలకు ఇంటర్నెట్, కంప్యూటర్లు వంటివి అందటం లేదు. మరికొన్ని స్కూళ్లు వాటిని పొందుటకు గగనంగా మారిన పరిస్థితులు దేశంలో ఉన్నాయి. దీంతో సాంకేతిక పరంగా విద్యార్థులు వెనకబడి పోతున్నారు. భారత్‌లో 34 శాతం స్కూళ్లు మాత్రమే ఇంటర్నెట్‌ను పొందుతున్నాయి. కేవలం 50 శాతం కంటే తక్కువ పాఠశాలల్లో ఫంక్షనల్ కంప్యూటర్లు ఉన్నాయి. కాగా, ఈ రెండు విషయాల్లో ఢిల్లీ స్కూళ్లు వంద శాతం చక్కని ప్రదర్శనను కనబరిచాయి. దేశంలోని స్కూళ్లలో విద్యార్థులకు ఇంటర్నెట్, కంప్యూటర్లు వంటి వసతులు అందే విషయమై కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన సమాచారంలో ఈ విషయం వెల్లడైంది.

యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ (యూడీఐఎస్ఈ) 2021–22 సమాచారం ప్రకారం.. భారత్‌లోని 14,89,115 స్కూళ్లలో కేవలం 5,04,989 పాఠశాలల్లో (33.9 శాతం) ఇంటర్నెట్ వసతులు ఉన్నాయి. దేశవ్యాప్తంగా 24.2 శాతం ప్రభుత్వ పాఠశాలలు, 53.1 శాతం ప్రభుత్వ ఎయిడెడ్, 59.6 శాతం ప్రయివేటు స్కూళ్లు ఇంటర్నెట్‌ను నోచుకుంటున్నాయి. ఇక స్కూళ్లలో ఫంక్షనల్ కంప్యూటర్ల విషయానికొస్తే.. కేవలం 6,82,566 స్కూళ్లలో (45.83 శాతం)లు సదుపాయం ఉన్నది. వీటిని కలిగి ఉన్న ప్రభుత్వ స్కూళ్లు 35.8 శాతమే. ఇక 67.5 శాతం ప్రభుత్వ ఎయిడెడ్ స్కూళ్లు, 71.9 శాతం ప్రయివేటు స్కూళ్లు ఫంక్షనల్ కంప్యూటర్లను కలిగి ఉన్నాయి. ఇక ఫంక్షనల్ కంప్యూటర్ల వసతులను నోచుకోని స్కూళ్ల సంఖ్య 8,06,549 (54.16 శాతం)గా ఉండటం గమనార్హం.

**ఢిల్లీ స్కూళ్లలో వంద శాతం ఇంటర్నెట్, ఫంక్షనల్ కంప్యూటర్లు**

రాష్ట్రాలవారీగా చూస్తే ఇంటర్నెట్, ఫంక్షనల్ కంప్యూటర్ల విషయంలో ఢిల్లీ స్కూళ్లు వంద శాతం చక్కటి ప్రదర్శనను కనబర్చాయి. ఇక్కడి అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్, ప్రయివేటు స్కూళ్లు వంద శాతం ఇంటర్నెట్, కంప్యూటర్లను కలిగి ఉన్నాయి. ఈ రెండు అంశాల్లో పంజాబ్, చండీగఢ్‌లోని స్కూళ్లు కూడా 99 శాతంతో ముందున్నాయి. చండీగఢ్, పుదుచ్చేరిలలో 98 శాతం స్కూళ్లు ఇంటర్నెట్ వసతిని కలిగి ఉన్నాయి. ఇక దేశ వ్యాప్తంగా 13.4 శాతం పాఠశాలల్లో ఫంక్షనల్ ఎలక్ట్రిసిటీ కనెక్షన్లు లేకపోవటం గమనార్హం.

డిజిటలీకరణ యుగంలోనూ లక్షలాది పాఠశాలలు ఇంటర్నెట్, కంప్యూటర్లు వంటి సదుపాయాలను పొందకపోవటానికి కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య పూరిత వైఖరే కారణమని నిపుణులు, విశ్లేషకులు తెలిపారు. ప్రయివేటు స్కూళ్లతో పోలిస్తే ప్రభుత్వ స్కూళ్లలోనే ఈ సమస్యలు అధికంగా ఉండటం దీనికి నిదర్శనమన్నారు. ప్రభుత్వాలు విద్యకు సంబంధించిన బడ్జెట్‌లో కేటాయింపులు పెంచి వాటిని పూర్తిగా ఖర్చు చేయాలని సూచించారు. అలా చేయకపోతే దేశం లోని ఇక తరం సాంకేతికంగా వెనకబడి పోయి అది దేశ భవిష్యత్తుపై ప్రభావాన్ని చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఉర్దూ ట్రాన్స్‌లేటర్ల నియామకంపై
## బిజెపి వ్యాఖ్యలను తిప్పికొట్టిన నితీష్



**పాట్నా :** 200మంది ఉర్దూ ట్రాన్స్‌లేటర్స్, స్టెనోగ్రాఫర్స్ నియామకాలను వ్యతిరేకిస్తూ... బిజెపి చేసిన వ్యాఖ్యలను బీహార్ సిఎం నితీష్‌కుమార్ తిప్పికొట్టారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో.. నితీష్‌కుమార్ సుమారు 200 మంది ఉర్దూ ట్రాన్స్‌లేటర్లకు, స్టెనోగ్రాఫర్‌లకు అపాయింట్‌మెంట్ లెటర్‌లను అందించిన సంగతి తెలిసిందే. ఈ నియామకాలపై బిజెపి చేసిన అనుచిత వ్యాఖ్యలపై నితీష్‌కుమార్ ఖండించారు. పేద రాష్ట్రాలపై మోడీ ప్రభుత్వం అసత్య ప్రచారం చేపడుతోందని ధ్వజమెత్తారు. బీహార్‌కు ప్రత్యేక హోదా కల్పించాలన్న దీర్ఘకాల డిమాండ్‌ను కేంద్రం పక్కనపెట్టిందని, అన్ని పేద రాష్ట్రాలకు ప్రత్యేక హోదా పొందే హక్కు ఉందని స్పష్టం చేశారు. సమాజంలోని బలహీన వర్గాలను ముఖ్యంగా మైనారిటీస్, దళితుల అభివృద్ధికి తమ ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందని... దీనిలో భాగంగా ఈ నియామకాలు చేపట్టామని అన్నారు. బీహార్‌ను మరో పాకిస్థాన్‌లా మార్చవద్దంటూ రాష్ట్ర బిజెపి ప్రతినిధి నిఖిల్ ఆనంద్ వ్యాఖ్యానించారు. నితీష్‌కుమార్ బీహార్‌ను ఉర్దూమయం చేయాలని చూస్తున్నారని, బీహార్ అసెంబ్లీలో ఉర్దూ అనువాదకుల అవసరమేంటని ప్రశ్నించారు. అలాగే ప్రతి పాఠశాల, పోలీస్ స్టేషన్‌లోనూ ఉర్దూ ట్రాన్స్‌లేటర్‌లను నియమించాలని ఎద్దేవా చేశారు. బీహార్‌లో ముస్లింలు అధికంగా ఉన్న జిల్లాల్లో దళితులు, ఒబిసి, ఇబిసిల జీవితాలు నాశనమవుతున్నాయని ఆరోపించారు. బీహార్‌లో పాకిస్థాన్‌ను సృష్టించవద్దని .. మీరే పాకిస్థాన్‌కు వెళ్లాలని అన్నారు.

## కనీస పెన్షన్ పెంపునకు కేంద్రం ససేమిరా!

**న్యూఢిల్లీ :** ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) కనీస పెన్షన్ ప్రస్తుతం ఉన్న రూ.1000 నుంచి మరికొంత పెంచేందుకు కార్మికశాఖ పంపిన ప్రతిపాదనలను కేంద్ర ఆర్థిక శాఖ తిరస్కరించింది. ఇందుకు గల కారణాలు తెలపాలని ఆర్థికశాఖను పార్లమెంటరీ స్థాయీ సంఘం వివరణ కోరనున్నది. ఈపీఎఫ్ చందాదారులకు ఇప్పుడు ఇస్తున్న కనీస పెన్షన్ రూ.1000 ఎంతమాత్రం సరిపోదని, ఆ మొత్తాన్ని పెంచాలని ఈ ఏడాది మొదట్లో స్థాయీ సంఘం సూచించింది. కార్మికశాఖ ఎంతమేర పెంచాలని సిఫార్సు చేసిందనే విషయం మాత్రం వెల్లడి కాలేదు. ఈపీఎఫ్ పెన్షన్ పథకం, కార్పస్‌ఫండ్ నిర్వహణకు సంబంధించి బీజూ జనతా దళ్ ఎంపీ భర్తృహరి మహతాబ్ నేతృత్వంలోని పార్లమెంటరీ స్థాయీ సంఘం ముందు కార్మికశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. కార్మికశాఖ చేసిన సిఫారసులు ఆర్థికమంత్రిత్వ శాఖ ఆమోదం తెలపలేదని కమిటీకి వారు తెలియజేశారు.



## అయ్యన్న కేసులో తీర్పు వాయిదా

ప్రజాశక్తి, అమరావతి

నిరభ్యంతర పత్రంపై ఫోర్జరీ సంతకాలు చేశారని సీఐడీ పెట్టిన కేసును కొట్టేయాలని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన కుమారుడు రాజేష్ దాఖలు చేసిన కేసుల్లో హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. శుక్రవారం వాదనలు పూర్తి అవ్వడంతో తీర్పును తర్వాత వెలువరిస్తామని జస్టిస్ రావు రఘునందన్‌రావు ప్రకటించారు. సీఐడీ తరపున అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదిస్తూ కేసు డైరీని పరిశీలించాలన్నారు. అయ్యన్న ఇంటి విషయంలో తప్పుడు నిరభ్యంతర పత్రాన్ని ఫోర్జరీ తయారు చేశారన్నారు. సీఎం భార్యపై తప్పుడు పోస్టింగ్స్ పెట్టిన చరిత్ర కూడా వారికి ఉందన్నారు. నోటీసులు ఇచ్చేందుకు వెళ్లి పోలీసులపై దాడి చేసిన చరిత్ర కూడా ఉందన్నారు. సీఐడీ కేసును కొట్టేయాలని అయ్యన్న తదితరులు వేసిన పిటిషన్‌ను కొట్టేయాలన్నారు. ఇలాంటి కేసుల్లో సీఐడీ దర్యాప్తునకు వీల్లేదని అయ్యన్నపాత్రుడు న్యాయవాది చెప్పారు. ఐసీసీ సెక్షన్ 467 చెల్లదని తెలిపారు. వాదనల తర్వాత హైకోర్టు తీర్పు వాయిదా పడింది.


**అయ్యన్నను రిమాండ్‌కు పంపాలి**
**కింది కోర్టు ఉత్తర్వుల్ని సవాల్ చేసిన సిఐడి**

విశాఖపట్నం, నర్సీపట్నంలో ఇంటి నిర్మాణ తప్పుడు ఫోర్జరీ డాక్యుమెంట్స్ కేసులో అయ్యన్న పాత్రుడు, ఆయన కుమారుడు రాజేష్‌లను కింది కోర్టు రిమాండ్‌కు పంపేందుకు నిరాకరించడాన్ని సీఐడీ హైకోర్టులో సవాల్ చేసింది. విశాఖపట్నం చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరింది. దీనిని శుక్రవారంజస్టిస్ కె.శ్రీనివాస్‌రెడ్డి విచారణ జరిపి ప్రతివాదులైన అయ్యన్నపాత్రుడు, రాజేష్‌లకు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను ఈ నెల 10కి వాయిదా వేశారు.

## ఇళ్ల కూల్చివేతకు తొందరవద్దు : హైకోర్టు

ప్రజాశక్తి, అమరావతి

గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, ఇప్పటంలో ఇళ్ల నిర్మాణాల కూల్చివేత ఉత్తర్వుల అమలులో తొందరపాటు వద్దని హైకోర్టు మున్సిపల్ శాఖకు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ రవినాథ్ తిల్హరీ శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. రోడ్డు విస్తరణ కోసం ఇళ్లను కూల్చివేతకు తాడేపల్లి మున్సిపాల్టీ నిర్ణయం తీసుకుంది. దీనిని వీవీ నారాయణ ఇతరులు దాఖలు చేసిన కేసు విచారణ ఈ నెల 15కి వాయిదా పడింది.



సంపాదకీయం


# నిరుద్యోగ భారతం

దేశ ప్రజలకు ఏం కావాలి? తినేందుకు ఇంత ముద్ద.. కట్టుకునేందుకు కాస్త గుడ్డ.. ఉండేందుకు ఒక గూడు..చేతి నిండా పని. కానీ దేశంలో ఇప్పటికీ ఇవే ప్రధాన సమస్యలుగా కొనసాగుతున్నాయి. పెట్టుబడిదారీ విధానాలకు కట్టుబడి కార్పొరేట్ సేవలో పరితపిస్తూ ప్రజా ప్రయోజనాలకు పాతర వేస్తున్నందునే ఈ దుస్థితి. 2014 సార్వత్రిక ఎన్నికల వేళ ఒక 'యుగ పురుషుడు' అంటూ బిజెపి ప్రధానమంత్రి అభ్యర్థిగా కార్పొరేట్ ప్రపంచం తెరపైకి తీసుకొచ్చిన నాటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ గుప్పించిన హామీలు అన్నీఇన్నీ కావు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చి తాను ప్రధానమంత్రి అయితే ప్రతి యేటా 2 కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తానని నమ్మబలికారు. కానీ ఏమైంది? దేశంలో నిరుద్యోగం కోరలు చాచి మోడీ హామీలను వెక్కిరిస్తోంది. దేశ ప్రజానీకాన్ని అత్యంత ఆందోళనకు గురిచేస్తున్న అంశాల్లో నిరుద్యోగం అగ్రభాగంలో ఉందని ఒక సర్వేలో వెల్లడైంది. నిరుద్యోగం కారణంగా యువత ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు పెరిగాయని జాతీయ నేర గణాంకాల బ్యూరో పేర్కొంది.

సెంటర్ ఫర్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం..దేశంలో నిరుద్యోగిత రేటు అక్టోబర్ లో 7.7 శాతానికి పెరిగింది. సెప్టెంబరులో 6.43 శాతంగా ఉన్న నిరుద్యోగిత రేటు ఒక నెల వ్యవధిలోనే 1.34 శాతం పెరగడం ఆందోళనకర పరిణామం. గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. గ్రామీణ భారతావనిలో గత సెప్టెంబరులో 5.84 శాతంగా ఉన్న నిరుద్యోగిత రేటు అక్టోబర్ నాటికి 8.04 శాతానికి ఎగబాకింది. హర్యానా, రాజస్థాన్, జమ్ముకాశ్మీర్, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాల్లో నిరుద్యోగిత రేటు డబుల్ డిజిట్‌కు చేరింది. మరోవైపు పనుల్లో కార్మిక భాగస్వామ్యపు రేటు కూడా పడిపోతోంది. నీతి అయోగ్ గణాంకాల ప్రకారం 2021లో దేశంలో 75 లక్షల మంది 'గిగ్' పనులపై ఆధారపడుతున్నారు. చేతి నిండా చేయగలిగే చేవ ఉన్నా..తగిన ఉపాధి దొరక్క పొట్టకూటి కోసం దేశ యువతరం ఓలా, జొమాటో వంటి ఆన్‌లైన్ ఆధారిత చిన్నాచితకా పనులు చేసేందుకు సైతం వెనుకాడటం లేదంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. కానీ మోడీ సర్కార్ మాత్రం మొద్దునిద్ర పోతోంది. కార్పొరేట్ సంస్థలకే దోచిపెట్టడం మినహా ఆయన చేసిన ఘనకార్యాలేవీ లేవు. గుజరాత్ అభివృద్ధి ఢంకా కూడా వట్టి బూటకపు ప్రచారమని 'మోర్బీ వంతెన' విషాదం తేటతెల్లం చేసింది. ప్రయివేటు కంపెనీలకు దేనినైనా దోచిపెట్టగలగడమే మోడీకున్న ఏకైక సమర్థత అని తేలిపోయింది.

కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో కోటికి పైగా ఖాళీలు ఉన్నట్లు పార్లమెంటులోనే మోడీ సర్కార్ నిసిగ్గుగా ప్రకటించుకుంది. ఈ 8 ఏళ్లలో 22 కోట్ల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోగా కేవలం 7 లక్షల మందికే ఉపాధి దక్కింది. రెండు కోట్ల ఉద్యోగాల భ్రమలకు కొనసాగింపుగానే మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి నినాదాలతో ఈ ఎనిమిదేళ్లు మోడీ సర్కార్ నిరుద్యోగులను వంచించింది. ఖాళీలను భర్తీ చేయకపోవడం వెనుక ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయాలనే కుట్ర కనిపిస్తోంది. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం కూడా దేశంలో నిరుద్యోగిత రేటు పెరిగిపోవడానికి ఒక కారణంగా కనిపిస్తోంది. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ నెల 3న ఢిల్లీ జంతర్‌మంతర్‌లో నిర్వహించిన ఆందోళనకు దేశం నలుమూలల నుంచి వేలాది మంది యువత తరలివచ్చింది. నా ఉద్యోగమేదీ అంటూ గర్జించింది. ప్రతి యేటా ఇస్తామని చెప్పిన 2 కోట్ల ఉద్యోగాలేమయ్యాయని నిలదీసింది. ఖాళీలను భర్తీ చేయాలని, కాంట్రాక్టు విధానానికి స్వస్తి పలకాలనీ, పట్టణాల్లోనూ ఉపాధి హామీ పథకాన్ని అమల్జేయాలని, అలాగే ఉపాధి కల్పించేదాకా నెలకు రూ.5వేలు చొప్పున యువతకు నిరుద్యోగ భృతి చెల్లించాలని ఢిల్లీ వీధుల్లో యువతరం నినదించింది. దేశంలో యువతరంలో పెరిగిపోతున్న అసంతృప్తికి ఈ ఆందోళన అద్దం పడుతోంది. మొద్దు నిద్ర నటిస్తూ మొద్దుబారిన మోడీ సర్కార్ నిద్ర లేపాలన్నా..దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల ఆకాంక్షలు నెరవేరాలన్నా ఇలాంటి పోరాటాలను మరింత విస్తరింపజేయడమే మనముందున్న మార్గం.

మహనీయుల మాట



జ్ఞానం వంశపారంపర్యంగా వచ్చేది కాదు. దానిని ఎవరికి వారు సంపాదించుకోవాల్సిందే.

\- స్టీవ్‌జాబ్స్

# జి.యం ఆవాలకు అడ్డుకట్ట వెయ్యాలి

విశ్లేషణ



ప్రొ॥ ఎన్.వేణుగోపాల్

ఈ మధ్యకాలంలో మళ్లీ జన్యు మార్పిడి (జి.యం) విత్తనాలకు నూతన రూపంలో తెరలేచింది. గత ఏడెనిమిదేళ్లుగా వ్యాపారుల ఖజానాల్లో దాచిన జి.యం ఆవాల హైబ్రిడ్ విత్తనాలు విడుదల చేయబడే దశలోకి వచ్చాయి. జన్యు మార్పిడి విత్తనాల్ని నియంత్రించాలనీ, విత్తన కంపెనీల ఏకపక్ష వైఖరిని భరించేది లేదని గత ప్రభుత్వం మీద ఉద్యమించిన ఈనాటి దేశభక్తి ఛాంపియన్ పాలకులు, చాలా విషయాల్లో లాగానే కంపెనీ పెట్టుబడిదారులకు లొంగుబాటు ప్రదర్శించే దశకి ఇదొక నిదర్శనంగా మారింది. "మేక్ ఇన్ ఇండియా" నినాదాల డొల్లతనాన్ని విప్పి చూపబోతుందీ ఆవాల హైబ్రిడ్ ప్రహసనం. జి.యం పంట విత్తనాల ఆమోదయోగ్యత కోసం ఆబగా ఎదురు చూస్తున్న కంపెనీల పంట పండబోతున్నదని అర్థమౌతూనే ఉంది.

**విత్తన గుత్తాధిపత్యం**

ప్రపంచ వాణిజ్య సంస్థ ముసుగుతో గుత్త సొమ్ము (మేధోపర హక్కుల చట్టం) రక్షణ వలయంలోకి నెట్టబడ్డ వ్యవసాయ సాంకేతికాలు, వివిధ బహుళజాతి కంపెనీలకు వ్యాపార సరకుగా మారాయి. రాను రాను 70 శాతం వ్యవసాయ ఉపకరణాల ఉత్పత్తి, అమ్మకం కేవలం మూడు (బేయర్ + మాన్సెంటో, డౌ + డూపాంట్, సింజెంటా + కెమిచైనా) అతి పెద్ద పెట్టుబడిదారుల అదుపులోకి వెళ్ళాయి. ఈ కంపెనీలు ప్రపంచ వ్యవసాయాన్ని అనగా అతి కీలకమైన ఆహార రంగాన్ని శాసించే దశలోకి ఎదిగాయి. వీటి వార్షిక బడ్జెట్ చాలా దేశాల స్థూల జాతీయోత్పత్తుల కంటే ఎక్కువ. అమెరికా వంటి ధనిక దేశాల పాలనా రంగాన్ని ప్రభావితం చేసి, వివిధ ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఐరోపా దేశాల సార్వభౌమత్వాన్ని ప్రజాస్వామ్య లక్షణాల్ని దిగజార్చుతూ వస్తున్నాయీ కంపెనీలు. అదిగో ఆ నేపథ్యంలో ప్రవేశ పెట్టబడ్డవే నూతన సాంకేతికాభివద్ధి పేరుతో వచ్చిన జి.యం విత్తనాలు. జన్యుమార్పిడి జీవులు. మొదట్లో పంట విత్తనాల్లోకి నూతన జన్యువుల ప్రవేశ పెడితే దిగుబళ్లు అనూహ్యంగా పెరగటమే గాక, పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ప్రయోజనం వుంటుందని ప్రచారం చేశారు. వేల మంది శాస్త్రవేత్తల్ని, భాషా నిపుణుల్ని వినియోగించి (వాషింగ్టన్ కేంద్రంగా) సామాన్యుల్ని నమ్మించగలిగారు. ఫలితంగా అమెరికా మొదలుకొని ఆస్ట్రేలియా వరకు "మాన్సెంటో కంపెనీ" రూపొందించిన జి.యం విత్తనాల మూలంగా మారిన స్థితి నెలకొన్నది. మొక్కజొన్న, సోయా చిక్కుడు, పత్తి, టమోటో వంటి పంటల విత్తనాలన్నీ కంపెనీల అదుపులోకెళ్లాయి. ఇదే వ్యవసాయ సమస్యలకు పరిష్కారమని నమ్మించి వివిధ దేశాలకు జి.యం. టెక్నాలజీల్ని పాకించారు. ఆ క్రమంలోనే 2001 నాటికి ఆర్థిక సంస్కరణల పాట నందుకొన్న భారతదేశ వ్యవసాయం లోకి మొదటి జన్యుమార్పిడి పంట – బి.టి పత్తి – ప్రవేశించింది. ఐదారేళ్లలో మొత్తం పత్తి విత్తనాలన్నీ ఏక జన్యువాధారిత బి.టి. హైబ్రిడ్‌లుగా మారాయి. మొదటితరం టెక్నాలజీల నుండి రెండు, మూడు తరాల జన్యుమార్పిడి టెక్నాలజీలతో పత్తి విత్తనాల్ని సొంతం చేసుకోగలిగాయి కంపెనీలు. బి.టి పత్తి విత్తనాల వల్ల దిగుబళ్లు అప్రతిహతంగా పెరిగాయని అంకెల గారడీలతో ప్రచారం చేశారు. పెరిగిన సాగు భూమి, రసాయనాల వాడకం, సాగునీరు వినియోగం వంటి వాటిని, పోగొట్టుకున్న ప్రయోజనకర జీవుల విలువను గుర్తించలేని వారిది నమ్మారు. నిజానికి బి.టి హైబ్రిడ్ విత్తనాలు వాడని చాలా దేశాల్లో పత్తి దిగుబళ్లు, ఉత్పాదకతలు భారతదేశం కంటే ఎక్కువనే సత్యాన్ని దాచిపెట్టారు. అలానే బి.టి టెక్నాలజీ కేవలం హైబ్రిడ్‌ల ద్వారానే విస్తరింపజేయటాన్ని సమర్థించి మోసం చేశారు. బి.టి పత్తి విత్తనాల్ని ప్రవేశింపజేసే దశలో దేశ క్యాబినెట్ సెక్రటరీగా పని చేసిన టి.ఎస్.ఆర్. సుబ్రహ్మణ్యన్ ఈ విషయాన్ని బయట పెట్టారు (ది హిందూ, 25-5-2017).

ఆ కంపెనీలు తమ కృత్రిమ రసాయనాల అమ్మకం పెంపు కోసం, విత్తనాలపై పెత్తనం కోసం నూతన టెక్నాలజీల ముసుగుతో బి.టి కాటన్‌తో ప్రవేశించాయని తాము గుర్తించలేకపోయామని సుబ్రహ్మణ్యన్ వాపోయారు. కుట్రను ఆలస్యంగా గుర్తించిన నాటి పాలకపక్ష ప్రతినిధులు కొందరు మాన్సెంటో మహికో రూపొందించిన బి.టి వంగకు, బేయర్ కంపెనీ తయారు చేసిన బి.టి ఆవాలకు అనుమతి ఇవ్వలేకపోయాయని గుర్తు చేశారాయన. దేశంలోని ప్రముఖ శాస్త్ర పరిశోధనా సంస్థల నిపుణులు కొందరు, సామాజిక, పర్యావరణ అధ్యయన ఉద్యమకారులు బి.టి టెక్నాలజీల పేరుతో కంపెనీల గుత్త సొమ్ముగా మారుతున్న విత్తనాల ప్రమాదాన్ని బహిరంగ చర్చకు పెట్టారు. ఈ కంపెనీల అనైతికతను ఎండగడుతూ, ప్రపంచ దేశాలన్నీ ఆమోదించిన "కార్టజినా ఒప్పందానికి" వీరెంత ప్రమాదకారులో విప్పి చెప్పారు. జన్యు మార్పిడి టెక్నాలజీల్ని వంగ, ఆవాలు వంటి స్థానికతకు (మూలాలకు) నిదర్శనమైన విత్తనాల్లో ఎందుకు వాడకూడదో విశ్లేషించారు. అంతేగాదు, దేశ అత్యున్నత న్యాయస్థానం, నిపుణుల సహాయంతో చర్చించి...ఈ తరహా టెక్నాలజీల మంచి చెడ్డలు, దీర్ఘకాలిక ప్రభావాలు తెలిసే వరకు వాడకూడదని తీర్పిచ్చారు. ప్రభుత్వం నియమించిన ప్రత్యేక పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సుల ప్రకారం జి.యం టెక్నాలజీల్ని శాస్త్రీయంగా అధ్యయనం చేయగల స్థానిక సంస్థలు రూపొందే వరకు కేవలం కంపెనీలిచ్చే సమాచారం ఆధారంగా విడుదల చేయొద్దని సూచించబడ్డది. అయినా మాన్సెంటో వంటి కంపెనీలు స్థానిక కంపెనీల అండతో కోర్టుల చుట్టూ తిరుగుతూ కాలం చెల్లిన తన టెక్నాలజీలకు రాయల్టీ వసూలు చేస్తూనే ఉన్నాయి. ప్రేక్షక పాత్ర వహిస్తున్న వ్యవసాయ మంత్రుల్ని మాయచేయగలిగాయి. తన నూతన తరానికి చెందిన జన్యు మార్పిడి పంట విత్తనాలకు అనుమతి ఇవ్వాల్సిందేనని ప్రభుత్వాన్ని ఒత్తిడి చేశాయి. పైగా దేశీయ పరిశోధనా సంస్థల ద్వారా రూపొందించబడ్డ "బికనెరి నెర్మా" బి.టి పత్తి సూటి రకాల్ని రైతుల స్థాయికి వెళ్లకుండా ఆపింది మాన్సెంటో. అప్పటి పాలకులు, ప్రతిపక్ష పార్టీల ఒత్తిడికి, రైతు సంఘాల ఉద్యమాలకు తాత్కాలికంగా తలొగ్గి, నూతన జి.యం విత్తనాల ప్రవేశంపై మారిటోరియం విధించారు. అయినా కంపెనీల ఒత్తిడి ఆగలేదు. దానికి నిదర్శనమే నేటి ఢిల్లీ యూనివర్శిటీ వారి ముసుగుతో ప్రవేశింపజేసే జి.యం. ఆవాల హైబ్రిడ్.

> జి.యం (బి.టి) ఆవాల ద్వారా వచ్చే నూనె, చెక్క వంటివి ఆరోగ్యానికి, పర్యావరణానికి దీర్ఘకాలంలో నష్టకరమని అమెరికా, అర్జెంటీనా వంటి దేశాల్లో బయటపడ్డది. ముఖ్యంగా జి.యం ఆవాల పైరులో వాడబడుతున్న గ్లైపాసేట్ వంటి కలుపు మందు ఎంత ప్రమాదకరమో తేలిన తరువాత కూడా ఈ వరవడిని ప్రేరేపించడం ఎంత దేశద్రోహం? గ్లైపాసేట్ (బెయర్-మాన్సెంటో, గుత్త సొమ్ము) వల్ల క్యాన్సర్, ఆటిజమ్, మతిమరుపు (అల్జీమర్) వ్యాధి, గర్భకోశ వ్యాధులు, శిశువుల్లో అవయవ లోపాలు వస్తున్నాయని చాలా దేశాల్లో గుర్తించబడ్డది. ప్రపంచ ఆరోగ్య సంస్థ క్రోడీకరణలు దాని ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. చాలా దేశాల్లో దాని వాడకాన్ని నిషేధించారు. అయినా మన స్వదేశీ దేశభక్త పాలకులకు ఇవేమీ పట్టడంలేదు. నైతికతను దిగజార్చే వ్యాపారులు, ఎలక్షన్లకు పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలు కావాలి. దాని ఫలితమే గతంలో వలే, పూర్వాపరాల్ని విశ్లేషించక ముందే, నూతన జి.యం పంటలకు అనుమతివ్వటం అనుకోవచ్చా!



**స్వదేశీ ముసుగుతో కాలం చెల్లిన టెక్నాలజీ**

మరో హరిత విప్లవం ద్వారా రైతుల ఆదాయం రెట్టింపు చేయటం తమ లక్ష్యమని, అదీ సేంద్రీయ వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ పంటల సాగు విధానాల ద్వారానే సాధ్యమంటున్న ప్రస్తుత పాలకులు, తమ పాలనలో అనేక పిల్లిమొగ్గలు వేస్తూ వస్తున్నారు. విదేశీ పెట్టుబడిదారుల కోసం, దేశీయ (నీతి లేని) వ్యాపారుల కోసం తలుపులు తెరచే ఉన్నాయని చెప్పకనే చెప్తూ తమ ద్వంద్వ వైఖరిని నిస్సిగ్గుగా బయటపెడుతూ వస్తున్నారు. అందులో భాగమే ఇప్పుడు స్వదేశీ జి.యం ఆవాలకు పచ్చజెండా ఊపటం అనుకోవచ్చా! దేశభక్తిని అతిగా వొలకబోసే స్వదేశీ జాగరణ్ మంచ్‌లు కూడా నిస్సహాయులుగా మిగిలిపోయాయి.

కంపెనీల ఆర్థిక దన్నుతో, తస్కరించిన జన్యువుల నేపథ్యంతో, అసంపూర్ణమైన అసంబద్ధమైన క్షేత్రస్థాయి అధ్యయనాలతో డా.దీపక్ పెంతల్ అనే ఢిల్లీ యూనివర్శిటీ శాస్త్రవేత్త (మాజీ వైస్ ఛాన్సలర్ కూడా) ఎన్నో కోర్టు అభ్యంతరాలను, సాటి శాస్త్రవేత్తల విమర్శలను లెక్క చేయకుండా రూపొందించిందే ఈ బి.టి లేక జి.యం ఆవాలు. ఇది వాస్తవానికి బేయర్ కంపెనీ రూపొందించిన దానికి నకలు. దీనికిప్పుడు "స్వదేశీ" అనే ముసుగు తొడిగారు. ఎక్కువ కలుపు మందులు వాడి సాగు ఖర్చును తగ్గించేందుకు ఇవి వెసులుబాటు కల్పిస్తాయట. పైగా జి.యం హైబ్రిడ్‌ల వల్ల దేశంలో వంట నూనెల కొరత తీరిపోతుందట. ఇదెంత వాస్తవమో జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలి శాస్త్రవేత్తలు బయటపెట్టారు. అలానే కేవలం జి.యం హైబ్రిడ్‌లను నిషేధించి సాధారణ ఆవాల రకాలను మాత్రమే పండించగలుగుతున్న బ్రిటన్, ఫ్రాన్స్, చెకోస్లావేకియా, జర్మనీ వంటి దేశాల ఆవ పంట "ఉత్పాదకత" భారతదేశం కంటే ఎంత ఎక్కువో గణాంకాలు నిరూపిస్తున్నాయి. బీహార్‌లో గత ఐదారేళ్లలో "సిస్టమ్ ఆఫ్ మస్టర్డ్ ఇంటెన్సిఫికేషన్" అనే పథకం ద్వారా, దేశీయ వంగడాలు మాత్రమే వాడి ఏ విధంగా అధిక దిగుబళ్లు తియ్యొచ్చో చూపించారు.

పైగా జి.యం (బి.టి) ఆవాల ద్వారా వచ్చే నూనె, చెక్క వంటివి ఆరోగ్యానికి, పర్యావరణానికి దీర్ఘకాలంలో నష్టకరమని అమెరికా, అర్జెంటీనా వంటి దేశాల్లో బయటపడ్డది. ముఖ్యంగా జి.యం ఆవాల పైరులో వాడబడుతున్న గ్లైపాసేట్ వంటి కలుపు మందు ఎంత ప్రమాదకరమో తేలిన తరువాత కూడా ఈ వరవడిని ప్రేరేపించడం ఎంత దేశద్రోహం? గ్లైపాసేట్ (బెయర్-మాన్సెంటో, గుత్త సొమ్ము) వల్ల క్యాన్సర్, ఆటిజమ్, మతిమరుపు (అల్జీమర్) వ్యాధి, గర్భకోశ వ్యాధులు, శిశువుల్లో అవయవ లోపాలు వస్తున్నాయని చాలా దేశాల్లో గుర్తించబడ్డది. ప్రపంచ ఆరోగ్య సంస్థ క్రోడీకరణలు దాని ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. చాలా దేశాల్లో దాని వాడకాన్ని నిషేధించారు.

అయినా మన స్వదేశీ దేశభక్త పాలకులకు ఇవేమీ పట్టడంలేదు. కేవలం పెట్టుబడులు, పరిశ్రమలు కావాలి. నైతికతను దిగజార్చే వ్యాపారులు, ఎలక్షన్లకు పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలు కావాలి. దాని ఫలితమే గతంలో వలే, పూర్వాపరాల్ని విశ్లేషించక ముందే, నూతన జి.యం పంటలకు అనుమతివ్వటం అనుకోవచ్చా!

కాని ఆలోచనాపరులు, రైతు సంఘ ఉద్యమకారులు, ప్రజారోగ్య-పర్యావరణ అధ్యయనకారులు, ప్రభుత్వాల ద్వంద్వ వైఖరిని ఎండగడుతూనే ఉన్నారు. మాన్సెంటో -బేయర్ వంటి కంపెనీలు అత్యంత వేగంగా (వాటి చెడు పార్శ్వం పూర్తిగా బయటకొచ్చే లోపు) తమ జి.యం టెక్నాలజీల్ని సొమ్ము చేసుకోవాలనే లక్ష్యంతో పన్నుతున్న ఈ స్వదేశీ జి.యం ఆవాల కుట్రను బహిర్గతం చేస్తూనే ఉన్నారు. విత్తన స్వావలంబనను హరించే ఈ టెక్నాలజీల్ని తిరస్కరిద్దాం! కంపెనీల దుష్ట వ్యాపార వైఖరిపై పోరాడదాం!!

**(వ్యాసకర్త వ్యవసాయరంగ నిపుణులు)**

★

# రాజ్‌భవన్‌లో రాజ్యాంగేతర భ్రమలు

విశ్లేషణ



కాళీశ్వరం రాజ్



కేరళ గవర్నర్ కార్యాలయం ఇటీవల చేసిన ట్వీట్ (తప్పుడు కారణాల వల్ల) దేశ వ్యాప్తంగా దృష్టిని ఆకర్షించింది. "గవర్నర్ కార్యాలయం గౌరవాన్ని తగ్గించిన కొంతమంది మంత్రుల ప్రకటనలు చర్యలు తీసుకోదగినవి" అన్నది ట్వీట్ సారాంశం. అలాంటి మంత్రులను తొలగించాలని రాజ్‌భవన్ స్పష్టంగా ఏమీ చెప్పలేదు. కానీ, "గవర్నర్ విశ్వాసం పొందగలిగినంత కాలం మంత్రులు తమ పదవీ బాధ్యతలలో ఉంటార"ని రాజ్యాంగం లోని ఆర్టికల్ 164(1) స్పష్టంగా సూచిస్తుంది. గవర్నర్ విశ్వాసాన్ని కోల్పోయే విధంగా వ్యవహరించిన కేరళ ఆర్థిక మంత్రిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి గవర్నర్ లేఖ రాసినప్పుడే ఈ విషయం మరింత స్పష్టమైంది. కానీ గవర్నర్ కోరిన విధంగా, ముఖ్యమంత్రి ఆ పని చేయడానికి నిరాకరించారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా ఆసక్తి రేకెత్తించిన గవర్నర్ చర్యకు రాజకీయపరమైన, రాజ్యాంగపరమైన కోణాలు ఉన్నాయి. ఇదే సమయంలో రాష్ట్రంలోని యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల నియామకపు ప్రక్రియలు లోపభూయిష్టంగా ఉన్నాయని ఆరోపిస్తూ, వారిని తొలగించేందుకు తీసుకున్న గవర్నర్ చర్య, ఛాన్సలర్‌గా తనకున్న చట్టబద్ధమైన అధికారాన్ని వినియోగించుకున్నారనే విషయాన్ని తెలియజేస్తుంది. మంత్రులకు వ్యతిరేకంగా వ్యవహరించేలా ప్రత్యేకమైన అధికారం ఆయనకు లేదు. కేవలం రాజ్యాంగ పరిధికి లోబడి మాత్రమే ఆయన పనిచేయగలరు.

నియమించబడిన గవర్నర్ విధి ఎప్పటికీ కూడా ఎన్నుకోబడిన ప్రభుత్వానికి లోబడి మాత్రమే ఉంటుంది తప్ప, దానికి విరుద్ధంగా ఉండదు. ఇది భారత రాజ్యాంగ ప్రజాస్వామ్యం యొక్క పునాది సిద్ధాంతం. రాజ్యాంగపరమైన నిబంధనలను విడిగా ప్రత్యేకంగా చూడలేం. మంత్రి మండలి సభ్యులు గవర్నర్‌కు తోడ్పాటును అందిస్తూ, సలహాలు ఇవ్వాలని ఆర్టికల్ 163(1) చెపుతుంది. అయితే కొన్ని విషయాలలో గవర్నర్...రాజ్యాంగం అనుమతించిన మేరకు, దానికి లోబడి తన విచక్షణను బట్టి వ్యవహరించాలని ఆర్టికల్ 163(2) తెలియజేస్తుంది. అంటే దీనర్థం గవర్నర్, తన విచక్షణను ఉపయోగించడానికి చట్టబద్ధమైన హక్కును కలిగి ఉన్నప్పుడు తప్ప, సాధారణంగా మంత్రివర్గం నిర్ణయానికే కట్టుబడి ఉండాలి (ఉదాహరణకు, ఒక క్యాబినెట్ మంత్రిని విచారణ చేయడానికి అనుమతి మంజూరు నిర్ణయంలో. లేదా భారత రాష్ట్రపతి ఆజ్ఞలను అనుసరించి కేంద్రపాలిత ప్రాంత పాలకుడిగా నిర్ణయాలు చేయడం లాంటి సందర్భాలలో). కేరళ గవర్నర్ చేసిన ట్వీట్, రాసిన లేఖల సందర్భానికి సంబంధించిన నిబంధనలు ఉన్న ఆర్టికల్ 164 ...ఆర్టికల్ 163 నుండి విడదీయలేనిది. కాబట్టి, మంత్రిమండలి లేదా ముఖ్యమంత్రి ఒక మంత్రిని తొలగించాలనే సలహా ఇవ్వకుండా...గవర్నర్ తన "విశ్వాసాన్ని విరమించుకోవడం" ద్వారా ఆ మంత్రిని తీసేయలేరు.

న్యాయనిపుణులు హెచ్.ఎం.సీర్వాయ్ ఆర్టికల్ 163 యొక్క స్ఫూర్తి గురించి స్పష్టమైన వివరణ ఇచ్చారు. ఇది ఒక విధంగా, "విశ్వాసానికి" సంబంధించిన ఆర్టికల్ 164(1)కి నాంది. ఆర్టికల్ 163(1) ప్రకారం గవర్నర్‌లకు అన్ని విషయాల్లో విచక్షణాధికారం ఉంటే...కొన్ని నిర్దిష్ట విషయాలలో (ఆర్టికల్ 163(2) ద్వారా) వారి విచక్షణతో వ్యవహరించే అధికారాన్ని గవర్నర్‌లకు ఇవ్వడం అనవసరం" అని ఆయన అన్నారు (భారత రాజ్యాంగ చట్టం, వాల్యూమ్-2, యూనివర్సల్, 1993, పేజీ 2,037).

షంషేర్ సింగ్ వర్సెస్ పంజాబ్ రాష్ట్రానికి (1974) సంబంధించిన కేసులో భారత సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పులో ఆర్టికల్ 164ను పరిశీలించవచ్చు. 1948 నవంబర్ 4న రాజ్యాంగ పరిషత్‌లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఉటంకించిన అంశాలను సుప్రీంకోర్టు ఈ సందర్భంగా ఉదహరించింది. అది ఈ విధంగా ఉంది – 'అమెరికా అధ్యక్షుడు, తన కార్యదర్శులు ఇచ్చిన సలహాలను అంగీకరించనవసరం లేదు. భారత రాష్ట్రపతి సాధారణంగా మంత్రుల సలహాలకు కట్టుబడి ఉంటాడు. మంత్రుల సలహాలకు విరుద్ధంగా ఆయన ఏమీ చేయలేడు. వారి సలహా లేకుండా కూడా రాష్ట్రపతి ఏమీ చేయలేడు. అమెరికా అధ్యక్షుడు ఏ సమయంలోనైనా ఏ కార్యదర్శినైనా తొలగించవచ్చు. మంత్రులకు పార్లమెంట్‌లో మెజారిటీ ఉన్నంత కాలం, భారత రాష్ట్రపతికి మంత్రులను తొలగించే అధికారం లేదు".

రాజ్యాంగం లోని ఆర్టికల్ 75(2) ప్రకారం రాష్ట్రపతి విశ్వాసం ఉన్నంత కాలం కేంద్ర మంత్రులు వారి బాధ్యతలు నిర్వహిస్తారు కాబట్టి, ఇవే నిబంధనలు గవర్నర్లకు కూడా వర్తిస్తాయి. మంత్రి మండలి సలహా లేకుండా రాజ్‌భవన్ సూచించినట్టుగా "తన విశ్వాసాన్ని విరమించుకోవడం" (విత్‌డ్రాల్ ఆఫ్ ప్లెజర్) అనేది తప్పుడు భావన.

ఆర్టికల్ 164(1)ని వున్నదున్నట్లుగా తీసుకోరాదు. రాజ్యాంగపరమైన అర్థంలో అవగాహన చేసుకోవాలంటే నిబంధన యొక్క పూర్వాపరాలను అవగాహన చేసుకోవాలి. 1947లో రాజ్యాంగపరమైన సలహాదారు తయారు చేసిన చిత్తుప్రతి రాజ్యాంగంలో ఆర్టికల్ 121 ఉంది. దాని ప్రకారం – 'గవర్నర్ మంత్రులను ఎంపిక చేస్తారు. గవర్నరే వారిని ప్రమాణ స్వీకారానికి ఆహ్వానిస్తారు. ఆయన విశ్వాసం ఉన్నంత కాలం వారు పదవిలో కొనసాగుతారు'. అంతకు ముందు ఆర్టికల్ 144లో భాగంగా ఉన్న ఈ ఆర్టికల్ 121పై రాజ్యాంగ పరిషత్‌లో చాలా సుదీర్ఘంగా చర్చించారు. గవర్నర్‌కు ఉన్న సాధారణ విచక్షణను తొలగించి, మంత్రివర్గానికి పాలనాధికారాన్ని ఇచ్చారు. చిత్తుప్రతి రూపంలో ఉన్న ఆర్టికల్ 144కు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రతిపాదించిన సవరణ ఫలితంగానే ప్రస్తుత రాజ్యాంగంలోని ఆర్టికల్ 164, ఆర్టికల్ 165 రూపొందించబడ్డాయి.

> రాష్ట్ర స్థాయిలో... రాష్ట్రపతి, గవర్నర్ల అతి శక్తివంతమైన స్థానం....రాజ్యాంగ అధికరణలలో అధికారాలు, విధులను నేరుగా పేర్కొన్న చోట కూడా శాసనసభకు జవాబుదారీగా వుండే మంత్రివర్గం ద్వారానే పూర్తిచేయాలి. అప్పుడది ప్రజల తరపున చేసినట్లవుతుంది. అప్పడే మన ప్రజాస్వామ్యం మన రాజకీయ నిర్మాణం మౌలిక సూత్రాలకు అనుగుణమౌంది. ఏ ఒక్క అఖండ ఆత్మకు లొంగిపోకుండా కాపాడుతుంది...

గవర్నర్ రాష్ట్రానికి కేవలం ఒక నామమాత్రపు పెద్ద అనీ, ఒకవేళ మంత్రి వర్గానికి సభలో మెజారిటీ ఉంటే, ఆ మంత్రి వర్గానికి వ్యతిరేకంగా గవర్నర్ ఏమీ చేయలేడని ఆ ఆర్టికల్ సూచిస్తుంది.

గవర్నర్ కార్యాలయం వలస మూలాలను కలిగి ఉంది. 'భారత ప్రభుత్వ చట్టం-1858' గవర్నర్ జనరల్ పర్యవేక్షణలో గవర్నర్ పదవిని ఏర్పాటు చేసింది. ఆ తరువాత తీసుకొచ్చిన "భారత ప్రభుత్వ చట్టం-1935" ఏప్రిల్1, 1937 నుండి అమలులోకి వచ్చింది. ఈ చట్ట ప్రకారం కూడా గవర్నర్లు ప్రాంతీయ ప్రభుత్వ సలహాల ఆధారంగా మాత్రమే పని చేయాలి.

గవర్నర్ అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా ఏదైనా హామీ వుందా అని చర్చల సందర్భంగా హెచ్.వి.కామత్ ప్రశ్నించారు. మరొక ముఖ్య సభ్యుడైన పి.ఎస్. దేశ్‌ముఖ్ తక్షణ ప్రతిస్పందన ఇలా ఉంది: "హామీ అనేది...గవర్నర్ విజ్ఞత. గవర్నర్‌ను నియమించే అధికార యంత్రాంగం విజ్ఞత" (1949 జూన్ 2న-రాజ్యాంగ పరిషత్ చర్చల్లో).

రాజ్యాంగానికి సంబంధించిన ఈ విధమైన కాల్పనిక భావనను న్యాయపరమైన వాస్తవికతగా ఆశావహంగా అనువదించుకోవాలి. సుప్రీంకోర్టు షంషేర్‌సింగ్ కేసులో ఆ పనే చేసింది. జస్టిస్ వి.ఆర్ కృష్ణయ్యర్ ఆ తీర్పులో తన సహజ ప్రత్యేక శైలిలో అత్యుత్తమమైన వివరణ ఇచ్చారు. రాజ్‌భవన్‌లో రాజ్యాంగేతర భ్రమలను తొలగించేలా ఇలా చెప్తారు. "రాష్ట్ర స్థాయిలో...రాష్ట్రపతి, గవర్నర్ల అతిశక్తివంతమైన స్థానం....రాజ్యాంగ అధికరణలలో అధికారాలు, విధులను నేరుగా పేర్కొన్న చోట కూడా...శాసనసభకు జవాబుదారీగా వుండే మంత్రివర్గం ద్వారానే పూర్తిచేయాలి. అప్పుడది ప్రజల తరపున చేసినట్లవుతుంది. అప్పుడే మన ప్రజాస్వామ్యం మన రాజకీయ నిర్మాణం మౌలిక సూత్రాలకు అనుగుణమౌంది. ఏ ఒక్క అఖండ ఆత్మకు లొంగిపోకుండా కాపాడుతుంది...".

అందువల్ల గవర్నర్ ట్వీట్ కన్నా లేఖ కన్నా రాజ్యాంగ ధర్మాసనం చెప్పిందే అమలు జరగాలి.

**(వ్యాసకర్త సుప్రీంకోర్టు న్యాయవాది)**

**("ద హిందూ" సౌజన్యంతో)**

అభిప్రాయం

## పని దినాలు పెంచాలి

కరువు, వరదలు, తెగుళ్ల పైరును, పంట దిగుబడిని గణనీయంగా నష్టపరుస్తుంటాయి. ఈ ప్రభావం వ్యవసాయ కూలీల ఉపాధి అవకాశాల మీద పడుతుంది. దీనికి తోడు తీవ్రమైన ఎండలు, యంత్రాలు పని దినాలను కుదిస్తున్నాయి. గతేడాది నల్ల తామర పురుగు మిర్చికి తీవ్ర నష్టం చేసింది. వేసవిలో ముమ్మరమయ్యే పంట కోత పనులకు రాయల సీమ జిల్లాలు, ఉత్తరాంధ్ర జిల్లాల నుండి కుటుంబాలతో వలస వస్తారు. తామర పురుగు ఉధ్రుతికి పైర్లు దున్నేయడం వల్ల మిర్చి అధికంగా సాగు చేసే కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాలతో పాటు రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల వ్యవసాయ కూలీలు పనులు కోల్పోయారు. మార్కెట్లో కేజీ ఎండు మిర్చి రూ.400 దాటిందంటే ఈ స్థాయిలో మిర్చి పంట సాగు తగ్గిందో, దిగుబడి పడి పోయిందో అర్థం చేసుకోవచ్చు. ఈ మేరకు కూలీలు పని దినాలు కోల్పోయారు. కనీసం నెల రోజులు పంట కోత, నూర్పిడి పనులు దొరికే శనగ సాగులో నేడు పట్టుమని పది రోజులు కూడా పని దొరకడం లేదు. ఈ ఏడాది వరదలు ఉన్నకాడికి ఊడ్చేశాయి. కడప జిల్లాలోని అన్నమయ్య ప్రాజెక్టు తెగి వేల ఎకరాల్లో ఇసుక మేటలు వేసిన సంగతి తెలిసిందే. ఫలితంగా వ్యవసాయ పనులు నిలిచిపోయి అక్కడ తిండికి కరువైందని మీడియా కథనాలు చెబుతున్నాయి. ఉపాధి హామీ పనులు కూడా చేయించడం లేదని బోరుమంటున్నారు. వేడి వల్ల 2021లో భారతీయులు 16,720 కోట్ల పని గంటలు కోల్పోయినట్లు ఈ అధ్యయనం వెల్లడించింది. ఈ విపత్కర పరిస్థితుల్లో జాతీయ ఉపాధి హామీ అధిక ధరలు కొద్దిపాటి ఆదాయాన్ని కూడా గల్లా పట్టి గుంజుతున్నాయి. ఈ పరిస్థితుల్లో జాతీయ ఉపాధి హామీ పథకం ఒక్కటే ఆదాయ మార్గంగా కనిపిస్తోంది. కుటుంబానికి 100 పని దినాలుగా ఉన్న గరిష్ట పరిమితిని 200 పని దినాలకు పెంచాల్సిన అవసరం ఉంది. కేంద్రం కళ్లు మూసుకుపోయి వ్యవహరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వమే ఈ బాధ్యత తీసుకోవాలి.

**\- నలతోటి కోటేశ్వరరావు, బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్.**

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

స్పెషల్ కలెక్టరువారి కార్యాలయము(భూసేకరణ) ఒంగోలు

**ప్రకాశంజిల్లా భూసేకరణ ప్రకటన**

లేఖనెం.ఆర్.సి.బి/180/2021 — ఫారం నెం.VII — ది 15.09.2022

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్25, సబ్‌రూల్(1) ననుసరించి.)

## రూఢి ప్రకటన

ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా భూములను ప్రజాహిత ఉపయోగార్థం అనగా పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు కలసపాడు బ్రాంచి కాలువ కి.మీ 0.000 నుండి కి.మీ 0.866 మరియు కి.మీ 3.755 నుండి కి.మీ 4.315 నిర్మాణము కొరకు భూమి కావలయునని శ్రీయుత స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, ఒంగోలు వారు భావించినందున, 2013 సంవత్సరము 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట శ్రీయుత స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, ఒంగోలు వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు ఈ క్రింది రూఢి ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి చేయబడినది.

## రూఢి ప్రకటన

శ్రీయుత స్పెషల్ డిప్యూటీ కలెక్టరు , యల్.ఎ. ఆర్ & ఆర్ యూనిట్, కంభం వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించిన ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణములను ప్రజా ప్రయోజనమునకై అనగా పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు కి.మీ 0.000 నుండి కి.మీ 0.866 మరియు కి.మీ 0.866 నుండి కి.మీ 3.755 నిర్మాణము కొరకు భూమి అవసరమైనవని ఇందుమూలముగా ప్రకటన చేసియున్నారు.

## షెడ్యూలు

జిల్లా : ప్రకాశం — మండలము : గిద్దలూరు — గ్రామము నెం : 66 – గిద్దలూరు

| క్రమ సంఖ్య | స.నెం./ స. డి.నెం. | మొత్తం విస్తీర్ణం ఎ.సెం. | భూస్థితి | భూసేకరణ క్రింద విస్తీర్ణం ఎ.సెం | సంబందిత ఆసామి పేరు (పట్టాదారు)మరియు చిరునామా | సంబంధిత ఆసామీ పేరు (అనుభవదారు)మరియు చిరునామా | సరిహద్దులు ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు మరియు కట్టడముల వివరాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 525 | 7.92 | సర్కారు పుంజ | 0.23 | తరుగు మల్లమ్మ<br>భర్త బాల కాశయ్య | తరుగు మల్లమ్మ<br>భర్త బాల కాశయ్య | 533 | 524 | 534 | 526 | |
| 2 | 527 | 5.96 | ఇనాం పుంజ | 0.135<br>0.135<br>0.13<br>0.78<br>0.78 | దప్పిలి చంద్రశేఖర్‌రెడ్డి<br>తండ్రి పాండురంగారెడ్డి<br>దప్పిలి విజయభాస్కరరెడ్డి<br>తండ్రి పాండురంగారెడ్డి<br>దప్పిలి జయమ్మ<br>భర్త రంగస్వామి<br>దప్పిలి వెంకటదుర్గశ్రీకాంత్<br>తండ్రి కాశిరెడ్డి<br>దప్పిలి గౌతంరెడ్డి<br>తండ్రి కాశిరెడ్డి | దప్పిలి చంద్రశేఖర్‌రెడ్డి<br>తండ్రి పాండురంగారెడ్డి<br>దప్పిలి విజయభాస్కరరెడ్డి<br>తండ్రి పాండురంగారెడ్డి<br>దప్పిలి జయమ్మ<br>భర్త రంగస్వామి<br>దప్పిలి వెంకటదుర్గశ్రీకాంత్<br>తండ్రి కాశిరెడ్డి<br>దప్పిలి గౌతంరెడ్డి<br>తండ్రి కాశిరెడ్డి | 525<br>526 | 531 | 533 | 528 | |
| 3 | 529/1 | 1.93 | ఇనాం పుంజ | 0.30 | యాదగిరి రంగస్వామి<br>తండ్రి పుల్లయ్య | యాదగిరి రంగస్వామి<br>తండ్రి పుల్లయ్య | 530 | కొంగ లవీడు | 560 | 528 | |
| 4 | 529/2 | 1.93 | ఇనాం పుంజ | 0.32 | అంగం వెంకటేశ్వర్లు<br>తండ్రి ఎంయల్ఎ.కోటయ్య | అంగం వెంకటేశ్వర్లు<br>తండ్రి ఎంయల్ఎ.కోటయ్య | 530 | కొంగ లవీడు | 560 | 528 | |
| 5 | 529/3 | 3.36 | ఇనాం పుంజ | 0.58 | కమతం శ్రీనివాసరావు<br>తండ్రి చిన్న నారాయణ | కమతం శ్రీనివాసరావు<br>తండ్రి చిన్న నారాయణ | 530 | కొంగ లవీడు | 560 | 528 | |
| 6 | 530 | 3.38 | సర్కారు పుంజ | 0.42 | సత్వేలి రంగయ్య<br>తండ్రి పెద్ద రంగప్ప | సత్వేలి రంగయ్య<br>తండ్రి పెద్ద రంగప్ప | 531 | 529 | 551 | 528 | |
| 7 | 531/1 | 1.42 | సర్కారు పుంజ | 0.34 | అంగం వెంకటేశ్వర్లు<br>తండ్రి పెద్దవెంకటేశ్వర్లు | ప్లాట్స్ 62,63,64,65,66 67,68,69,70,71,72పార్ట్ 75 పార్ట్, 76 పార్ట్ | 532 | 530 | 551 | 528 | |
| 8 | 532/1 | 1.14 | సర్కారు పుంజ | 0.13 | యాదగిరి రంగస్వామి<br>తండ్రి పుల్లయ్య | యాదగిరి రంగస్వామి<br>తండ్రి పుల్లయ్య | 533 | 531 | 551 | 527 | |
| 9 | 533/1 | 3.90 | ఇనాం పుంజ | 0.41<br>0.285<br>0.285 | పల్లె శ్రీనివాసులరెడ్డి<br>తండ్రి మల్లారెడ్డి<br>పల్లె రమణారెడ్డి<br>తండ్రి తిరుపాల్‌రెడ్డి<br>పల్లె తిరుపాల్‌రెడ్డి<br>తండ్రి చిన్న వెంకటరెడ్డి | పల్లె శ్రీనివాసులరెడ్డి<br>తండ్రి మల్లారెడ్డి<br>పల్లె రమణారెడ్డి<br>తండ్రి తిరుపాల్‌రెడ్డి<br>పల్లె తిరుపాల్‌రెడ్డి<br>తండ్రి చిన్న వెంకటరెడ్డి | 525<br>534<br>535 | 532 | 549<br>550 | 527 | |
| 10 | 533/2 | | ఇనాం పుంజ | 0.26 | భూమిరెడ్డి రామచంద్రారెడ్డి<br>తండ్రి కేశవరెడ్డి | భూమిరెడ్డి రామచంద్రారెడ్డి<br>తండ్రి కేశవరెడ్డి | 525<br>534<br>535 | 532 | 549<br>550 | 527 | |
| 11 | 533/3 | | ఇనాం పుంజ | 0.16 | భూమిరెడ్డి రామచంద్రారెడ్డి<br>తండ్రి కేశవరెడ్డి | భూమిరెడ్డి రామచంద్రారెడ్డి<br>తండ్రి కేశవరెడ్డి | 525<br>534<br>535 | 532 | 549<br>550 | 527 | |
| 12 | 534/3 | 0.60 | సర్కారు పుంజ | 0.39 | దప్పిలి విజయభాస్కరరెడ్డి<br>తండ్రి పాండురంగారెడ్డి<br>దప్పిలి విజయకుమారి<br>భర్త రాజేంద్రప్రసాద్‌రెడ్డి<br>దప్పిలి జయలక్ష్మమ్మ<br>భర్త చంద్రశేఖర్‌రెడ్డి | ప్లాట్స్ | 521 | 533 | 535 | 525 | |
| 13 | 535/1 | 1.38 | సర్కారు పుంజ | 0.01 | దప్పిలి విజయభాస్కరరెడ్డి<br>తండ్రి పాండురంగారెడ్డి<br>దప్పిలి విజయకుమారి<br>భర్త రాజేంద్రప్రసాద్‌రెడ్డి<br>దప్పిలి జయలక్ష్మమ్మ<br>భర్త చంద్రశేఖర్‌రెడ్డి | ప్లాట్స్ | 521 | 533 | 536 | 534 | |
| 14 | 535/2 | 1.08 | సర్కారు పుంజ | 0.44 | దప్పిలి విజయభాస్కరరెడ్డి<br>తండ్రి పాండురంగారెడ్డి<br>దప్పిలి విజయకుమారి<br>భర్త రాజేంద్రప్రసాద్‌రెడ్డి<br>దప్పిలి జయలక్ష్మమ్మ<br>భర్త చంద్రశేఖర్‌రెడ్డి | ప్లాట్స్ | 521 | 533 | 548 | 534 | |
| 15 | 535/3 | 1.98 | సర్కారు పుంజ | 0.90 | దప్పిలి విజయభాస్కరరెడ్డి<br>తండ్రి పాండురంగారెడ్డి<br>దప్పిలి విజయకుమారి<br>భర్త రాజేంద్రప్రసాద్‌రెడ్డి<br>దప్పిలి జయలక్ష్మమ్మ<br>భర్త చంద్రశేఖర్‌రెడ్డి | ప్లాట్స్ | 521 | 533 | 548 | 534 | |
| 16 | 536/1 | 1.58 | సర్కారు పుంజ | 0.50 | షేక్ ఖాదర్‌హుస్సేన్‌భాషా<br>తండ్రి హుస్సేన్‌పీరాన్ | ప్లాట్స్ | 537 | 548 | 841<br>847 | 535 | |
| 17 | 536/2 | 3.73 | సర్కారు పుంజ | 1.03 | పల్లె గోవిందరెడ్డి<br>తండ్రి వెంకటరెడ్డి<br>పల్లె వెంకటరెడ్డి<br>తండ్రి వెంకటరెడ్డి | ప్లాట్స్ | 537 | 548 | 841<br>847 | 535 | ఆర్.సి.సి గోడ |
| 18 | 536/3 | 1.61 | సర్కారు పుంజ | 0.19 | పల్లి శ్రీనివాసులరెడ్డి<br>తండ్రి పుల్లారెడ్డి | పల్లి శ్రీనివాసులరెడ్డి<br>తండ్రి పుల్లారెడ్డి | 537 | 548 | 841<br>847 | 535 | |
| 19 | 537/1 | 0.93 | సర్కారు పుంజ | 0.005<br>0.005 | పల్లె గోవిందరెడ్డి<br>తండ్రి వెంకటరెడ్డి<br>పల్లె వెంకటరెడ్డి<br>తండ్రి వెంకటరెడ్డి | పల్లె గోవిందరెడ్డి<br>తండ్రి వెంకటరెడ్డి<br>పల్లె వెంకటరెడ్డి<br>తండ్రి వెంకటరెడ్డి | 539 | 536 | 539 | 521 | |
| 20 | 537/2 | 2.00 | సర్కారు పుంజ | 0.33<br>0.33 | పల్లె గోవిందరెడ్డి<br>తండ్రి వెంకటరెడ్డి<br>పల్లె వెంకటరెడ్డి<br>తండ్రి వెంకటరెడ్డి | పల్లె గోవిందరెడ్డి<br>తండ్రి వెంకటరెడ్డి<br>పల్లె వెంకటరెడ్డి<br>తండ్రి వెంకటరెడ్డి | 539 | 536 | 539 | 521 | |
| 21 | 539/3 ఎ | 1.70 | సర్కారు పుంజ | 0.37 | దప్పిలి రామిరెడ్డి<br>తండ్రి చిన్నవీరారెడ్డి | ప్లాట్స్ | 515 | 537 | 540 | 521 | |
| 22 | 539/4 సి | 1.17 | సర్కారు పుంజ | 0.04 | ప్లాట్స్ | ప్లాట్స్ | 515 | 537 | 540 | 521 | |
| 23 | 548/2 | 3.56 | సర్కారు పుంజ | 0.05 | జల్లిపల్లి నెమలి గుండం<br>తండ్రి చిన్న రంగప్ప<br>జల్లిపల్లి రంగసాయి గౌతం<br>తండ్రి రంగనాయకులు<br>జల్లిపల్లి వెంకటరంగశివ స్వరూ<br>తండ్రి రంగనాయయకులు | జల్లిపల్లి నెమలి గుండం<br>తండ్రి చిన్న రంగప్ప<br>జల్లిపల్లి రంగసాయి గౌతం<br>తండ్రి రంగనాయకులు<br>జల్లిపల్లి వెంకటరంగశివ స్వరూ<br>తండ్రి రంగనాయయకులు | 515 | 537 | 540 | 521 | |
| | మొత్తం | | | 10.27 | | | | | | | |

ఈ ప్రతిపాదిత భూసేకరణలో ఆర్ &ఆర్ సర్వే, సంబంధిత గ్రామములో ఇంటింటికి వెళ్ళి సర్వే చేయడం జరిగినది.నూతన భూసేకరణ మరియు పునరావాస పున:స్థాపన, న్యాయమైన పారదర్శక నష్టపరిహారము పొందే హక్కు చట్టము – 2013 ప్రకారము అర్హులైన నిర్వాసిత కుటుంబములు గాని ప్రభావిత కుటుంబములు కానీ లేవు.

ఈ భూముల ప్లాను శ్రీయుత స్పెషల్ డిప్యూటి కలెక్టరు యల్.ఎ, ఆర్ & ఆర్ యూనిట్, కంభం వారి కార్యాలయంలో ఉంచడమైనది దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకోవచ్చును.


ఈ భూసేకరణవలన నిర్వాసితులయినవారు ఎవ్వరును లేరు.

సం॥ శ్రీమతి **ఎస్.సరళావందనం**,ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ),
పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు, ఒంగోలు

# సెమీస్‌కు న్యూజిలాండ్

**చివరి లీగ్‌లో ఐర్లాండ్‌పై 35పరుగుల తేడాతో గెలుపు**

**ఐర్లాండ్ బౌలర్ హ్యాట్రిక్..**


లిట్టిల్ హ్యాట్రిక్

**ఆడిలైడ్:** టి20 ప్రపంచకప్ గ్రూప్–1 నుంచి న్యూజిలాండ్ జట్టు అగ్రస్థానంలో నిలిచి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. దీంతో ఈ టోర్నీలో సెమీస్ బెర్తు ఖాయం చేసుకొన్న తొలి జట్టుగా న్యూజిలాండ్ అవతరించింది. శుక్రవారం ఐర్లాండ్ తన చివరి మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టు 35పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 20ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 185పరుగులు చేసింది. ఛేదనలో ఐర్లాండ్‌జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యే సరికి 9 వికెట్లు కోల్పోయి 150 పరుగులే చేయగల్గింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌ను ఓపెనర్లు అలెన్(32), కాన్వే(28)కి తోడు విలియమ్సన్(61) అర్ధసెంచరీతో ఆదుకున్నారు. చివర్లో మిఛెల్(31) రాణించడంతో న్యూజిలాండ్ జట్టు భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఐర్లాండ్ బౌలర్ లిట్టిల్ హ్యాట్రిక్‌కి తోడు, డెలెనీకి రెండు, అడైర్‌కు ఒక వికెట్ దక్కాయి. భారీ లక్ష్యంతో ఇన్నింగ్స్ ఆరంభించిన ఐర్లాండ్ జట్టు 8ఓవర్లు పూర్తయ్యే సరికి వికెట్ నష్టపోయి 68పరుగులు చేయగల్గింది. ఆ తర్వాత ధాటిగా ఆడే క్రమంలో 9 వికెట్లను కోల్పోయింది. కెప్టెన్ ఆండ్రూ(30), స్టిర్లింగ్(37), డోక్రెల్(27) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. లోయర్ ఆర్డర్ బ్యాటర్ నిరాశపరిచారు.కివీస్ స్పిన్నర్లు సోధి, సాంట్నర్ వరుస ఓవర్లలో ఓపెనర్లతోపాటు హ్యారీ టెక్టర్(2) వికెట్‌ను తీయడంతో ఐర్లాండ్ కష్టాల్లో పడింది. అయితే లొర్కాన్ టక్కర్(13), గెరెత్ డెలానీ(10), జార్జ్ డాక్‌రెల్(23) కాసేపు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో న్యూజిలాండ్ నిర్ణీత ఓవర్లు పూర్తయ్యే సరికి 150పరుగులే చేయగల్గింది. లాకీ ఫెర్గ్యూసన్(3/22), టిమ్ సౌథీ(2/29), మిచెల్ సాంట్నర్(2/26), సోధీ(2/31) ఐర్లాండ్‌ను కట్టడి చేశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కేన్ విలియమ్సన్‌కు లభించింది.

**ఐర్లాండ్ బౌలర్ లిట్టిల్ హ్యాట్రిక్**

ఐర్లాండ్ పేసర్ జోషా లిట్టిల్ హ్యాట్రిక్ నమోదు చేశాడు. ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో వరుస బంతుల్లో కేన్ విలియమ్స్‌తోపాటు నీషమ్(0), సాంట్నర్(0) వికెట్లను పడగొట్టాడు. తొలుత విలియమ్సన్ షాట్‌కు యత్నించి డెలానీ చేతికి చిక్కగా.. నీషమ్, సాంట్నర్‌ను లిట్టిల్ ఎల్బీగా పెవిలియన్‌కు చేర్చాడు. మొత్తమ్మీద లిట్టిల్ 4ఓవర్లలో 22పరుగులిచ్చి మూడు వికెట్లు తీసాడు. దీంతో 2022 టి20 ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ తీసిన రెండో బౌలర్‌గా లిట్టిల్ రికార్డు నమోదు చేశాడు. అర్హత టోర్నీలో యుఏఇకి చెందిన కార్తీక్ మేయప్పన్ శ్రీలంకపై తొలుత హ్యాట్రిక్ వికెట్లు తీసాడు.

## గ్రూప్-1నుండి రెండో జట్టు సెమీస్‌కు ఇలా..

గ్రూప్–1 నుంచి ఐదు మ్యాచుల్లో మూడు విజయాలు, ఒక ఓటమి, ఒక మ్యాచ్ రద్దుతో ఏడు పాయింట్లు సాధించిన న్యూజిలాండ్ జట్టు (+2.11) నెట్‌రన్‌రేట్ అగ్రస్థానంలో నిలిచి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. ఇక ఆస్ట్రేలియా జట్టు ఆఫ్ఘనిస్తాన్‌పై కన్నులొట్టబోయి గెలిచినా.. తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓటమి ఆ జట్టు సెమీస్ బెర్త్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఆ జట్టు ఖాతాలోనూ 7పాయింట్లు ఉన్నా.. (–0.173)తో వెనుకబడి ఉంది. ఈ క్రమంలో శనివారం జరిగే మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు గెలిస్తే.. ఆ జట్టు ఖాతాలోనూ 7పాయింట్లు రానున్నాయి. ఇంగ్లండ్ జట్టు ఇప్పటికే (+0.547) రన్‌రేట్‌తో పటిష్టంగా ఉండడంతో చివరి మ్యాచ్‌లో శ్రీలంక మీద ఇంగ్లండ్ విజయం సాధిస్తే.. ఆస్ట్రేలియా మూడో స్థానానికే పరిమితమయ్యే అవకాశముంది. ఇంగ్లండ్ తన చివరి మ్యాచుల్లో ఓడితే మాత్రం ఆస్ట్రేలియాకు సెమీస్ ఛాన్స్ దక్కనుంది. ఒకవేళ ఇంగ్లండ్‌పై లంక గెలిచినా ఆ జట్టు ఖాతాలో ఆరు పాయింట్లే ఉంటాయి కాబట్టి లంక సెమీస్‌కు చేరడం కష్టం.

**టి20 ప్రపంచకప్‌లో నేడు..**

ఇంగ్లండ్ × శ్రీలంక (మ.1.30గం॥లకు)
(గ్రూప్–1; వేదిక: సిడ్నీ స్టేడియం)

**పాయింట్ల పట్టిక**

| దేశం | మ్యా | గె | ఓ | ర | పా | నె.ర. |
|---|---|---|---|---|---|---|
| **గ్రూప్-1** | | | | | | |
| న్యూజిలాండ్ | 5 | 3 | 1 | 1 | 7 | +2.11 |
| ఆస్ట్రేలియా | 5 | 3 | 1 | 1 | 7 | -0.17 |
| ఇంగ్లండ్ | 4 | 2 | 1 | 1 | 3 | +0.23 |
| శ్రీలంక | 4 | 2 | 2 | 0 | 4 | -0.45 |
| ఐర్లాండ్ | 5 | 1 | 3 | 1 | 3 | -1.61 |
| ఆఫ్ఘనిస్తాన్ | 5 | 0 | 3 | 2 | 2 | -0.57 |
| **గ్రూప్-2** | | | | | | |
| భారత్ | 4 | 3 | 1 | 0 | 6 | +0.73 |
| దక్షిణాఫ్రికా | 4 | 2 | 1 | 1 | 5 | +1.44 |
| పాకిస్తాన్ | 4 | 2 | 2 | 04 | | +1.11 |
| బంగ్లాదేశ్ | 4 | 2 | 2 | 0 | 4 | -1.27 |
| జింబాబ్వే | 4 | 1 | 2 | 1 | 3 | -0.31 |
| నెదర్లాండ్స్ | 4 | 1 | 3 | 0 | 2 | -1.23 |



## సెమీస్‌కు గాయత్రి-త్రిషా జోడీ

- క్వార్టర్స్‌లో ఓడిన సాత్విక్–చిరాగ్ జంట
- హైలో ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

**సార్బ్రుకెన్(జర్మనీ):** హైలో ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ సెమీఫైనల్లోకి యువ షట్లర్లు గాయత్రి గోపీచంద్–త్రీషా జోలీ ప్రవేశించారు. శుక్రవారం జరిగిన ఉత్కంఠభరిత క్వార్టర్‌ఫైనల్ పోటీలో గాయత్రి–త్రీషా జంట 21–17, 18–21, 21–8తో చైనీస్ తైపీకి చెందిన హు–యా–చింగ్, లిన్ వాన్ ఛింగ్‌పై మూడుసెట్ల హోరాహోరీ పోరులో గెలిచారు. బిడబ్ల్యుఎఫ్ ప్రపంచ టూర్ సెమీస్ భారత మహిళల డబుల్స్ జోడీ ప్రవేశించడం ఇది ఐదోసారి మాత్రమే. ప్రపంచ మహిళల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో త్రీషా–గాయత్రి జంట 28వ స్థానంలో ఉన్నారు. ఈ పోటీ సుమారు గంటసేపు సాగింది. పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. క్వార్టర్‌ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జోడీ 17–21, 14–21తో ఇంగ్లండ్‌కు చెందిన బెన్ లానె–సీన్ వెండే చేతిలో వరుససెట్లలో ఓడారు. ప్రపంచ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో 8వ స్థానంలో భారత జోడీపై ఇంగ్లండ్ జంట గెలుపొంది ముఖాముఖి రికార్డును 2–2తో సమం చేసింది.

## ముంబయిని హిమాచల్ ప్రదేశ్ నిలువరించేనా..

- సయ్యద్ ముస్తాక్ అలీ టి20 ఫైనల్ నేడు

**కోల్‌కత్తా:** సయ్యద్ ముస్తాక్ అలీ టి20 ఫైనల్ శనివారం ఈడెన్ గార్డెన్స్‌లో జరగనుంది. ఈ టోర్నమెంట్ ఫైనల్లోకి ముంబయి–హిమాచల్ ప్రదేశ్ జట్లు తొలిసారి ప్రవేశించాయి. డిఫెండింగ్ ఛాంపి యన్ తమిళనాడు జట్టు ఈ టైటిల్‌ను అత్యధిక మూడుసార్లు చేజిక్కించుకోగా.. ఈసారి టైటిల్ విజేతగా కొత్త జట్టు అవతరించనుంది. సెమీస్‌లో ముంబయి జట్టు 5వికెట్ల తేడాతో విదర్భను, హిమాచల్ ప్రదేశ్ జట్టు 13పరుగుల తేడాతో పంజాబ్‌ను ఓడించి ఫైనల్‌కు చేరాయి. హిమాచల్ ప్రదేశ్ జట్టులో స్టార్ ఆటగాళ్లు లేకున్నా.. ముంబయి జట్టుకు టెస్ట్ ఆటగాడు అజింక్యా రహానే కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఆ జట్టులో టీమిండియా, ఐపిఎల్ ఆటగాళ్లతో బలీయంగా ఉంది.


**జట్లు...**

**ముంబయి:** రహానే(కెప్టెన్), పృథ్వీ షా, సాయిరాజ్ పాటిల్, సర్ఫరాజ్, శ్రేయస్, ప్రశాంత్ షిండే, యశస్వి, హకీం ఖాన్, శ్యామ్ ములాని, శార్దూల్, దూబే, హార్దిక్ థోమర్(వికెట్ కీపర్), ధవల్ కులకర్ణి, మోహిత్ అవస్తి, వలసంగార్కర్, ప్రశాంత్ సోలంకి, తనుశ్ కొట్టయిన్, తుషార్ దేశ్‌పాండే.

**హిమాచల్ ప్రదేశ్:** రిషీ ధావన్(కెప్టెన్), అభిమన్యు రాణా, అమిత్ కుమార్, ఏకాంత్ సేన్, నిఖిల్ ఘంటా, నితిన్ శర్మ, ప్రశాంత్ చోప్రా, రాఘవ్ ధావన్, ఆకాశ్ వశిష్ట్, దిగ్విజయ్ రంగి, సుమిత్ వర్మ, అంకుశ్ బైన్స్(వికెట్ కీపర్), శుభమ్ అరోరా, అంకుశ్ బేడి, ఆయుష్ జమ్వాల్, గురిందర్ సింగ్, కన్వర్ అభినయ్ సింగ్, మయాంక్ దగర్, పంకజ్ జస్వాల్, సిద్ధార్థ్ శర్మ, వైభవ్ అరోరా, వినయ్ గలాటియా.

# ఆస్ట్రేలియా కష్టంగా..

- ఆఫ్ఘన్‌పై నాలుగు పరుగుల తేడాతో గెలుపు
- రషీద్ ఖాన్ విధ్వంస ఇన్నింగ్స్ వృథా
- ఇంగ్లండ్ ఓడితేనే సెమీస్ బెర్త్


మ్యాక్స్‌వెల్ (52పరుగులు)

**ఆడిలైడ్:** సెమీస్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియాకు నాలుగు పరుగుల తేడాతో అఫ్గానిస్తాన్‌పై విజయం సాధించి ఊపిరి పీల్చుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 168పరుగులు చేసింది. మ్యాక్స్‌వెల్ 52, మిచెల్ మార్ష్ 45, స్టోయినిస్ 25, వార్నర్ 25 పరుగులు చేశారు. నవీన్‌కు మూడు, ఫరూఖీకి రెండు, రషీద్, ముజీబ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో ఆఫ్ఘనిస్తాన్ జట్టును ఆఖర్లో రషీద్ ఖాన్(23 బంతుల్లో 48 నాటౌట్, 3 ఫోర్లు, 4 సిక్సర్లు) సంచలన ఇన్నింగ్స్ ఆడడంతో విజయానికి చేరువుగా వచ్చింది. 18బంతుల్లో 49 పరుగులు చేయాల్సిన దశలో రషీద్ ఒక్కసారిగా విజృంభించాడు. కేన్ రిచర్డ్‌సన్ వేసిన ఇన్నింగ్స్ 18వ ఓవర్ ఐదు, ఆరు బంతులను రెండు సిక్సర్లుగా మలిచాడు. దీంతో చివరి 12 బంతుల్లో 33పరుగులకు మారింది. ఈ దశలో హాజిల్‌వుడ్ 19వ ఓవర్ వేయగా.. ఆ ఓవర్‌లో 10 పరుగులు పిండుకున్న రషీద్ సమీకరణాలను 6 బంతుల్లో 22 పరుగులుగా మార్చాడు. ఇక చివరి ఓవర్‌లో రసూలీ వైడ్ బాల్‌కు రనౌట్ అయినప్పటికి రషీద్ ఖాన్ ఒక ఫోర్, సిక్స్‌తో మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చాడు. రెండు బంతుల్లో 11 పరుగులు చేయాల్సిన దశలో రెండు పరుగులు రావడం.. ఆ తర్వాత బంతికి ఫోర్ కొట్టినప్పటికి విజయానికి కేవలం నాలుగు పరుగుల దూరంలో నిలిచిపోయింది. కెప్టెన్ ఫించ్ గాయంతో విశ్రాంతి తీసుకోవడంతో వికెట్ కీపర్ వేడ్ పగ్గాలు అందుకున్నాడు. హేజిల్‌వుడ్, జంపాకు రెండేసి, రిచర్డ్‌సన్‌కు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మ్యాక్స్‌వెల్‌కు లభించింది.

## పట్నా, పింక్ ప్యాంథర్స్ గెలుపు

**ప్రొ కబడ్డీ సీజన్–9**



**పూణే:** ప్రొ కబడ్డీ సీజన్–9లో భాగంగా శుక్రవారం జరిగిన పోటీల్లో పట్నా పైరెట్స్, జైపూర్ పింక్ ప్యాంథర్స్ జట్లు గెలుపొందాయి. తొలి మ్యాచ్‌లో పట్నా పైరెట్స్ 34–31పాయింట్ల తేడాతో యు ముంబను ఓడించింది. పట్నా జట్టులో సచిన్(12పాయింట్లు) రైడ్‌లో రాణించగా.. సునీల్(6) ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచాడు. షడ్రోల్ ట్యాకిల్స్‌లో రాణించాడు. ఇక ముంబ జట్టులో ఆశీశ్(7), జై భగవాన్(7)రైడ్స్‌లో రాణించగా.. రింకు(3), మోహిత్(2) ట్యాకిల్స్‌లో మెరిసారు. ఇక పట్నా జట్టు 4సార్లు యు ముంబను ఆలౌట్ చేస్తే.. యు ముంబ జట్టు 2సార్లు మాత్రమే పట్నాను ఆలౌట్ చేయగల్గింది. మరో పోటీలో పింక్ ప్యాంథర్స్ జట్టు తొలి అర్ధభాగం ముగిసే సమయానికే 28–19పాయింట్ల ఆధిక్యతలో నిలిచి రెండో అర్ధభాగం ముగిసే సమయానికి 45–40 పాయింట్ల తేడాతో గెలిచింది. మూడో మ్యాచ్‌లో పుణేరి 40–31పాయింట్ల తేడాతో యుపి యోధాను ఓడించింది.

## టిడిపి నేత సవితమ్మ ఇంట్లో సిబిఐ సోదాలు

- కర్నాటకలో నమోదైన రైల్వే కేసు విషయంలో తనిఖీలు

**ప్రజాశక్తి-పెనుకొండ**

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని వజ్రాలపేటలో నివసిస్తున్న టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ ఇంట్లో సిబిఐ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. సవితమ్మ భర్త వెంకటేష్ రైల్వే కాంట్రాక్టు పనులు చేస్తుంటారు. రైల్వే పనుల్లో అధికారుల అవినీతిపై వెంకటేష్ వద్ద సాక్ష్యాలు ఉన్నట్లు..అందుకోసం సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. సుమారు ఏడుగంటల పాటు సోదాలు నిర్వహించి, రికార్డులు, ఇతర లావాదేవీలను పరిశీలించినట్లు సమాచారం. ఈ సోదాలపై సిబిఐ అధికారులను మీడియా వివరణ కోరగా..ఇది కేవలం రైల్వే కేసు మాత్రమే అని పేర్కొన్నారు. సిబిఐ సోదాలను నిరసిస్తూ సావితమ్మ ఇంటి వద్ద టిడిపి నాయకులు నిరసనకు దిగారు. సిఎం జగన్‌మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులను పంపించివేశారు.

## బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మిద్దాం : సిపిఐ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో గత నెలలో జరిగిన సిపిఐ 24వ జాతీయ మహాసభ ఇచ్చిన స్ఫూర్తితో బలమైన ప్రజాపోరాటాలను నిర్మించేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అజీజ్‌భాష, రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణలు పేర్కొన్నారు. శుక్రవారంనాడు విజయవాడలోని దాసరి భవన్‌లో సిపిఐ 24వ జాతీయ మహాసభ ఆహ్వాన సంఘానికి అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా అజీజ్‌భాష, కె రామకృష్ణలు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ సేవలో తరిస్తున్నాయని విమర్శించారు. నిత్యావసర ధరలను, నిరుద్యోగాన్ని నిర్మూలించడంలో ఈ ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని అన్నారు. దేశ సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్‌శక్తులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. అంతర్జాతీయంగా వామపక్షశక్తులు పురోగమిస్తున్నాయని ఈ నేపథ్యంలోనే విజయవాడలో జరిగిన మహాసభ కూడా విజయవంతమైందన్నారు. మహాసభ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర నాయకులు రావుల వెంకయ్య, అక్కినేని వనజ, పి దుర్గాభవాని, తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు డిఇఒను సస్పెండ్ చేయాలి

- ఇసికి ఎస్టియు ఫిర్యాదు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

కర్నూలు డిఇఒను సస్పెండ్ చేయాలని ఎస్టియు డిమాండ్ చేసింది. శుక్రవారం ఈ మేరకు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న ఎన్నికల సంఘం ముఖ్యఅధికారి ముఖేష్ కుమార్ మీనాకు సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. శాసన మండలి ఎన్నికల ఓటరు నమోదులో నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి ఆధారాలు లేకుండా సర్వీస్ ధ్రువపత్రాలు జారీ చేస్తూ డిఇఒ వి రంగారెడ్డి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల నిబంధనవాళిని అతిక్రమించిన ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఇసి నిబంధనలు అమల్జేస్తున్న అనంతపురం, నెల్లూరు డిఇఒల బదిలీలను రద్దు చేయాలని కోరారు. ఓటరు నమోదులో గ్రామ వాలంటీర్ల జోక్యం నివారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 7వత ఏది తరువాత విచారణచేసి చర్యలు తీసుకుంటామని ముఖేష్ కుమార్ హామీ ఇచ్చినట్లు తిమ్మన్న పేర్కొన్నారు.

## గెయిల్ లాభాల్లో 46% పతనం

**న్యూఢిల్లీ :** ప్రముఖ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ గెయిల్ లాభాల్లో తగ్గుదల చోటు చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 46.31 శాతం తగ్గి రూ.15,37 కోట్ల లాభాలకు పరిమితమయ్యింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.2,862.95 కోట్ల లాభాలు సాధించింది. గడిచిన క్యూ2లో కంపెనీ గ్యాస్ మార్కెటింగ్ రెవెన్యూ రెట్టింపై రూ.35,465.35 కోట్లుగా నమోదయ్యింది.

## ఆప్టమ్ స్టార్టప్ స్టూడియో 'కోహోర్ట్' ఆవిష్కరణ

**హైదరాబాద్ :** ఆప్టమ్ గ్లోబల్ సొల్యూషన్స్ (ఇండియా), ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హైదరాబాద్ (ఐఐఐటి-హెచ్) భాగస్వామ్యంతో తన మొదటి ఆప్టమ్ స్టార్టప్ స్టూడియో ఇండియా కోహోర్ట్‌ను ఆవిష్కరించింది. ఈ కోహోర్టులో ఐదు హెల్త్‌కేర్ స్టార్టప్‌లున్నాయని తెలిపింది. ఇందులో మెడ్‌టెల్, గ్రాయిల్‌మేకర్ ఇన్నోవేషన్స్, డాఫోడిల్ హెల్త్, నెమోకేర్, బివెల్ హెల్త్ విభాగాలను ప్రారంభించినట్లు పేర్కొంది. 'ఆప్టమ్‌లో, భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలు-సమాచారాన్ని అనుసంధానించడం ద్వారా ఆరోగ్య వ్యవస్థను ఆధునీకరించడానికి, క్రమబద్ధీకరించడానికి, సరళీకృతం చేయడానికి సహాయపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని మేము అభివృద్ధి చేస్తున్నాము" అని ఆప్టమ్ వ్యూహాత్మక భాగస్వామ్యాల విభాగం వైస్ ప్రెసిడెంట్ పాల్

# స్పిన్నింగ్, జిన్నింగ్ మిల్లులను ఆదుకోండి

- రూ.1400 కోట్ల బకాయిలను విడుదల చేయాలి
- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు



సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్ నరసింగారావు

**ప్రజాశక్తి - చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)**

రాష్ట్రంలోని స్పిన్నింగ్, జిన్నింగ్, టెక్స్‌టైల్స్ మిల్లులు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయని, వీరికి ఇవ్వాల్సిన రాయితీలను వెంటనే విడుదల చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. స్పిన్నింగ్ మిల్లుల సంక్షోభంపై స్పిన్నింగ్, జిన్నింగ్ మిల్లు కార్మికుల రాష్ట్రస్థాయి సమావేశం పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో నర్సింగరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా స్పిన్నింగ్, జిన్నింగ్ మిల్లుల ద్వారా ఏటా రూ.12 వేల కోట్ల వ్యాపారం జరుగుతోందని, సుమారు 70 వేల మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. అభివృద్ధి చెందాల్సిన మిల్లులు ప్రస్తుతం తిరోగమన దిశలోకి పయనిస్తున్నాయన్నారు. ఈ మిల్లులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వాల్సిన రూ.1400 కోట్ల రాయితీలను సత్వరమే విడుదల చేసి ఆదుకోవాలని, లేకుంటే కార్మికులు ఉపాధి కోల్పోతారని చెప్పారు. పత్తికి మద్దతు ధర క్వింటా రూ.6400గా ప్రభుత్వం ప్రకటించిందని, కనీస మద్దతు ధర రూ.15 వేలకు పెంచాలని, దళారీల ప్రేమయం లేకుండా సిసిఐ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పత్తి నాణ్యతలో చిలకలూరిపేటకు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు ఉందని, అందుకే హిందూపురం, విశాఖ తర్వాత ఇక్కడ ఎక్కువగా స్పిన్నింగ్, జిన్నింగ్ మిల్లులు ఉన్నాయని తెలిపారు. ఈ మిల్లులపై విద్యుత్ సుంకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆరు పైసల నుండి రూపాయికి పెంచడం సమంజసం కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మిల్లులను ఆదుకోకుంటే కార్మికులతోపాటు రైతులనూ ఐక్యం చేసి ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, గుంటూరు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## చంద్రబాబు కుట్ర రాజకీయం : వైసిపి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

జనసేన అధినేత పవన్ కల్యాణ్ మీద రెక్కీ చేసింది చంద్రబాబునాయుడు మనుషులేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. చంద్రబాబునాయుడు కుట్ర రాజకీయంలో బాగంగానే ఈ రెక్కీ జరిగిందని విమర్శించారు. శుక్రవారంనాడు తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కేంద్రకార్యాలయంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, కమ్మ కార్పోరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్, కాపు కార్పోరేషన్ చైర్మన్ ఆడపా శేషులు మాట్లాడారు. చంద్రబాబు దిగజారుడు రాజకీయాలు చేస్తూ కులాల మధ్య చిచ్చుపెడుతున్నారని విమర్శించారు. విజయ్, ఆదిత్య చౌదరి, సాయికష్ణ చౌదరి రెక్కీ నిర్వహించారని వీరు చంద్రబాబు మనుషులేనన్నారు. కాపు సామాజికవర్గం మీద జరుగుతున్న కుట్రలకు పవన్‌కల్యాణ్ బలిపశువు అవుతున్నారని అన్నారు. రెక్కీకి తమపార్టీకి సంబంధం లేదని అన్నారు.

### రాయి అంతా డ్రామా : మంత్రి జోగి

రాష్ట్రంలో శాంతిభద్రతలు విఫలం అయ్యాయని నిరూపించేందుకు చంద్రబాబునాయుడు 'రాయి' అని మరో డ్రామాకు తెరలేపారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ విమర్శించారు. నిన్నటిదాకా పవన్‌కల్యాణ్‌పై రెక్కి చేశారని రాజకీయం చేసి ఇపుడు చంద్రబాబునాయుడిపై రాయి పడిందని నాటకాలు ఆడుతున్నారని అన్నారు. శుక్రవారంనాడు తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్‌పై రెక్కీ జరగలేదని తెలంగాణా పోలీస్‌లు తేల్చారని, రాయి అంశాన్ని కూడా తేలుస్తామని అన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి వాస్తవాలను నిగ్గుతేలుస్తామని అన్నారు.

## ఎస్‌డిజి బాధ్యత సచివాలయాలకు

- సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నిర్ణయం
- ఒక్కో కార్యదర్శికి ఒక్కో బాధ్యత అప్పగింత

**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి**

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల బాధ్యత ఇకపై గ్రామ, వార్డు సచివాయాలపై పడనుంది. ఇన్నాళ్లూ శాఖల ద్వారా జరిగే ఈ లక్ష్యాలను ప్రణాళిక శాఖ పర్యవేక్షించేది. అయితే తాజాగా ఈ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయి నుంచి అమలు చేసేందుకుగాను సచివాలయాలకు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఏ శాఖ ఎలాంటి లక్ష్యాలను గణించాలన్నది ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలు, పథకాలను ఇంటింటికీ అందించేందుకుగాను గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. ప్రధానంగా నవరత్నాలపైనే ఎక్కువగా ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఈ పథకాల అభివృద్ధి ఇండకేటర్ల ద్వారా జరుగుతున్న అమలును అధ్యయనం చేస్తున్నారు కూడా. ఇకపై ఈ విధానాన్ని సచివాలయాల ద్వారా అమలు చేసేందుకు నిర్ణయించిన ప్రభుత్వం అందుకు అవసరమైన మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. గ్రామ, వార్డు సచివాయాల కార్యదర్శులపై ఆ మండల స్థాయి అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. వారిపై డివిజన్ స్థాయి, ఆ తరువాత జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షకులుగా ఉంటారు. వీటి నివేదికలు ప్రణాళిక శాఖ క్రోడీకరించి, తదుపరి సమీక్ష కోసం ముఖ్యమంత్రికి నివేదిస్తారు.

ముందుగా ఎనిమిది ఇండికేటర్లపై దృష్టి సారించనున్నారు. వీటిల్లో పిల్లలు, ఆరోగ్యం వంటి వాటికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నారు. పది నుంచి 19 ఏళ్లలోపు ఉన్న అనాధ బాలికల్లో ఎనీమియా నివారణను తొమ్మిది శాతానికి తగ్గించాలన్న లక్ష్యాన్ని క్షేత్ర స్థాయిలో అమలు చేయనున్నారు. వీటిని అంగన్వాడీ, పాఠశాలలు, హాస్టళ్ల ద్వారా అమలు చేయాలని నిర్ణయించారు. 15 నుంచి 49 ఏళ్ల మధ్య వయసుగల గర్భిణీలకు అంగన్వాడీల ద్వారా మేలు చేసేందుకు, ఐదేళ్లలోపు వయసున్న వారిలో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు, ఆదే వయసున్న వారిలో తక్కువ బరువు సమస్యను నివారించేందుకు చర్యలు తీసుకోనున్నారు.


అలాగే 2022-23 విద్యా సంవత్సరంలో 11, 12 తరగతుల్లో డ్రాపవుట్లను వంద శాతం తగ్గించేందుకు, ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు డ్రాపవుట్లను నివారించేందుకు, పాఠశాలల్లో కనీస మౌళిక వసతులను వంద శాతం ఏర్పాటుచేసేందుకు వంద శాతం బాలికలకు టాయిలెట్లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కూడా చర్యలు తీసుకోనున్నారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని అమలు చేస్తూ, వాటికి సంబంధించిన అభివృద్ధి ఇండికేటర్లను ఎప్పటికప్పుడు సిద్ధం చేయాలని నిర్ణయించారు.

# సర్వేలో రాజకీయ ప్రశ్నావళి

- ఏ రాజకీయ పార్టీకి గ్రాడ్యుయేట్ అనుకూలం ?
- ఎంప్లాయిమెంట్ సర్వేలో రాజకీయ పార్టీల ఆప్షన్లు

**ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి**

ఎంప్లాయిమెంట్ సర్వే పేరుతో వలంటీర్లతో చేయిస్తున్న సర్వే రాజకీయ సర్వే గానే కనిపిస్తోంది. సర్వేలో రాజకీయ పార్టీల ప్రస్తావన తీసుకురావడం రాజకీయ అవసరాల కోసమేనన్న చర్చకు మరింత బలం చేకూరుస్తోంది. పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన వారి వివరాలను, గ్రాడ్యుయేట్స్‌కు సంబంధించి ప్రత్యేకంగా ఆరు అంశాలను పొందుపరిచారు. అందులో ఏడో ప్రశ్నలో గ్రాడ్యుయేట్ ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని అడుగుతూ రాజకీయ పార్టీల ఆప్షన్లు ఇచ్చారు. వీటితోపాటు డిగ్రీలో ఏ కోర్సు? చేస్తున్న వృత్తి? వృత్తిపరమైన పని మీద ఏ ప్రాంతం నుంచి వలస వచ్చారు? వంటి వివరాలతో ప్రశ్నావళి రూపొందించారు. ఎలక్ట్రోరల్ రోల్‌లో గ్రాడ్యుయేట్ పేరు నమోదు చేసుకున్నారా? లేదా? అన్న విషయాన్ని సర్వే పత్రంలో పేర్కొన్నారు. కుటుంబంలో ఎంతమంది డిగ్రీ ఉత్తీర్ణులయ్యారో సంఖ్యతో పాటు వారికి సంబంధించిన అన్ని వివరాలనూ నమోదు చేస్తున్నారు. పదో తరగతి, ఇంటర్ చదువులకు సంబంధించి మాత్రం



సర్వే ప్రశ్నావళిలో రాజకీయ పార్టీల ఆప్షన్

ఎంతమంది ఉత్తీర్ణులయ్యారు అనే సంఖ్యను మాత్రమే పొందుపరిచారు.

**సచివాలయ ఉద్యోగుల సహకారంతో...**

ఎమ్మెల్సీ ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్‌లో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లపై అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు కొనసాగుతూనే ఉన్నాయి. తాము తహశీల్దార్ కార్యాలయాల్లో సమర్పిస్తామని కొందరు పట్టభద్రులు చెప్తున్నా, తమకు టార్గెట్లు ఉంటాయంటూ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు బదులిస్తున్నారు. సచివాలయ ఉద్యోగులు వలంటీర్లను పురమాయించి ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు ఫారాలు, ఇతర జిరాక్స్ కాపీలను సేకరిస్తున్నారు. వాటిని తీసుకెళ్లి అధికార పార్టీ నాయకులకు చేరవేస్తున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. అధికార పార్టీ నాయకులు ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటు చేసి ఓటు నమోదు చేయిస్తున్నట్లు తెలిసింది. ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతానికి అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహించి వలంటీర్ల సాయంతో ఎన్‌రోల్‌మెంట్ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు.

**'ప్రజాశక్తి' కథనంపై ఆరా**

ఎంప్లాయిమెంట్ సర్వే పేరుతో వలంటీర్లతో ప్రభుత్వం చేయిస్తున్న సర్వేపై ప్రజాశక్తిలో ఈనెల నాలుగో తేదీన ప్రచురితమైన కథనం కలకలం సృష్టించింది. ఈ కథనంపై సిఎంఒ కార్యాలయం, ఫీల్డ్ ఆపరేటింగ్ ఏజెన్సీ ఆరా తీయడం మొదలుపెట్టాయి. వాట్సాప్‌లో వచ్చిన ప్రశ్నావళి ఎక్కడ నుంచి వచ్చింది, అందులో ఉన్న కోడ్ ఆధారంగా విచారణ మొదలుపెట్టారు. సచివాలయాల నుంచి ఎటువంటి సమాచారం బయటకు లీక్ చేయొద్దని సిబ్బందిని గట్టిగా హెచ్చరించినట్లు తెలిసింది.

## హెల్త్ అలవెన్స్ రికవరీ నిర్ణయం దారుణం

- నేడు రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ వర్కర్ల నిరసనలు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం చెల్లిస్తున్న హెల్త్ అలవెన్స్‌లు రికవరీ చేయాలని నిర్ణయించడం దారుణమని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. కడపలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జనవరి నుంచి ఇప్పటి వరకు ఇచ్చిన హెల్త్ అలవెన్స్‌లు రికవరీ చేయాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 5న రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్, కార్పొరేషన్‌ల ఎదుట నిరసన కార్యక్రమాలకు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2019 ఆగస్టు నుంచి కార్మికులకు హెల్త్ అలవెన్స్‌లు చెల్లిస్తుందని తెలిపారు. 2022లో అలవెన్స్ చెల్లించేందుకు నిరాకరించడంతో జెఎసి ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేయడంతో ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. బకాయిలతో సహా చెల్లించాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. అయితే, మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్న హెల్త్ అలవెన్స్‌లు జనవరి నుంచి రికవరీ చేయాలని తెనాలిలోని ట్రెజరీ, మున్సిపల్ అధికారులకు గతనెల 22న ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని పేర్కొన్నారు. దీన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని చూస్తోందని తెలిపారు. హెల్త్ అలవెన్స్ రికవరీ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికులు సమ్మెకు సిద్ధమవుతారని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, ఫెడరేషన్ జిల్లా కోశాధికారి గోపి, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుంకర రవి, వై.ఎం.కేశవులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్, ఇత్తడి ప్రకాష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి

## నేవల్ బేస్ నిర్వాసితులపై నిర్లక్ష్యం తగదు

- ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి

**ప్రజాశక్తి - రాంబిల్లి (అనకాపల్లి జిల్లా)**

నేవల్ బేస్ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు ఇచ్చేసి ఉపాధి కోల్పోయిన వారిని ఆదుకోకుండా 17 ఏళ్లుగా ప్రభుత్వాలు ఇబ్బందులకు గురిచేయడం దారుణమని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వాడనర్సాపురం గ్రామం వద్ద గల నేవల్ ఆల్టర్నేటివ్ ఆపరేటింగ్ బేస్ (ఎన్ఎఒబి) మెయిన్ గేటు వద్ద నేవల్ బేస్ నిర్వాసితులు చేపట్టిన ఆందోళన శుక్రవారానికి ఐదో రోజుకు చేరింది. వారి పోరాటానికి మద్దతు తెలుపుతూ ప్రభావతి మాట్లాడారు. 2010-11లో నిర్వాసితులు చేసిన పోరాటాల ఫలితంగా అప్పటి జిల్లా కలెక్టర్, అధికారులు దిగొచ్చి పలు డిమాండ్లను నెరవేర్చేందుకు హామీ ఇచ్చారని, ఆ తరువాత కాలంలో వాటిని గాలికొదిలేశారని విమర్శించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పురుషులతో సమానంగా మహిళలకు ప్యాకేజీలు అమలు చేయాలని, ఉపాధి కల్పించాలని కోరారు. నేవీ కాలనీ, గోవిందపాలెం, కొత్తపేట, చినకలవలావల్లి, వాడపాలెం గ్రామాలను నేవీ ప్రభావిత గ్రామాలుగా గుర్తించి ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి ఆర్‌డిఒ చిన్నికృష్ణ, ఫిషరీస్ జెడి లక్ష్మణరావు, తహశీల్దార్ భాగ్యవతి ఆందోళన ప్రాంతానికి వచ్చి నిర్వాసితులతో మాట్లాడారు. నిర్వాసితుల సమస్యలపై కలెక్టర్‌తో చర్చించామని, ఎనిమిది గ్రామాల పెద్దలు వస్తే వారితో మాట్లాడటానికి కలెక్టర్ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కలెక్టరే తమ ఆందోళన ప్రాంతానికి వచ్చి చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని నిర్వాసితులు తేల్చిచెప్పారు. ఆందోళనలో ఎపి మత్స్యకార, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా నాయకులు బి.లక్ష్మి, సిపిఎం నాయకులు జి.దేముడు నాయుడు, ఎనిమిది గ్రామాల నిర్వాసితులు పాల్గొన్నారు.

## విద్యుత్ రంగంలో సంస్కరణలు-రైతులపై ప్రభావం

- 16న కడపలో సదస్సు : ప్రభాకర్‌రెడ్డి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

'విద్యుత్ రంగంలో సంస్కరణలు-రైతులపై ప్రభావం' అనే అంశంపై ఈ నెల 16న కడపలో సదస్సు నిర్వహించనున్నట్లు ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విద్యుత్‌రంగ నిపుణులు అశోక్‌రావు హాజరై, ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 16 నుంచి 18 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రైతు శిక్షణా తరగతుల్లో 'వ్యవసాయ రంగం-సంక్షోభం' అనే అంశంపై ఎపి రైతుసంఘం రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు, 'రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు-పాలకుల వైఖరి'పై రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు బి.నారాయణ ప్రసంగించనున్నారని తెలిపారు. రైతులు, శ్రేయోభిలాషులు సదస్సుకు హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

## నంద్యాలలో రాష్ట్రస్థాయి కథా నాటిక పోటీలు

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

అప్పాజోస్యుల, విష్ణుభొట్ల, కందాళం ఫౌండేషన్ ఆధ్వర్యాన నంద్యాల మున్సిపల్ టౌన్‌హాల్లో జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి కథా నాటిక పోటీలు నిర్వహించనున్నామని ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎ.సత్యనారాయణ తెలిపారు. గుంటూరులోని సర్వే ఉద్యోగ భవనంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత 29 ఏళ్లుగా అప్పాజోస్యుల - విష్ణుభొట్ల - కందాళం ఫౌండేషన్ రాష్ట్రంలోని వివిధ పట్టణాలలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తూ ప్రఖ్యాతి గాంచిన సాహితీవేత్తలకు, సామాజిక సేవా రంగ ప్రముఖులకు 'ప్రతిభా మూర్తి జీవితకాల సాధన పురస్కారం', ఇతర విశిష్ట పురస్కారాలను అందజేస్తున్నట్లు తెలిపారు. 2023 సంవత్సరానికిగానూ ప్రతిభా మూర్తి జీవితకాల సాధన పురస్కారానికి కడప జిల్లా పాలగిరికి చెందిన కోడూరు ప్రభాకర్‌రెడ్డి, విశిష్ట సాహితీ మూర్తి జీవిత కాలసాధన పురస్కారాన్ని కడప జిల్లా గడికోటకు చెందిన వల్లేటి లక్ష్మీ కులశేఖర్, సరిలేరు నీకెవ్వరు విశిష్ట పురస్కారాన్ని నంద్యాల జిల్లా పాణ్యంకు చెందిన డాక్టర్ ఎం హరికృష్ణను ఎంపిక చేసినట్లు తెలిపారు. 8న పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఫౌండేషన్ చీఫ్ కోఆర్డినేటర్ అంబటి మురళీకృష్ణ, ఫౌండేషన్ ఎవికె కృష్ణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా బోధన, శిక్షణ

- ఎంఎస్ఎంఇ అసోసియేషన్‌తో ఒప్పందం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

తరగతి గది అభ్యాసంతో పాటు పరిశ్రమ రంగానికి అవసరమైన ప్రత్యేక శిక్షణను అందించేందుకు సాంకేతిక విద్య శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని కమిషనర్ సిహెచ్ నాగరాణి తెలిపారు. విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణపై ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల ( ఎంఎస్ఎంఇ) అసోసియేషన్, సాంకేతిక విద్య మధ్య అవగాహన ఒప్పందం శుక్రవారం జరిగింది. 14 రకాల పరిశ్రమల్లో 229 మంది విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణను అందించడానికి అసోసియేషన్ ముందుకొచ్చింది. డిప్లొమో కోర్సులకు చివరి ఏడాదిలో ఆరు నెలల నాణ్యమైన పారిశ్రామిక శిక్షణను విద్యార్థులకు అందించే క్రమంలో చేపడుతున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని కమిషనర్ తెలిపారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని సిఎం వైఎస్ జగన్ ఆదేశాలకు అనుగుణంగా తాము కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ విద్యార్థులకు నాణ్యమైన పారిశ్రామిక శిక్షణను అందించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్య సంయుక్త సంచాలకులు వి పద్మారావు, ఉప సంచాలకులు ఎంవివి రామకృష్ణ, విజయ భాస్కర్, ఎంఎస్ఎంఇ అసోసియేషన్ ప్రతినిధులు పార్థసారధి, ఎంఎస్ రామచంద్రరావు, వి రమేష్ బాబు పాల్గొన్నారు.

## అయ్యన్న అరెస్టు కక్షసాధింపే : కళావెంకట్రావు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

టిడిపి సీనియర్ నేత అయ్యన్నపాత్రుడుని అరెస్టు చేయడం జగన్ అధికార కక్ష సాధింపేనని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి వెంకట్రావు విమర్శించారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అయ్యన్నపాత్రుడి విషయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు అత్యంత దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య విషయంలో వైఎస్ షర్మిల ఇచ్చిన వాంగ్మూలం ప్రజల్లో చర్చకు దారి తీసిందని, దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లకుండా ఉండేందుకు అడ్డగోలు పనులకు దిగుతున్నారని పేర్కొన్నారు. విశాఖలో ఎన్నడూ లేని విధంగా రూ.40 వేల కోట్ల విలువైన ఆస్తుల్ని అధికార పార్టీ నేతలు కబ్జా చేశారని ఆరోపించారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ 'వివేకానందరెడ్డి హత్య'పై సిబిఐతో దర్యాప్తు జరిపించాలని కోరారు. 'వివేకాను ఎవరు చంపారు? ఎందుకు చంపారు? ఎలా చంపారు?' అనే విషయాలు బహిర్గతం కావాలంటే సిబిఐ వెంటనే విచారించాలని ఆయన అన్నారు.

## రాళ్ల దాడిచేసే దుస్థితికి దిగజారిన జగన్ : లోకేష్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

చీకట్లో రాళ్లదాడి చేసే దుస్థితికి వైఎస్ జగన్ దిగజారిపోయారని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు కాన్వాయ్‌పై వైసిపి రౌడీ మూకల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని, దాడికి పాల్పడిన వైసిపి రౌడీలను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ దొంగ ఓట్లనే నమ్ముకున్న దొంగ ముఖ్యమంత్రి గుట్టు మరోసారి రట్టు అయ్యిందని లోకేష్ మరో ప్రకటనలో విమర్శించారు. తూర్పు, పశ్చిమ రాయలసీమ నియోజకవర్గాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం టీచర్లు కాని వారిని, అర్హత లేని వారిని ఓటర్లుగా వైసిపి నేతలు చేరుస్తున్నారని తెలిపారు. దొంగల పార్టీ వైసిపికి చెందిన వారిని ఓటర్లుగా చేర్చుకోలేదనే కక్షతో అనంతపురం, నెల్లూరు డిఇఒలను బదిలీ చేసి పోస్టింగ్ కూడా ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ తక్షణమే జోక్యం చేసుకుని దొంగ టీచర్ల ఓట్ల చేర్పులను అడ్డుకోవాలని కోరారు.

## పవన్‌కు జడ్ కేటగిరి భద్రత కల్పించాలి : జనసేన

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు జడ్ కేటగిరి భద్రత కల్పించాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన మహేష్ కోరారు. పవన్‌పై దాడి చేసేందుకే హైదరాబాద్‌లో రెక్కీ నిర్వహించారని, హత్యారాజకీయాలను ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వమే ఈ దాడులకు ఉసికొల్పిందని ఆయన ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని పోతిన పేర్కొన్నారు. రెక్కీ నిర్వహించడాన్ని నిరసిస్తూ శుక్రవారం నాడు విజయవాడలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో పోతిన మాట్లాడారు. తాడేపల్లి ప్యాలెస్‌లో పవన్‌కు వ్యతిరేకంగా కుట్ర జరుగుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో తనను ఎవరూ ప్రశ్నించకూడదన్న ధోరణితో సిఎం వ్యవహరించడం సరికాదన్నారు. తక్షణం పవన్‌కల్యాణ్‌కు జడ్ కేటగిరి భద్రత కల్పించాలని కోరారు.

## పులి దాడిలో 25 మేకలు మృతి

- ఐదు రోజులుగా వరుస దాడి

**ప్రజాశక్తి - అనకాపల్లి**

నాలుగు నెలలుగా అనకాపల్లి జిల్లా ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న పులి మరోసారి పంజా విసిరింది. అనకాపల్లి మండలం మూలపేట గ్రామానికి చెందిన ఈగల శ్రీనుకు చెందిన మేకలపై వరుసగా ఐదు రోజులు దాడి చేసి 25 మేకలను చంపేసింది. మేతకోసం తనకున్న 80 మేకలను శ్రీను కొండ ప్రాంతంలో విడిచిపెట్టేవాడు. రెండు రోజుల తరువాత అవి తిరిగి వచ్చేవి. ఈ క్రమంలో ఐదు రోజుల క్రితం మేతకోసం వెళ్లిన 25 మేకలు తిరిగిరాకపోడంతో వాటి కోసం శ్రీను గాలించాడు. కొండ ప్రాంతంలో దుర్వాసన వస్తున్న ప్రాంతానికి వెళ్లి చూడగా మేకలు చనిపోయి కనిపించాయి. వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి పులి చంపినట్టుగా నిర్ధారించారు. బాధితుడిని అఖిలపక్ష ప్రజా సంఘాలు, పార్టీల నాయకులు శుక్రవారం పరామర్శించారు. చనిపోయిన ప్రతి మేకకు లక్ష రూపాయల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## వచ్చే నెల 4న ఢిల్లీ పురపాలక ఎన్నికలు

**న్యూఢిల్లీ :** ఢిల్లీ పురపాలక ఎన్నికల నగారా మోగింది. వచ్చేనెల 4న ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ (ఎంసిడి) ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నట్లు ఆ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. డిసెంబర్ 7న ఫలితాలు వెల్లడించనున్నట్లు తెలిపింది. ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 7న విడుదలవుతుందని, 14 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ డాక్టర్ విజయ్ దేవ్ తెలిపారు. ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్‌లో 250 వార్డులు ఉండగా, వీటిలో 42 షెడ్యూల్ కులాలకు కేటాయించారు. 50 శాతం సీట్లను మహిళలకు రిజర్వ్ చేశారు. 2022 జనవరి 1 నాటికి ఢిల్లీలో 1.46 కోట్లకు పైగా ఓటర్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ప్రారంభంలో ఢిల్లీలోని మూడు మునిసిపల్ కార్పొరేషన్లను కేంద్రం మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీగా విలీనం చేసిన సంగతి తెలిసిందే. వార్డుల సంఖ్యను 250 నుంచి 272కి పెంచింది.

## మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- 11మంది మృతి

**మధ్యప్రదేశ్ :** మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాష్ట్రంలోని బేతుల్ జిల్లాలోని బస్సు, కారు ఢీకొనడంతో 11 మంది అక్కడికక్కడే మరణించగా, ఒకరికి గాయాలయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... 11 మంది కూలీలు మహారాష్ట్రలోని అమరావతి నుంచి కారులో తిరిగి వస్తుండగా గుర్‌గావ్, భైస్‌దేహి మధ్య ఝుల్లార్ పోలీస్ స్టేషన్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున 2 గంటలకు ప్రమాదం జరిగిందన్నారు. కారు డ్రైవర్ నిద్రమత్తులో ఉండటమే ప్రమాదానికి కారణమన్నారు.

## ఇమ్రాన్ ఖాన్‌పై కాల్పుల వీడియో లీక్ చేసిన అధికారులపై వేటు

**లాహోర్ :** పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ పాల్గొన్న ర్యాలీపై గురువారం కాల్పులు జరిపిన నిందితుడు మాట్లాడిన వీడియో లీక్ కావడంపై పాక్ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నందుకే ఇమ్రాన్ ఖాన్‌ను చంపాలని అనుకున్నట్లు నిందితుడు విచారణ సందర్భంగా పోలీసులకు చెప్పాడు. రహస్యంగా ఉంచాల్సిన ఈ వీడియో లీక్ కావడంతో నిందితుడ్ని ఉంచిన పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌తో సహా ఇతర అధికారుల్ని పంజాబ్ ముఖ్యమంత్రి చౌదరీ పర్వేజ్ ఎలాహి సస్పెండ్ చేశారు. బాధ్యులైన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పంజాబ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌ను ఆదేశించారు.

**ప్రధాని మరో ఇద్దరు దాడికి బాధ్యులు:ఇమ్రాన్**

పాకిస్థాన్ ప్రస్తుత ప్రధాని షెహబాజ్ షరీఫ్, అంతర్గత వ్యవహారాల మంత్రి సనావుల్లా, మేజర్ జనరల్ ఫైసల్ నజీర్ తనపై దాడికి బాధ్యులని ఇమ్రాన్‌ఖాన్ ఆరోపించారు. ఈ మేరకు పాకిస్థాన్ తెహ్రీక్ – ఇ–ఇన్సాఫ్ (పిటిఐ) ఒక వీడియోలో తెలిపింది. ప్రస్తుతం ఇమ్రాన్ ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని, ఇమ్రాన్ కుడికాలికి నాలుగు బుల్లెట్టు తగిలాయని ఆయనకు వైద్యం చేస్తున్న డాక్టర్ ఫైజల్ సుల్తాన్ తెలిపారు. ఈ ఘటనలో మరో ఏడుగురికి గాయాలు కాగా, ఒకరు మరణించినట్లు పోలీసులు చెప్పారు.

# ఇండియన్స్.. ఇంటికి వెళ్లండి...

### ట్విట్టర్ ఉద్యోగులను తొలగించిన మస్క్

**న్యూఢిల్లీ :** ప్రముఖ మైక్రో బ్లాగింగ్ యాప్ ట్విట్టర్ ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ దారుణంగా ఉంది. "మీరు ఆఫీస్‌లో ఉన్నా.. ఆఫీస్‌కు బయలు దేరినా దయచేసి ఇంటికి తిరిగి వెళ్లండి' అంటూ తమ ఉద్యోగులకు పంపిన మెయిల్స్‌లో ట్విట్టర్ రాసింది. ట్విట్టర్‌ను ఎలన్ మస్క్ స్వాధీనం చేసుకున్న తర్వాత భారత్‌సహా పలు దేశాల్లో కంపెనీలో ఉద్యోగుల తొలగింపుపై దృష్టి పెట్టారు. దాదాపు 3,800 మందిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు, వారిలో అత్యధికులు భారతీయులేనని సమాచారం. ఇప్పటికే ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) పరాగ్ అగర్వాల్‌ను, సిఎఫ్ఒలను ఇంటికి పంపించారు. స్వయంగా సిఇఒ బాధ్యతలను మస్క్ తీసుకున్నారు. పలువురు ఉన్నతాధికారులను తొలగించారు. ట్విట్టర్‌లో దాదాపు సగానికిపైగా ఉద్యోగులను ఇంటికి పంపేందుకు జాబితాను సిద్ధం చేశారని రిపోర్టులు వస్తున్నాయి. ట్విటర్‌లో మొత్తం ఉద్యోగులు 7,500 మంది ఉండగా, శుక్రవారం రోజు వారిలో సగం మంది ఉద్యోగుల్ని ఇంటికి సాగనంపిందని న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది. ఈ విషయమై ట్విట్టర్ ఉద్యోగులకు మెయిల్స్ పంపింది. ఆఫీస్‌కు రావొద్దని, ఇంటికి వెళ్లొచ్చని ఆదేశాలు జారీ చేసింది. అనేక కంపెనీలు




ఇప్పటి వరకు ఉద్యోగులను తొలగించాయి. కానీ.. ఇంత దారుణంగా దారి మధ్యలోంచే ఇంటికి వెళ్లిపోవాలని సూచించడం ఇదే తొలిసారి. ఉద్వాసనకు గురైన ఉద్యోగులకు రెండు నెలల జీతంతో పాటు.. వారి ఈక్విటీలకు సమానమైన నగదును మూడు నెలల్లో చెల్లించనున్నట్లు ట్విట్టర్ వర్గాలు తెలిపాయి.

భారత్‌లోనూ పలువురు ఉద్యోగులకు తొలగింపు లేఖలు అందాయని సమాచారం. ఇక్కడ ఎంత మందిని తొలగించిందీ స్పష్టత లేదు. దేశంలోని పలువురు ఉద్యోగులు కార్యాలయాలకు చేరుకున్న తర్వాత అధికారిక ఇ–మెయిల్స్, గ్రూప్ చాట్‌ల యాక్సెస్ కోల్పోవడంతో మరింత గందరగోళానికి గురయినట్లు తెలిపారు. ఇంటి నుంచి పనిలో భాగంగా తమ సిస్టమ్స్‌లో లాగిన్ అయేందుకు ప్రయత్నిస్తే అనుమతించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఉద్యోగాలు ఉన్నాయో, పోయాయో తెలియక ఆందోళనకు గురవుతున్నట్టు తెలిపారు. భారత్‌కు చెందిన 25 ఏళ్ల యశ్ అగర్వాల్ తన ఉద్యోగం పోయిందని ట్విట్టర్‌లో పేర్కొనడం వైరల్‌గా మారింది. ట్విట్టర్ మౌలిక సదుపాయాల ఖర్చులను ఏడాదికి ఒక బిలియన్ డాలర్ల (దాదాపు రూ.8,208 కోట్లు) వరకు తగ్గించుకోవాలని మస్క్.. ట్విట్టర్ టీంను ఆదేశించినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే భారీగా కోతల ప్రక్రియను చేపట్టినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి.



## నైట్ ఈజ్ అవర్స్

చెన్నై : లింగసమానత్వం ప్రాముఖ్యతను చాటుతూ 'నైట్ ఈజ్ అవర్స్' పేరుతో నైట్‌వాక్‌ను సిపిఎం సెంట్రల్ చెన్నై జిల్లా కమిటీ నిర్వహించింది. పెరియార్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు జి రామకృష్ణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

### గుజరాత్ ఆప్ సిఎం అభ్యర్థిగా

## మాజీ టివి యాంకర్ ఇసుదాన్ గాఢ్వీ



**న్యూఢిల్లీ :** గుజరాత్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా మాజీ జర్నలిస్ట్, మాజీ టివి యాంకర్ ఇసుదాన్ గాఢ్వీ (40) పేరును ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ప్రకటించారు. గుజరాత్ సిఎం అభ్యర్థి కోసం ఆప్ నిర్వహించిన సర్వేలో ఇసుదాన్ 73 శాతం ఓట్లను గెలుచుకున్నారు. గాఢ్వీ గతేడాది జూన్‌లో ఆప్‌లో చేరారు. అంతకుముందు రాష్ట్రంలోని వార్తా చానళ్లలో యాంకర్‌గా పనిచేశారు. తనలాంటి సాధారణ, నిరాడంబర రైతు కుమారుడికి కేజ్రీవాల్ ఇంత పెద్ద బాధ్యత అప్పగించారని ఇసుదాన్ పేర్కొన్నారు. ఆప్ గుజరాత్ యూనిట్ అధ్యక్షుడు గోపాల్ ఇటాలియా పోటీ పడినా, ఫోన్ ద్వారా వచ్చిన ఓట్లను బట్టి గాఢ్వీని ఎంపిక చేసినట్లు కేజ్రీవాల్ తెలిపారు. పంజాబ్ సిఎం భగవంత్ మాన్‌ను కూడా ఇదే విధంగా సర్వే ద్వారా ఎంపిక చేశారు.

## ఢిల్లీ, యుపి, పంజాబ్, హర్యానాలకు ఎన్‌హెచ్‌ఆర్‌సి నోటీసులు

- ఢిల్లీలో వర్క్ ఫ్రమ్ హోమ్, స్కూళ్లు మూసివేత

**న్యూఢిల్లీ :** వాయు కాలుష్యం తీవ్రంగా పెరుగుతున్న నేపథ్యంలో ఢిల్లీ, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ఆయా రాష్ట్రాల ప్రధానకార్యదర్శులు ఈ నెల 10న సమావేశానికి హాజరుకావాలని తెలిపింది. ఢిల్లీలో కాలుష్యం తీవ్రస్థాయికి చేరింది. దీంతో కాలుష్య నివారణకు ఢిల్లీ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల్లో 50 శాతం మందికి 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానాన్ని ప్రకటించింది.శనివారం నుండి ప్రాథమిక పాఠశాలలను మూసివేస్తున్నట్టు ప్రకటించింది.

## రాజకీయ పార్టీ ఎందుకు పిటిషన్ వేసింది?


- ఆ పిటిషన్‌ను హైకోర్టు ఎలా స్వీకరించింది?
- ఆ పార్టీకున్న అర్హతేంటో ప్రశ్నించాల్సింది
- ఎమ్మెల్యేల కొనుగోళ్ల నిందితుల బెయిల్ పిటిషన్‌పై సుప్రీం ధర్మాసనం

**ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో**

టిఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బిజెపి ప్రయత్నించిందన్న ఆరోపణలపై తెలంగాణ పోలీసులు అరెస్టు చేసిన ముగ్గురు వ్యక్తుల బెయిల్ పిటిషన్ విచారించిన సుప్రీం కోర్టు ధర్మాసనం ఎటువంటి ఉపశమనం ఇవ్వకుండానే సోమవారానికి (నవంబర్ 7) వాయిదా వేసింది. బిజెపి ఏజెంట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రామచంద్ర భారతి, నంద కుమార్, సింహయాజి స్వామి అనే ముగ్గురు వ్యక్తులు సైబరాబాద్ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ ఎదుట లొంగిపోవాలని తెలంగాణ హైకోర్టు అక్టోబర్ 29న ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ శుక్రవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ బివి నాగరత్నలతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది కె.వి విశ్వనాథన్ వాదనలు వినిపిస్తూ డబ్బు రికవరీ కానందున, వారు లొంగిపోవాలని హైకోర్టు తప్పుగా ఆదేశించిందని తెలిపారు. ఏడేళ్లలోపు శిక్షపడే కేసుల్లో 41 (ఏ) నోటీసు ఇవ్వకుండా నిందితులని అరెస్టు చేయకూడదని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నా అందుకు విరుద్ధంగా అరెస్టు చేశారని తెలిపారు. అరెస్టులో మార్గదర్శకాలను కూడా ఉల్లంఘించారని పేర్కొన్నారు. బిజెపిని కించపరిచేలా, పిటిషనర్లను ఇరికించేందుకే టిఆర్ఎస్ నేతల కోరిక మేరకు ఈ ఫిర్యాదు దాఖలయ్యిందని వాదనలు వినిపించారు. ఈ దశలో జస్టిస్ బి.ఆర్ గవాయ్ జోక్యం చేసుకొని నగదు స్వాధీనం చేసుకున్న ట్రాప్ కేసుల్లోనూ అదే రోజు బెయిల్ ఇస్తున్నారు కదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా జోక్యం చేసుకుంటూ దర్యాప్తు కోరుతూ ఓ రాజకీయ పార్టీ (బిజెపి) హైకోర్టును ఆశ్రయించిందని తెలిపారు. దర్యాప్తుపై స్టే విధించాలని హైకోర్టులో ఓ పార్టీ ఎందుకు పిటిషన్ దాఖలు చేసిందని ధర్మాసనం ప్రశ్నించింది. ఆ పిటిషన్‌ను హైకోర్టు విచారణకు ఎలా స్వీకరించిందని ధర్మాసనం ప్రశ్నించింది. నిందితుల తరపు న్యాయవాది విశ్వనాథన్ స్పందిస్తూ తాము ఆ పిటిషన్ దాఖలు చేయలేదన్నారు. బిజెపి దాఖలు చేసిన పిటిషన్‌తో తమకు సంబంధం లేదని, సంబంధం లేని విషయంలో తాము ఎందుకు ఇబ్బందిపడాలన్నారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికి వారెవరని (బిజెపి) లూథ్రా ప్రశ్నించారు. ఈ దశలో జస్టిస్ బి ఆర్ గవాయ్ జోక్యం చేసుకొని, పిటిషన్ దాఖలు చేయడానికి ఆ పార్టీకి ఉన్న అర్హత (లోకస్) ఏమిటని హైకోర్టు ప్రశ్నించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఒక రాజకీయ పార్టీ పిటిషన్ దాఖలు చేస్తే దాన్ని విచారించాల్సిన అవసరం హైకోర్టుకు ఏముందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. హైకోర్టు విచారణలో ఏం జరిగిందని ధర్మాసనం ప్రశ్నించగా దర్యాప్తు చేయకుండా శుక్రవారం వరకు హైకోర్టు పెండింగ్‌లో పెట్టి తమ చేతులు కట్టివేసిందని లూథ్రా తెలిపారు. నిందితులు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారని, అవి ఏడో తేదీన విచారణకు వస్తున్నాయని లూథ్రా తెలిపారు. అనంతరం నిందితుల బెయిల్ పిటిషన్లపై ఎసిబి కోర్టు విచారణ చేపట్టడానికి సుప్రీం కోర్టుతో పాటు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లు అడ్డంకి కాదని, నిబంధనల ప్రకారం విచారణ చేపట్టవచ్చని అని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

## ఉన్నత విద్యా సంస్థల బలోపేతానికి హైలెవల్ ప్యానల్ చైర్‌పర్సన్‌గా రాధాకృష్ణన్

**ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో**



ఉన్నత విద్యా సంస్థల అసెస్‌మెంట్, అక్రిడిటేషన్‌ను బలోపేతం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం ఐఐటి కాన్పూర్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్, ఐఐటి కౌన్సిల్ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ కె. రాధాకృష్ణన్ అధ్యక్షతన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో మహాపురుష శ్రీమంత శంకరదేవ యూనివర్శిటీ (అస్సాం) వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మృదుల్ హజారికా, ఐఐఎం లక్నో ప్రొఫెసర్ భరత్ భాస్కర్, కేంద్ర విద్యా శాఖ సంయుక్త కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ అసెస్‌మెంట్, అక్రిడిటేషన్ ప్రక్రియలను బలోపేతం చేయడం, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ–2020లో పేర్కొన్న నేషనల్ అక్రిడిటేషన్ కౌన్సిల్ కోసం రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేయడం వంటివి చేస్తుంది. అక్రిడిటేషన్ ఉన్నత విద్యా సంస్థలకు సమాచార సమీక్ష ప్రక్రియతో వారి బలాలు, బలహీనతలను అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది.

## అమృత్‌సర్‌లో శివసేన నేత కాల్చివేత

**న్యూఢిల్లీ :** పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో శుక్రవారం పట్టపగలే దారుణం జరిగింది. శివసేన నేత సుధీర్ సూరి హత్యకు గురయ్యారు. గోపాల్ టెంపుల్ సమీపంలోని మజీతా రోడ్డు వద్ద గుర్తు తెలియని వ్యక్తి సుధీర్‌పై కాల్పులు జరపడంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలారు. ఆలయం వెలుపల ఉద్ధవ్ థాకరే శివసేన వర్గానికి చెందిన కొందరు నేతలు నిరసన తెలుపుతుండగా అక్కడి గుంపులోంచి ఒక వ్యక్తి కాల్పులు జరిపినట్టు చెబుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. కాల్పులకు ఉపయోగించిన ఎ.30 పిస్తోల్‌ను స్వాధీనం చేసుకున్నారు. షూటింగ్ ప్రదేశం వద్ద ఒక వ్యక్తి కాల్పులు జరుపుతూ కెమెరాకు చిక్కాడు. ఇద్దరు వ్యక్తులు కారు నుంచి దిగి కాల్పులు జరిపినట్టు ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. కాల్పుల ఘటన అనంతరం స్థానిక నేతలు నిరసనలకు దిగారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పంజాబ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలినట్టు శివసేన పంజాబ్ అధ్యక్షుడు యోగిరాజ్ శర్మ ఆరోపించారు.

**పోలీసుల అదుపులో నిందితుడు**

కాల్పులకు పాల్పడిన వ్యక్తిని కొద్ది సేపటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని నగరంలోని సుల్తాన్‌విండ్ ప్రాంతానికి చెందిన సందీప సింగ్‌గా గుర్తించారు. ఘటన ప్రాంతానికి మరో ముగ్గురితో కలిసి ఎస్‌యువిలో వచ్చాడని, మిగతా ముగ్గురు పారిపోయారని పోలీసులు తెలిపారు.

## ఎపి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బోగస్ ఓట్ల నమోదు ఆపాలి : ఇసిఐకి ఫిర్యాదు

**ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో**

ఏపిలో రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో రాష్ట్రప్రభుత్వం చేస్తున్న బోగస్ ఓట్ల నమోదు ఆపాలని అభ్యర్థి బి.మదన్‌మోహన్ రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. బోగస్ ఓట్ల నమోదుకు సంబంధించి ఇప్పటికే స్థానిక మీడియాల్లో ప్రచురితం అయిన పేపర్ కట్టింగ్స్‌ను కూడా వినతి పత్రానికి జత చేశారు. కడప, అనంతపురం, కర్నూల్ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఓట్ల నమోదు జరుగుతోందని, ఇందులో అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు స్థానిక మీడియాలో వచ్చాయని పేర్కొన్నారు. ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల్లో పని చేయని వారిని కూడా ఓటర్లుగా నమోదు చేస్తున్నారని ఇసి దృష్టికి తీసుకెళ్లారు. బోగస్ ఓట్ల నమోదును అడ్డుకున్న అనంతపురం జిల్లా విద్యా అధికారి(డిఇఒ)ను బదిలీ చేశారని వివరించారు. బోగస్ ఓట్ల నమోదును ఆపాలని, అక్రమంగా బదిలీ చేసిన అధికారిని తిరిగి అదే స్థానానికి తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

## ముగిసిన జి-7 మంత్రుల సమావేశం

**బెర్లిన్ :** రష్యా–ఉక్రెయిన్ సంక్షోభమే ప్రధాన అజెండాగా జి–7 దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం జరిగింది. గురు, శుక్రవారాల్లో జర్మనీలోని మాన్‌స్టర్‌లో జరిగిన ఈ సమావేశంలో ఉక్రెయిన్–రష్యా సంక్షోభంతోపాటు ఉక్రెయిన్‌కు సహాయం చేసే విషయంపైనా చర్చించారు. ఉక్రెయిన్‌ను పునర్నిర్మించడానికి, పునరుద్ధరించడానికి, విద్యుత్ వ్యవస్థలు, నీటి వ్యవస్థలను రక్షించడానికి సహాయం చేయాలని మంత్రులు భావించినట్లు అధికారులు తెలిపారు. ఉక్రెయిన్‌కు ధాన్యం ఎగుమతి ఒప్పందాన్ని రష్యా పొడిగించాలని మంత్రులు విజ్ఞప్తి చేశారు. 'ఆకలిని ఒక ఆయుధంగా ఉపయోగించుకోకూడదు' అని మంత్రులు పేర్కొన్నారు. ప్రస్తుతానికి ఉక్రెయిన్‌కు ధాన్యం ఎగుమతికి రష్యా అనుమతించింది. ఈ నెల 19 తరువాత ఈ ఒప్పందాన్ని పొడిగించాలా? వద్దా? అనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని రష్యా తెలిపింది.

## స్థిర ధరలకు ఇంధనం ఇవ్వం : రష్యా

**మాస్కో :** స్థిరీకరించిన ధరలకు ఇంధనాన్ని విక్రయించాలని ఏడు దేశాల బృందం (జి7) ప్రతిపాదనలపై రష్యా ఆగ్రహం వ్యక్తం చేసిందని సమాచారం. జి7 దేశాలు రష్యా చమురుపై ధరల పరిమితిని నెలల తరబడి చర్చిస్తున్నాయి, డిసెంబర్ 5 నుంచి చమురుపై, వచ్చే ఏడాది ఫిబ్రవరి 5 నుంచి పెట్రోలియం ఉత్పత్తులపై పరిమితి అమల్లోకి రానుంది." అని రాయిటర్స్ రిపోర్టు చేసింది. ధరల పరిమితులను ప్రవేశపెట్టే దేశాలకు చమురు విక్రయించబోమని రష్యా హెచ్చరికలు జారీ చేసింది.



## ఎల్‌డిఎఫ్ హయాంలో 3 లక్షలకు పైగా ఇళ్లు మంజూరు

**తిరువనంతపురం :** కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం వరసగా రెండోసారి అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకూ 50,650 ఇళ్లను లైఫ్ మిషన్ పథకం ద్వారా లబ్ధిదారులకు అందించింది. ఈ ఇళ్ల నిర్మాణానికి రూ.3,828.61 కోట్లు వ్యయం చేసింది. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఆరేళ్లలో ఇళ్లులేని పేదల కోసం మొత్తంగా 3,13,725 ఇళ్లను నిర్మించింది. ఈ ఇళ్ల నిర్మాణానికి రూ.9,521 కోట్లను వ్యయం చేసింది.

## ఉన్నత విద్యారంగాన్ని నాశనం చేయాలనుకుంటున్నారు

- కేరళ మంత్రి బిందు



**అలపుజ :** యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్లందరినీ ఒకేసారి తొలగించాలని గవర్నర్ ఆదేశాలు జారీ చేయడం ఉన్నత విద్యారంగాన్ని నాశనం చేయాలని భావించడమేనని కేరళ ఉన్నత విద్య, సామాజిక న్యాయ శాఖ మంత్రి ఆర్. బిందు విమర్శించారు. తన విశ్వాసం కోల్పోయినందున ఆర్థిక మంత్రిని తొలగించాలని కోరడం కూడా రాచరికపు కాలం నాటి సంప్రదాయమని అన్నారు. అలపుజలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన "న్యూ కేరళ అండ్ హయ్యర్ ఎడ్యుకేషన్" సెమినార్‌ను మంత్రి ప్రారంభించారు. కేరళలో ఉన్నత విద్య అజెండాను ఆర్ఎస్ఎస్ నిర్దేశించాలని అనుకుంటోందని, ఇది ఆందోళనకరమని అన్నారు. సమా జాన్ని విభజించి నాశనం చేస్తున్న రహస్య విచ్ఛిన్నకర శక్తులు కేరళలోని ఉన్నత విద్యారంగంపై దాడి చేస్తున్నాయని విమర్శించారు. కేరళ ప్రగతిశీల ఆలోచనలను నాశనం చేయాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. రక్షకుడిగా ఉండాల్సిన వారే శిక్షకుడిగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. కేరళలో యూనివర్శిటీలు మంచి పనితీరుతో ముందుకు సాగుతున్నాయని అన్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా బడ్జెట్‌లో ప్రకటించిన ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, ఉన్నత విద్యారంగంలో కేరళ నంబర్‌వన్‌గా మారుతుందని మంత్రి తెలిపారు.

## అమృత మహోత్సవాలంటే... ఆకలి భారతమేనా?

(మొదటి పేజీ తరువాయి)

భద్రత కోసమే కాకుండా ప్రజల జీవితాలను రక్షించడం కోసం పథకాలను కాపాడుకోవాలని కోరారు.కార్పొరేట్ అనుకూల విధానాలతోపాటు మతోన్మాదానికి వ్యతిరేకంగా స్కీం వర్కర్లు, కార్మికులు, రైతులు ఐక్యంగా ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. మధ్యాహ్న భోజన పథకానికి అధిక నిధులు కేటాయించాలని అఖిల భారత మిడ్డేమీల్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ మహాసభ ఆహ్వానసంఘం చైర్మెన్, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఆహ్వాన సంఘం వైస్ చైర్మెన్, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు కోరారు. మిడ్డేమీల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ రమ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనం కార్మికులకు పారితోషికం రూ.రెండు వేలు పెంచాలనీ, ఇతర సమస్యలను పరిష్కరించాలంటూ దశలవారీ పోరాటాలు చేస్తామనీ, అవసరమైతే ఫిబ్రవరిలో సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎం సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి, అంగన్‌వాడీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు ఉషా, ఆశా వర్కర్ల ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు సురేఖ, మిడ్డేమీల్ ఫెడరేషన్ జాతీయ నాయకులు స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

# అన్నింటా అధోగతే

### హిమాచల్‌లో 'డబుల్ ఇంజిన్' ట్రబుల్

**షిమ్లా :** బిజెపి నాయకులు ప్రచారం చేసే 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం హిమాచల్ ప్రదేశ్‌లో ఘోరంగా విఫలమైంది. ఓ వైపు కుంభకోణాలు.. మరోవైపు అసమర్థ నిర్వాకాలతో నిరుద్యోగాన్ని భారీగా పెంచారు. హిమాచల్ ప్రదేశ్‌లో ఈ నెల 12న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో డబుల్ ఇంజన్ నినాదంతోనే బిజెపి కాంగ్రెస్‌పై విజయం సాధించి అధికారం దక్కించుకుంది. 2017 నుంచి పరిపాలనలో ఉన్న జై రామ్ ఠాకూర్ ప్రభుత్వంపై ప్రస్తుతం ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. కేంద్రంలోనూ బిజెపి ప్రభుత్వమే అధికారంలో ఉన్నా రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లభించలేదని ప్రజలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో బిజెపి ప్రచారాన్ని ముమ్మరం చేసింది. 68 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ 'విజయ్ సంకల్ప్ అభియాన్' పేరిట యాత్రలను నిర్వహిస్తుంది. స్టార్ క్యాంపెనర్లను అధిక సంఖ్యలో దించింది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో సహా అనేక మంది కేంద్ర మంత్రులు ప్రచారంలో పాల్గొని, 'డబుల్ ఇంజిన్' అంటూ ఊదరగొడుతున్నారు.

**అవినీతి.. కుంభకోణాలు...**

అసమర్థ పాలనకు తోడు జై రామ్ ఠాకూర్ ప్రభుత్వం కుంభకోణాలు, అవినీతిలో కూరుకుపోయింది. పోలీస్ నియామకాల కోసం జరిగిన పరీక్షను మూడు నెలల తరువాత రద్దు చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ పరీక్ష పేపర్ లీకయినట్లు వార్తలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పరీక్షకు హాజరైన రెండు లక్షల మంది యువత తీవ్ర నిస్పృహలో ఉన్నారు. ఈ పేపర్ లీక్‌లో రూ.250 కోట్ల కుంభకోణం జరిగిందని దర్యాప్తులో వెల్లడయింది. ఈ స్కామ్‌లో సుమారు 200 మందిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ఎక్కువమంది అభ్యర్థులే. స్కామ్‌లో పాల్గొన్న అధికారుల్ని, బిజెపి నాయకుల్ని అరెస్టు చేయలేదు. హిమాచల్ ప్రదేశ్ యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్శిటీ, క్లస్టర్ యూనివర్శిటీ, మండి, ఐఐటీ మండి, హమీర్‌పూర్ ఐఐటి, మెడికల్ కాలేజ్, నెర్చోక్, హైడ్రో ఇంజినీరింగ్ కాలేజ్, బిలాస్‌పూర్, ఎయిమ్స్, బిలాస్‌పూర్ తదితర సంస్థల నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు ఉన్నాయి.

**నిధులివ్వని డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు**

ఈ ఐదేళ్ల కాలంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో ఎలాంటి అభివృద్ధి జరగలేదని హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. ప్రధానంగా విద్యారంగంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. విద్యారంగానికి బడ్జెట్‌లో కేటాయిస్తున్న నిధులనూ ప్రభుత్వం ఖర్చుచేయలేకపోయింది. కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్రంలోని విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. సమగ్ర శిక్షా అభియాన్ కింద ఆమోదించిన ప్రాజెక్టులకు కూడా కేంద్రం నిధులను కేటాయించలేదు. ఈ పథకం కింద 2019 నుంచి 2022 వరకూ రూ.437 కోట్లను కేంద్రం విడుదల చేయాల్సి ఉంది. ఆమోదించిన ప్రాజెక్టులకూ నిధులను విడుదల చేయకపోతే డబుల్ ఇంజిన్ ప్రభుత్వానికి అర్థం ఏముందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో



మోడీ, జై రామ్ ఠాకూర్

1,788 పోస్టులు, సెకండరీ ఎడ్యుకేషన్‌లో 473 పోస్టులు, కాలేజీల్లో 100కు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ వివరాలను ఈ ఏడాది అసెంబ్లీ వర్షకాల సమావేశాల్లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గోవింద్ ఠాకూర్ స్వయంగా వెల్లడించారు. రాష్ట్రంలోని విద్యారంగంలో ఇన్ని పోస్టులు ఖాళీగా ఉండటం ఇదే మొదటిసారని నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఖజానా ఖాళీగా ఉన్న కారణంగానే పోస్టులను భర్తీ చేయడం లేదని విమర్శిస్తున్నారు. కాలేజీల్లో వందకు పైగా ప్రిన్సిపాల్ పోస్టులు ఖాళీగా ఉండటంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ఖాళీల కారణంగా అనేక మంది సిబ్బందిని ఇతర కళాశాలల్లో డిప్యూట్ చేస్తున్నారు. ఇలా డిప్యూట్ చేసినప్పుడు సిబ్బందికి ఇచ్చే టిఎ, డిఎలను కూడా బిజెపి ప్రభుత్వం రద్దు చేసింది. వారంలో మూడు రోజులు ఒక కాలేజీకి, మరో మూడు రోజులు మరొక కాలేజీకీ పంపుతున్నారని అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉండికూడా ఖాళీలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శస్తున్నారు. విద్యారంగంలో పరిస్థితి ఇలా ఉంటే బిజెపి నాయకులు మాత్రం పాఠశాల సిలబస్‌లో భగవద్గీతను ప్రవేశపెడతాం వంటి ప్రకటనలతో ప్రజల ఐక్యతకు భంగం కలిగించేందుకు, మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నం చేశారు.

## సిపిఎం హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల




**సిమ్లా :** హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల మేనిఫెస్టోను సిపిఎం శుక్రవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఓంకార్ షాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో వామపక్ష ప్రత్యామ్నాయానికి ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. ప్రజా వ్యతిరేకంగా పాలన సాగిస్తున్న బిజెపిని ఓడించి, రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని అన్నారు. బిజెపి ప్రభుత్వం అత్యంత వేగంగా అమలు చేస్తున్న బడా కార్పొరేట్ల అనుకూల విధానాల వల్ల పేదలు, కార్మికులు, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ అంశాలపై ఆందోళనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సిపిఎం అభ్యర్థులు ఎన్నికైతే అసెంబ్లీలోనూ ఈ అంశాలను లేవనెత్తుతారని చెప్పారు. ప్రజా సంక్షేమ, ప్రజానుకూల విధానాలను ప్రభుత్వం చర్చించేలా, అమలు చేసేలా ఒత్తిడి చేస్తారని తెలిపారు. బిజెపి ఐదేళ్ల పాలనలో నిరుద్యోగం, పేదరికం అత్యధిక స్థాయిలో పెరిగాయని, వ్యవసాయం చేస్తున్న రైతులు, పండ్ల తోటల పెంపకందారులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. పలు ప్రభుత్వ శాఖల్లో 63 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రత్యేక హోదాను పునరుద్ధరించాలని, పాత పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలని, వ్యవసాయ, పండ్ల తోటల పెంపకందారులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని, కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని, నిరుద్యోగులకు రూ.3 వేలు అలవెన్సు ఇవ్వాలని కోరుతూ మేనిఫెస్టోను విడుదల చేశారు.




### మీకోసం

అప్పుడప్పుడు ఉప్పు షేకర్‌లోని ఉప్పు ముద్దలుగా మారి బయటికి సరిగా రాదు. అలాంటప్పుడు దానిలో కొన్ని బియ్యం గింజలు వేస్తే ఉప్పు సులభంగా బయటికి వస్తుంది.

### జీవన సౌరభం

రేపటి భవిష్యత్తు మరెక్కడో లేదు.
రోజువారీ దినచర్యలోనే ఉంది.






### లెక్క తేల్చండి

చిన్నారులూ...
ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లుగా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 516

## నేను గీసిన బొమ్మ



సి.దీక్షిక,
4వ తరగతి,
ఎంపిపి స్కూలు,
సామరాజుపల్లి,
గంగవరం మండలం,
చిత్తూరు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# ఆ పిల్లలకు 'గాడ్ మదర్'

**దేశం ఒకపక్క అభివృద్ధి చెందుతుందని చెప్పుకుంటున్నా... మరోపక్క పేద పిల్లలకు కనీస ప్రాధమిక విద్య కూడా అందడం లేదు. అటువంటి నిరుపేద పిల్లల అభివృద్ధికి ఆలిస్ 30 ఏళ్లుగా కృషి చేస్తున్నారు. వీధిపిల్లల్ని చేరదీసి వసతి కల్పించారు. వారికి ఉన్నత విద్యను అందించడమే కాకుండా జీవనోపాధికి మార్గనిర్దేశం చేస్తున్నారు. అందుకు తన ఆస్తులను సైతం అమ్మి ఎంతో మంది అనాధలకు తల్లి అయ్యారు.**



తమిళనాడులో పుదుచ్చేరికి చెందిన ఆలిస్ థామస్ తాను బాగుంటే చాలు అనుకోలేదు. తన చుట్టూ ఉన్న వాళ్లు బాగుండాలనుకునేవారు. అదే ఆమెను వందలాది మంది పిల్లలకు అమ్మను చేసింది. నగర శివార్లలో ఉన్న తన ఇంటి పరిసర ప్రాంతంలో ఒక గొడవ జరిగింది. అప్పుడు ఆమె వయస్సు 21 ఏళ్లు. ఇంటి నుంచి బయటకు వచ్చి చూసింది. ఆ వీధి చివరన ఒక బాలుడిని అతని తల్లిదండ్రులు వాతలు పడేలా కొట్టారు. ఈ క్రమంలో ఆ బాబు పెట్టిన కేకలు ఆలిస్ మనసును కలిచివేశాయి. ఆ రోజుకు సరిపడా డబ్బులు ఆ బాబు అడుక్కొని రాలేదని అతని తల్లిదండ్రులు చావబాదారు. కడుపు నింపుకునేందుకు తిండి లేక, తల్లిదండ్రులు తీసుకునే మత్తు పదార్థాలను తానూ అలవాటు చేసుకున్నాడు ఆ పదేళ్ల బాలుడు. దగ్గరకు వెళ్లి చూస్తే... ఆకలితో కడుపునొప్పితో మెలి తిరుగున్నాడు. ఆ స్థితి చూసి జాలివేసింది. తన వెంటబెట్టుకుని ఇంటికి తీసుకెళ్లింది. కడుపునిండా అన్నం పెట్టింది. ఈ సంఘటన తర్వాత ఆలిస్ ఆరోజు నిద్రపోలేదు.

డప్పింగ్, స్లమ్ ఏరియాలో ప్రతిరోజూ ఇటువంటి దృశ్యాలు సర్వసాధారణం. అటువంటి ఆ వీధిపిల్లల కోసం ఏదొకటి చేయాలనుకున్నారు. మాదకద్రవ్యాల వ్యసనాలు మాన్పించి మంచి మార్గంలో నడిచేలా చేయాలని నిర్ణయించుకున్నారు. అందుకు అవసరమైన వసతి కోసం తన ఆస్తిని అమ్మాలనుకున్నారు. ఆలిస్ ఆలోచనను కుటుంబ సభ్యులు మొదట నిరాకరించారు. ఆ వయస్సులో తన జీవితం గురించి ఆలోచించుకోమని సలహా ఇచ్చారు. ఆలిస్ ఆ పిల్లవాడి పట్ల ఆమె ప్రేమ, బాధ్యత చూసి వారిలో మార్పు కలిగింది. ఆమె నిర్ణయాన్ని గౌరవించి మద్దతుగా నిలిచారు. కొన్ని రోజుల తర్వాత ఆ పిల్లవాడు తనలాంటి దుస్థితిలో ఉన్న మరో ఇద్దరు స్నేహితులను ఆలిస్ నివాసానికి తీసుకువచ్చాడు. వారినీ చేరదీసిన ఆమె 'ఉధవి కరంగల్' సంస్థను స్థాపించారు.

**పిల్లలు పెరుగుతూ ...**

మొదట అణగారిన వర్గాలకు చెందిన బాలుర కోసం వసతిగృహం స్థాపించి వారికి ప్రాథమిక విద్యను నేర్పించారు. పెళ్లి, కుటుంబం గురించి ఆలోచించాల్సిన సమయంలో ఆ పిల్లల కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. నిత్యం వారిని అంటిపెట్టుకుని ఉండి, విద్యాబుద్ధులు నేర్పారు. వారికి ఉన్న చెడు అలవాట్లు మాన్పించేందుకు చాలా కష్టపడ్డారు. ఆ పిల్లలు రాత్రి వేళల్లో బయటకు వెళ్లడం, వీధుల్లో అడుక్కోవడం, దొంగతనాలు చేయడం, సినిమాలకు వెళ్లడం చేసేవారు. వారిలో మార్పు కోసం చాలా శ్రమించారు. రోజుల గడిచే కొద్దీ పిల్లల సంఖ్య పెరగడంతో, ఆమె ఆస్తిని అమ్మి, రెయిన్‌బో నగర్‌లో సొంత భవనం నిర్మించారు. కొన్నేళ్ల తర్వాత, బాలికల కోసం మరో వసతి గృహాన్నీ ఏర్పాటు చేశారు. వీరందరినీ చూసుకునేందుకు కొంతమంది సిబ్బందిని నియమించి వారికీ సౌకర్యం కల్పించారు. వలస కూలీల పిల్లలకు, లైంగిక వేధింపుల బాధితులైన వారికి వసతి కల్పించారు. ఆమె సహకారంతో కడలూరులో పెరియ కట్టుపాళయంలో జిప్సీ పిల్లల కోసం ఒక నివాస గృహం కూడా ఉంది. పిల్లలు, చదువులతో పాటు సంగీతం, నృత్యం, సిలంబం వంటి యుద్ధ కళలు, ఆటలు ఆడటం, వ్యర్థాలతో చేతిపనుల తయారీ, క్విజ్ , పబ్లిక్ స్పీకింగ్.. ఇలా వారికి నచ్చిన అనేక ఇతర కార్యకలాపాల్లో పాల్గొనేలా వసతి గృహాల్లో అవకాశాలు కల్పించారు.

**ఉన్నత స్థాయిలో పిల్లలు**

ఎన్జీఓ స్థాపించి 30 ఏళ్లయిన సందర్భంగా ఇక్కడ చదువుకున్న పిల్లలంతా ఆలిస్‌ను కలిసేందుకు వచ్చారు. వారంతా ఆమెను కౌగలించుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఇప్పుడు తాము ఏఏ రంగాల్లో స్థిరపడ్డారో చెప్పుకొచ్చారు. ఇక్కడ పెరిగిన గణేష్ ఇప్పుడు చెన్నైలోని ఒక ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తండ్రి లేని గణేష్‌ను తల్లి ఒక్కతే పెంచడం కష్టమైంది. దాంతో గణేష్ బాల్యంలోనే ఆలిస్ వసతిగృహంలో పెరిగాడు. ఇప్పుడు పని మనిషిగా పనిచేస్తున్న తన తల్లి కళ్లలో వెలుగు చూసి సంతోషపడుతున్నాడు. రమేష్ చిన్న తల్లిని అతని తండ్రే హత్య చేశాడు. అది చూసిన రమేష్ చాలారోజులు ఎవరితోనూ మాట్లాడలేదు. తండ్రి జైలుకెళ్లడంతో అనాధగా ఆలిస్ దగ్గరకు చేరాడు. ఆమె పెంచి, పెద్ద చేసింది. క్యాటరింగ్ టెక్నాలజీలో గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన రమేష్ కోయంబత్తూర్‌లో పెద్ద హోటల్లో ఉద్యోగం చేస్తూ లక్ష రూపాయల జీతం తీసుకుంటున్నాడు. ప్రస్తుతం అమ్మమ్మ దగ్గరే ఉంటూ చెల్లికి పెళ్లి చేశాడు. అనాధైన తమిళసెల్వన్ కూడా ఓ ప్రైవేట్ స్కూల్లో హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. గిరిజన తెగకు చెందిన అమ్మాయి బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి తిండివనంలోని ఓ ఆస్పత్రిలో ఉంది. మరో ఇద్దరు గిరిజన బాలికలు కంప్యూటర్ సైన్స్‌లో ఎమ్మెస్సీ చదువుతున్నారు. ఇలా ఆలిస్ దగ్గర పెరిగిన వారంతా రకరకాల రంగాల్లో ఉపాధి పొందుతూ జీవితంలో స్థిరపడ్డారు. వీరందరినీ చూసిన అలిస్ కళ్లలో ఆనందభాష్పాలు కురిశాయి. 'దేశవ్యాప్తంగా అనాధలకు పునరావాసం కల్పించి, ప్రాథమిక విద్యను అభ్యసించేలా చేయడమే నా లక్ష్యం' అంటున్న ఆలిస్ వేలమందికి ఆశ్రయం కల్పించి గాడ్ మదర్ అయ్యారు.


## కాళ్ల పగుళ్లు తగ్గాలంటే..

చలి కాలంలో చాలా మందిని ఇబ్బంది పెట్టే విషయం కాళ్ళ పగుళ్లు. ఆ పగుళ్ల మంట చాలా బాధిస్తుంటుంది. నడవడానికి ఇబ్బందిగా ఉంటుంది. ఇవి తగ్గడానికి ఎన్నో రకాల క్రీములను రాస్తూ ఉంటాం. అయినా నొప్పి మాత్రం తగ్గకుండా ఉంటుంది. ఇలాంటి సమయంలో కొన్ని చిట్కాలు పాటించడం వల్ల కాళ్ళ పగుళ్ల నొప్పులను తగ్గించుకోవచ్చు.

- కలబంద జెల్‌లో కొద్దిగా పసుపుని కలిపి కాళ్ల పగుళ్ళకు రాస్తే వెంటనే బాధ నుంచి విముక్తి లభిస్తుంది.
- అరకప్పు కొబ్బరి నూనెలో 10 వేపాకులు, చిటికెడు పసుపు, చిటికెడు కర్పూరం కలిపిన మిశ్రమాన్ని పగుళ్ళకు రాస్తే వెంటనే తగ్గిపోతాయి.
- బొప్పాయి గుజ్జులో కొన్ని చుక్కల నిమ్మరసం కలిపి మెత్తగా చేసి పగిలిన పాదాలకు రాస్తే మురికి పోవడమే కాకుండా పగుళ్లు కూడా తగ్గుతాయి.
- పావు బకెట్ నీళ్లలో చెంచా కొబ్బరి నూనె, చెంచా వంటసోడా, చెంచా విటమిన్ ఈ నూనె వేసి పావు గంట సమయం కాళ్ళు అందులో పెట్టి ఉంచండి. ఇలా వారానికి ఒక్కసారి చేసిన పాదాలు మృదువుగా అవుతాయి.
- గోరువెచ్చటి నీటిలో కాళ్ళు నానబెట్టి కొద్దిగా గరుకుగా ఉండే రాయితో రుద్దినా కాళ్ళ పగుళ్లు తగ్గుతాయి.
- గోరింటాకును బాగా రుబ్బి పగుళ్లు ఉన్న చోట రాసుకొని ఎండిపోయిన తర్వాత కడిగేసుకోవాలి. ఇలా చేయడం వల్ల పగుళ్లు తగ్గడమే కాక నొప్పి నుంచి కూడా ఉపశమనం కలుగుతుంది.
- నువ్వుల నూనెను గోరువెచ్చగా చేసి రాత్రి పడుకోబోయే ముందు పాదాలకు మర్దనా చేయాలి. పగుళ్లు తగ్గి, మృదువుగా ఉంటాయి.
- ఆముదం, కొబ్బరి నూనెను సమానంగా తీసుకొని, కొంచెం పసుపు పొడి కలిపి పాదాలకు రాస్తూ ఉంటే పగుళ్ళు దూరమవుతాయి.
- రాత్రిపూట నిద్ర పోవడానికి ముందు పాదాలను శుభ్రంగా కడిగి కొబ్బరి నూనె రాసుకోవడం వల్ల పగుళ్ళు ఏర్పడకుండా ఉంటాయి.



## 'ఖుషి' విడుదల వాయిదా



విజయ్ దేవరకొండ నటిస్తున్న తాజా చిత్రం 'ఖుషి' విడుదల తేదీ వాయిదా పడినట్లు తెలుస్తోంది. సమంత హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి శివ నిర్వాణ తెరకెక్కిస్తున్నారు. క్రిస్మస్ కానుకగా డిసెంబర్‌లో విడుదల చేస్తామని గతంలో మేకర్స్ ప్రకటించారు. కానీ, ఈ మూవీ షూటింగ్ కొనసాగడం లేదు. తాజాగా విజయ్ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో భాగంగా పలు కారణాల వల్ల సినిమా విడుదలను వచ్చే ఏడాదికి వాయిదా వేయాల్సి వచ్చిందని విజయ్ దేవరకొండ చెప్పారు. "ఖుషి మూవీ షూటింగ్ ఇప్పటికే 60 శాతం పూర్తయింది. మేం సినిమాను డిసెంబర్‌లో విడుదల చేయాలనుకున్నాం. కానీ, అనేక కారణాల వల్ల ఈ చిత్రం వాయిదా పడింది. ప్రస్తుతం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రిలీజ్ చేయాలనే ఆలోచనలో ఉన్నాం' అని పేర్కొన్నారు. ఈ సినిమాలో జయరాం, సచిన్ ఖడ్గేకర్, మురళి శర్మ, వెన్నెల కిశోర్, లక్ష్మీ, రోహిణి, అలీ, రాహుల్ రామకృష్ణ కీలక పాత్రలు పోషిస్తున్నారు.



## నా క్యారెక్టర్ ఏంటనేది... సస్పెన్స్!

**- ఉన్ని ముకుందన్**

సమంత టైటిల్ పాత్రలో నటించిన సినిమా 'యశోద'. శ్రీదేవి మూవీస్ పతాకంపై ప్రముఖ నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మించారు. హరి, హరీష్ దర్శకత్వం వహించారు. ఇందులో ఉన్ని ముకుందన్ ఓ ప్రధాన పాత్రలో నటించారు. 'జనతా గ్యారేజ్', 'భాగమతి', 'ఖిలాడీ' తర్వాత ఆయన నటించిన తెలుగు చిత్రమిది. నవంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఉన్ని ముకుందన్ మీడియాతో ముచ్చటించారు.

'తెలుగులో మూడు సినిమాలు చేశాను. ప్రతి సినిమాలో మంచి క్యారెక్టర్ ప్లే చేశా. ఇప్పుడు 'యశోద'లో సమంతతో కలిసి నటించా. ఆమె చాలా టాలెంటెడ్ యాక్టర్. నటుడిగా నా విషయానికి వస్తే... కథ ఎలా ఉంది? అందులో నా పాత్ర ఏమిటి? అని చూస్తాను. ఆ పాత్రలో నేను ఎంత చేయగలను? అనేది ఆలోచిస్తా. నటుడిగా కొత్తదనం చూపించడం కూడా ముఖ్యమే కదా! దర్శకులు హరి, హరీష్ కథ చెప్పినప్పుడు వెంటనే ఓకే చెప్పేశా. ప్రస్తుతానికి నా క్యారెక్టర్ గురించి ఎక్కువ చెప్పలేను. ఎందుకనేది మీరు సినిమా చూస్తేనే తెలుస్తుంది. నేను వెంటనే ఓకే చెప్పడానికి కారణం కూడా కథే. 'యశోద' ఫ్యూచరిస్టిక్ స్టోరీ ఐడియా. మన సొసైటీ ఎటు వెళుతుందనేది చూపిస్తున్నారు. త్వరలో అది రియాలిటీగా మారుతుంది. ఈ సినిమా సరోగసీపై నేపథ్యంలో సాగుతుంది. సరోగసీ అనేది చెప్పడం సులభమే. కానీ, అదొక ఎమోషనల్ జర్నీ. ఈజీగా దానిపై కామెంట్ చేయకూడదు.' అన్నారు.

## 'గాలోడు' ట్రైలర్ విడుదల



జబర్దస్త్ నటుడు సుధీర్ హీరోగా 'గాలోడు' చిత్రం నవంబరు 18న విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రమోషన్లలో భాగంగా తాజాగా ట్రైలర్ విడుదల చేశారు. గెహ్నా సిప్పి హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ చిత్రానికి రాజశేఖర్ రెడ్డి పులిచర్ల దర్శకత్వం వహించారు. ప్రకృతి సమర్పణలో సంస్కృతి ఫిలింస్ నిర్మించింది. రెండున్నర నిమిషాల నిడివి గల ట్రైలర్‌లో డైలాగ్స్ ఆసక్తికరంగా ఉన్నాయి. సప్తగిరి కామెడీ టైమింగ్ ట్రైలర్‌కు అదనపు ఆకర్షణగా నిలిచింది.

## ముగ్గురు ప్రముఖుల కొత్త ప్రాజెక్టు



ముగ్గురు ప్రముఖ దర్శక నిర్మాతల కలయికలో కొత్త సినిమా రూపుదిద్దుకోనుంది. సుకుమార్, బాలీవుడ్ దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ నిర్మాత అభిషేక్ అగర్వాల్.. ఈ ముగ్గురూ కలసి పని చేయబోతున్నారు. 'సినిమాతో ఇండియాని ఏకం చేయడం. వివరాలు త్వరలో. ఊహించండి. సుకుమార్, అభిషేక్ అగర్వాల్' అని ట్వీట్ చేసిన వివేక్ వారి సమావేశానికి సంబధించిన ఫొటోలను పంచుకున్నారు.

## 'శబరి' విశాఖ షెడ్యూల్ పూర్తి



వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'శబరి'. తాజాగా మూడో షెడ్యూల్ పూర్తి చేసుకుంది. విశాఖ ఆర్కే బీచ్, సిరిపురం జంక్షన్‌తో పాటు అరకు లాంటి లొకేషన్లలో షూటింగ్ చేశాం. అక్కడ ప్రధాన తారాగణంపై కొన్ని యాక్షన్ సీక్వెన్సులు, ఒక పాట, కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించారు. నందు, నూర్ మాస్టర్స్ పర్యవేక్షణలో రూపొందిన ఈ యాక్షన్ సీన్స్ సినిమాకే హైలెట్‌గా నిలుస్తాయని చిత్ర బృందం తెలిపింది. నాలుగో షెడ్యూల్ ఈ నెలలో హైదరాబాద్‌లో మొదలు కానుంది. దాంతో సినిమా చిత్రీకరణ పూర్తి అవుతుంది. నవంబర్ చివరి వారంలో పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలు కానున్నాయి.




Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68